


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ


నేటి నుంచి తెలంగాణలో బార్ అండ్ రెస్టారెంట్ల బంద్

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు చివరి అవకాశం

హైదరాబాద్‌లో 'ఫామ్–7' కలకలం **10**

సంపుటి 29, సంచిక: 106 | సోమవారం | 05-10-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

## జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలని

# నిరసన జ్వాలలు

దేశ రాజధాని, ఆర్థిక రాజధానిలో మిన్నంటిన నిరసన ప్రదర్శనలు





ముంబయిలో



● ముంబయిలో శివసేన యుబిటి, ఎంఎన్ఎస్ ఆధ్వర్యంలో వేలాది మందితో 'విరాట్ గర్జన మోర్చ' ● సిఇసి అధికార బిజెపికి ఆయుధంలా మారారని ఆగ్రహం ● జంతర్‌మంతర్ వద్ద మూడవరోజూ కొనసాగిన ఉద్రిక్తత ● ప్రతిపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాలు జంతర్‌మంతర్ వైపు భారీ ర్యాలీ ● అడ్డుకున్న పోలీసులు, తోపులాటలు

**న్యూఢిల్లీ :** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటుతున్నాయి. ఒకవైపు దేశరాజధాని ఢిల్లీలో జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీలు నాయకులు, యువజన, విద్యార్థి సంఘాలు జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుండగా, మరోవైపు ఆర్థిక రాజధాని ముంబయిలో కాంగ్రెస్ జనతా పార్టీ (సిజెపి) నిరసన కార్యక్రమం నిర్వహించింది. తాజాగా ఆదివారం ముంబయిలో శివసేన (యుబిటి), ఎంఎన్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మహారాష్ట్ర ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియను రద్దు చేయాలని ఎంఎన్ఎస్ నేత రాజ్‌థాక్రే డిమాండ్ చేయగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అధికారంలో ఉన్న బిజెపికి ఆయుధంలా వ్యవహరిస్తున్నారని శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాక్రే ఆరోపించారు. సిఇసికి వ్యతిరేకంగా ముంబయిలో థాక్రే సోదరుల (కజిన్స్) నేతృత్వంలో జరిగిన నిరసన ర్యాలీలో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ నేతలు బాలాసాహెబ్ థోరట్, విజయ్ వడెట్టివార్‌తో పాటు శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి (ఎస్‌పి)కి చెందిన జయంత్ పాటిల్, శశికాంత్ షిండే, జితేంద్ర అవ్హాడ్, అనిల్ దేశ్‌ముఖ్ పాల్గొన్నారు. ఈ ర్యాలీ మెట్రో సినిమా వద్ద ప్రారంభమై, దక్షిణ ముంబయిలోని బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం వరకు సాగింది. ర్యాలీలో పార్టీ జెండాలను అనుమతించలేదు, కేవలం జాతీయ త్రివర్ణ పతాకాన్ని మాత్రమే తీసుకురావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. 'విరాట్ గర్జన మోర్చా' (భారీ గర్జన ర్యాలీ)గా పిలువబడిన ఈ ఆందోళనలో పాల్గొన్నవారు 'సర్' ప్రక్రియలో జరిగిన అక్రమాల కారణంగా సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని లేదా ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో భవిష్యత్తు ఎన్నికలను పేపర్ బ్యాలెట్ ద్వారా నిర్వహించాలని రాజ్ థాక్రే డిమాండ్ చేశారు. అలాగే మహారాష్ట్రలో సర్ ప్రక్రియను తరువాయి 8లో

## బారికేడ్లు ఛేదిస్తూ..



● ఢిల్లీలో మూడోరోజూ ఆందోళనలు
● జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్
● గుర్తుతెలియని వాహనంలో నేహా బోరా తరలింపు

**న్యూఢిల్లీ :** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పదవి నుండి వైదొలగాలని,న్యాయ విచారణ ఎదుర్కోవాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వామపక్షాలు, ఐసా(ఎఐఎస్ఎ),కాంగ్రెస్‌పార్టీ,ఆమ్ ఆద్మీపార్టీ(ఆప్) ఇతర సివిల్ సొసైటీ గ్రూపులు చేపట్టిన ఆందోళన ఆదివారంనాటికి మూడోరోజుకు చేరింది.ఐసా కార్యకర్తలు ఆంధ్రాభవన్ సర్కిల్ నుండి అశోకా రోడ్ వరకూ ప్రదర్శకుల కేంద్రీకరణ,వారి కదలికలు కొనసాగాయి.వారంతా జంతర్ మంతర్ దిశగా భారీ ప్రదర్శన నిర్వహించేందుకు ప్రయత్నం చేశారు. జంతర్ మంతర్‌ను ముట్టడించేందుకు పోలీస్‌లు తిరస్కరించారు. ప్రదర్శకులను అడ్డుకున్నారు. బ్యారికేడ్లు దాటేందుకు ప్రయత్నం చేసిన నిరసన తరువాయి 8లో

## మహిళా జర్నలిస్టులపై పోలీసులు లైంగిక వేధింపులు



● దర్యాప్తు చేపట్టిన క్రైమ్ బ్రాంచ్
● బాధ్యులపై ఎఫ్ఐఆర్, చర్యలు తీసుకోవాలని ప్రియాంకాగాంధీ డిమాండ్

**న్యూఢిల్లీ :** కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రెండు రోజులుగా ఆందోళనకారులు నిరసనలు కొనసాగిస్తున్నారు. శనివారం నిరసన జరుగుతున్న తరువాయి 8లో

## ఎస్ఎల్‌బిసిలో క్లిష్ట దశ దాటాం

● సొరంగంలో షియర్ జోన్‌ను దాటిన తవ్వకాలు
● పనుల్లో వేగం పెంచేందుకు మార్గం సుగమం
● 2028 జూన్ నాటికి నీటి సరఫరా లక్ష్యం
● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బిసి) సొరంగం పనుల్లో అత్యంత క్లిష్టమైన దశను అధిగమించామని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో ప్రమాదం జరిగిన ప్రాంతంలోని బలహీన శిలల మండలమైన షియర్ జోన్‌ను సురక్షితంగా దాటడంతో ఇక తవ్వకాల వేగం పెంచేందుకు మార్గం సుగమమైందన్నారు. బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో చేశారు.ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కీలక నీటి పారుదల ప్రాజెక్టులపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో ఆదివారం నిర్వహించిన సమీక్షలో ఎస్ఎల్‌బిసి పురోగతిని మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఎల్‌బిసి సొరంగం పనులను మరింత వేగవంతం చేసేందుకు అదనపు యంత్రాలను సమకూర్చి, తవ్విన పదార్థాలను బయటకు తరలించే వ్యవస్థను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. పనుల వేగంతోపాటు కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని తరువాయి 8లో

## 7 నుంచి 'సారస్' మేళా

● గ్రామీణ మహిళల ఉత్పత్తులకు నగర మార్కెట్
● 18 వరకు ఐమాక్స్ థియేటర్ హెచ్ఎండిఎ గ్రౌండ్స్‌లో నిర్వహణ ● మన ఆడబిడ్డలు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయాలి : మంత్రి సీతక్క



ప్రజాపక్షం/హైదరాబాద్

ఒకవైపు పోచంపల్లి, గద్వాల, నారాయణపేట చేనేత చీరల వైభవం, మరోవైపు గ్రామీణ మహిళల చేతుల్లో రూపుదిద్దుకున్న హస్తకళలు, పచ్చళ్లు, పిండి వంటలు, మిల్లెట్ ఉత్పత్తులు.. దేశంలోని వివిధ ప్రాంతాల ప్రత్యేకతలు ఒకే వేదికపై కొలువుదీరనున్నాయి. గ్రామీణ మహిళలు, కళాకారులు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు పట్టణ మార్కెట్‌ను కల్పించే లక్ష్యంతో 'సారస్' మేళాను ఈనెల 7 నుంచి 18వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. ఐమాక్స్ థియేటర్ పక్కన ఉన్న హెచ్ఎండిఎ గ్రౌండ్స్‌లో ఈ ప్రదర్శన జరగనుంది. తెలంగాణ ప్రభుత్వ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సెర్ప్ ద్వారా నిర్వహించే ఈ మేళాలో తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా పారిశ్రామికవేత్తలు వందల సంఖ్యలో స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. గ్రామీణ ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం, మహిళా పారిశ్రామికతను ప్రోత్సహించడంలో సారస్ మేళా కీలకంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. తయారీదారులు నేరుగా వినియోగదారులను కలుసుకోవడం ద్వారా ఉత్పత్తుల నాణ్యత, ప్యాకేజింగ్, మార్కెట్ అవసరాలను తరువాయి 12లో



## న్యూ ఇహెచ్‌ఎస్‌లో మరో 25 వెల్‌నెస్ సెంటర్స్

● ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం
● పథకానికి లభిస్తున్న విశేష ఆదరణ ● ప్రస్తుతం 919 ఆసుపత్రులలో చికిత్సలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు,వారి కుటుంబ సభ్యుల కోసం ఇటీవలే అమలులోనికి వచ్చిన 'న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్' (ఎన్ఈహెచ్ఎస్)కు మంచి స్పందన లభిస్తున్న నేపథ్యంలో మరో 25 వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఇందులో 21 కేంద్రాలను వివిధ జిల్లాల్లో, మిగిలిన నాలుగు కేంద్రాలను హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే వెల్‌నెస్ కేంద్రాల సంఖ్య 37కు చేరుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం 12 జిల్లాల్లో 12 వెల్‌నెస్ కేంద్రాలు ఉన్నాయి. జులై 17న ప్రారంభమైన 'ఎన్ఈహెచ్ఎస్' ప్రస్తుతం 919 ఆస్పత్రులలో చికిత్సలు అందుతున్నాయి. ఇప్పటి వరకు 15,395 చికిత్సలకు రూ.104.63 కోట్ల ముందస్తు అనుమతులు ఇవ్వగా, వీటిలో 778 ప్రైవేటు, 141 ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నట్టు ప్రభుత్వ వర్గాలుపేర్కొన్నాయి. కాగా సెప్టెంబర్ 1 నుంచి పోలీసు శాఖను కూడా ఈ పథకంలో చేర్చారు.ఆస్పత్రిలో చేరి చికిత్స పొందే సేవలతో పాటు ఔట్ పేషంట్ సేవలను కూడా ఈ పథకంలో చేర్చారు. వెల్‌నెస్ కేంద్రాల్లో వైద్యుల సంప్రదింపులు, పరీక్షలు, మందులను నగదురహితంగా అందిస్తున్నారు. ప్రస్తుతం 12 జిల్లాల్లో 12 వెల్‌నెస్ కేంద్రాలు పని చేస్తున్నాయి. ఇన్‌పేషంట్ వైద్య సేవలకు 1,816 సిజిహెచ్ఎస్ చికిత్స ప్యాకేజీలను అమలు తరువాయి 8లో

## రావాల్సిన వాటా తీసుకుంటాం

### అవసరమైతే లాక్కుంటాం

● తెలంగాణలో బిసి వ్యక్తి సిఎం అవుతాడు
● కులగణనపై మోదీ, అమిత్ షా వద్దకు వెళ్లి చెప్పే దమ్ము బిజెపి ఎంపిలు, ఎమ్మెల్యేలకు లేదు
● 'ఒబిసి సింహగర్జన' మహాసభలో టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



ప్రజాపక్షం/రంగారెడ్డి

కులాలను పక్కనపెట్టి బిసీలమంతా ఏకం కావాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలం గొల్లపల్లిలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఒబిసి సింహగర్జన' మహాసభ టిపిసిసి ఒబిసి ఛైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మహేష్ కుమార్ గౌడ్, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎఐసిసి ఒబిసి ఛైర్మన్ డాక్టర్ అనిల్ జైహింద్ యాదవ్, ఎఐపిసి ఛైర్మన్ మధు యాస్కీ గౌడ్, సిడబ్ల్యూసి నాయకుడు చల్లా వంశీచంద్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు తరువాయి 12లో

## పోలీసు దాడిలో ఎఐఎస్ఎఫ్ కార్యకర్త

# కాలికి తీవ్ర గాయం

● కాలు విరిగినా చెక్కుచెదరని బాలిక చిరునవ్వు ● వాళ్ళు పోరాటం చేసేది మనందరి భవిత కోసమే ● ఎఐఎస్ఎఫ్ కార్యకర్త ఖుష్బూకు సిపిఐ నాయకుల పరామర్శ



**న్యూఢిల్లీ:**దేశంలో గొప్ప సానుకూల మార్పు సాధించాలని జనరేషన్ జెడ్ మొక్కవోని దీక్షతో ఉంది. అలాంటి చిత్తశుద్ధి, దీక్షకు ప్రతిరూపమే ఎఐఎస్ఎఫ్(అఖిల భారత విద్యార్థి సమాఖ్య) ఢిల్లీ శాఖకు చెందిన బాలిక కామ్రేడ్ ఖుష్బూ. ప్రజాస్వామ్య రక్షణకోసం బాలిక ఖుష్బూ గళమెత్తి నినదించింది. ఓట్‌చోరీకి పాల్పడిన కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసన ప్రదర్శన సందర్భంగా పోలీసులు తరువాయి 12లో

## మామునూరు ఎయిర్‌పోర్టు పేరేంటి?

● కొనసాగుతున్న ఉత్కంఠ
● తెరపైకి రాణి రుద్రమ, కాకతీయ, సమ్మక్క సారలమ్మ, పివి నర్సింహారావు, దొడ్డి కొమురయ్య, అల్లా ఉద్దీన్ పేర్లు




ప్రజాపక్షం/హనుమకొండ

వరంగల్ మామునూరు ఎయిర్ పోర్టు నిర్మాణానికి అడుగులు వేగంగా పడు తున్న వేళ.. మరో ఆసక్తికర చర్చ మొదలైంది. ఎయిర్ పోర్టు కు ఏ పేరు పెట్టాలి? అన్న దానిపై పార్టీ అధికారిక ఎక్స్ ఖాతాలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజల నుంచి సూచనలు కోరడంతో రోజుకో కొత్త పేరు తెరపైకి వస్తోంది. సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, నెటిజన్లు తమకు నచ్చిన పేర్లను సూచించారు. దీంతో మామునూరు ఎయిర్ పోర్టు పేరు ఇప్పుడు ఓరుగల్లు చరిత్ర, కాకతీయుల వారసత్వం, తెలంగాణ సాంస్కృతిక స్ఫూర్తి, ప్రముఖుల సేవల చుట్టూ తిరుగు తోంది. ఇదిలా ఉండగా ఎయిర్ పోర్టు నిర్మాణశైలి కాకతీయ కళావైభవం ఉట్టిపడేలా ఉండాలని సిఎం సూచించడంతో ఓరుగల్లు సంస్కృతి, కాకతీయ కళావైభవం ప్రపంచానికి మరింత లోతుగా తెలిసే విధంగా నిర్మించ బోతున్నారు. కాగా తెలంగాణ ఉద్యమకారులు,నాటి సాయుధ పోరాట వరసులు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని డిమాండ్ చేస్తుండగా అంబేద్కర్ సంఘాల నాయకులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.దీంతో మామునూరు విమానాశ్రయంకు ఏ పేరు ఫైనల్..? అని ప్రతి ఒక్కరూ చర్చించుకుంటున్నారు. విమానాశ్రయం పేరుపై తొలుత తరువాయి 12లో

## ఈసారి దాడిచేస్తే తీవ్ర ప్రతిఘటన

ట్రంప్‌కు అబ్బాస్ అరాఘ్చి హెచ్చరిక

పోరాటంలో బలమైన స్థానంలో ఉన్నామని స్పష్టీకరణ

**టెహ్రాన్:** అమెరికా గనుక మళ్ళీ దాడిచేస్తే ఈసారి తీవ్రస్థాయిలో ప్రతిఘటిస్తామని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి హెచ్చరించారు. దౌత్య కార్యకలాపాలు నిర్వహించడంలోనూ,ఆత్మరక్షణ విషయంలోనూ ఇరాన్ అత్యంత బలమైన స్థానంలో ఉందని ఆయన ఉద్ఘాటించారు. ఈసారి అమెరికా గనుక దాడిచేస్తే ఊహించనిరీతిలో అత్యాధునిక ఆయుధాలతో దెబ్బతీస్తామని అన్నారు. టెహ్రాన్‌లో ఆదివారం విదేశీ రాయబారులు,దౌత్య కార్యాలయ అధిపతులను ఉద్దేశించి ప్రసంగిస్తూ,''శత్రువు మరోసారి ఘర్షణ మార్గం ఎంచుకుంటే గతంకంటే భిన్నంగా బలంగా,వినూత్నంగా ప్రతిఘటిస్తాం, అదేసమయంలో ఎంతో గౌరవప్రదంగా, దౌత్య చర్యలకు కూడా ఇరాన్ సిద్ధంగా ఉంది'' అని చెప్పారు. న్యూయార్క్‌లో తరువాయి 12లో

కాలాతీత రచన

# ఒక రచన ఆలోచనలను మార్చేస్తుంది!

మనిషి ఆలోచనలను మార్చివేసి, ఒత్తిడి లేకుండా మెరుగైన జీవితాన్ని గడిపేందుకు మార్గాన్ని చూపే రచనలు చాలా తక్కువ. అలాంటి అరుదైన పుస్తకాల జాబితాలో, ముందు వరుసలో నిలుస్తుంది రిచర్డ్ కార్ల్సన్ రాసిన 'డోన్ట్ స్వెట్ ది స్మాల్ స్టఫ్ అండ్ ఇట్స్ ఆల్ స్మాల్ స్టఫ్'. ప్రతి చిన్న విషయానికీ ఎక్కువగా ఆలోచించడం, ఒత్తిడికి గురికావడం తగదని వివరించే ఈ పుస్తకాన్ని ఒక ప్రముఖ స్వీయాభివృద్ధి గ్రంథంగా పేర్కోవచ్చు. మనశ్శాంతి, భావోద్వేగ నియంత్రణ, రోజువారీ జీవితాన్ని మరింత ప్రశాంతంగా గడపడం వంటి అంశాలను చాలా సరళమైన భాషలో ఈ పుస్తకం చర్చిస్తుంది. మన జీవితాన్ని పెద్ద సమస్యలే ఎక్కువగా కలవరపెడుతున్నాయని మనం అనుకుంటాం. కానీ వాస్తవానికి రోజువారీ జీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న సంఘటనలే చాలాసార్లు మన ప్రశాంతతను ఎక్కువగా దెబ్బతీస్తుంటాయి. ఎవరో మన మాట వినకపోవడం, ట్రాఫిక్‌లో చిక్కుకోవడం, ఎవరైనా ఆలస్యంగా రావడం, మనకు నచ్చని వ్యాఖ్య వినడం, పని అనుకున్న సమయానికి పూర్తికాకపోవడం, ఇతరులు మన గురించి ఏమనుకుంటున్నారో ఆలోచించడం వంటి విషయాలు మనలో కోపం, అసహనం, ఆందోళన, నిరాశలను కలిగిస్తాయి. ఈ సాధారణ మానవ అనుభవాన్నే కేంద్రంగా చేసుకుని కార్ల్సన్ తన ఆలోచనలను వివరిస్తాడు. 'ప్రతి చిన్న విషయాన్నీ జీవితంలో అత్యంత ముఖ్యమైన సమస్యగా భావించాల్సిన అవసరం లేదు' అనేది పుస్తకం చెప్పే ప్రధాన సందేశం. వినడానికి ఇది సరళంగా, సాధారణమైన సలహాలా అనిపించినప్పటికీ, ఆచరణలో పెట్టడం అంత సులభం కాదు. మనిషి మనస్సు సహజంగానే సమస్యలను గుర్తించడానికి, గత సంఘటనలను తిరిగి గుర్తుచేసుకోవడానికి, భవిష్యత్తు గురించి ఆందోళన చెందడానికి, ఇతరుల ప్రవర్తనకు అర్థాలు వెతకడానికి అలవాటు పడుతుంది. ఒక చిన్న సంఘటన జరిగిన తర్వాత కూడా దాని గురించి మనం గంటల తరబడి ఆలోచిస్తూ ఉంటాం. చాలాసార్లు అసలు సంఘటన కంటే, దాని గురించి మనం మనసులో నిర్మించుకునే కథే మనకు ఎక్కువ బాధ కలిగిస్తుంది. ఈ అలవాటును గుర్తించి, మన ప్రతిస్పందనలను మార్చుకోవడమే కార్ల్సన్ సూచించే మార్గం. మన జీవితంలో జరిగే ప్రతి సంఘటనను మనం నియంత్రించలేం. అయితే ఆ సంఘటనకు మనం ఎలా స్పందించాలో కొంతవరకు నియంత్రించగలం. ఉదాహరణకు, ట్రాఫిక్‌లో చిక్కుకోవడం మన చేతిలో ఉండదు. కానీ ఆ సమయంలో కోపంతో హారన్ కొడుతూ, ఇతర డ్రైవర్లను తిట్టుకుంటూ మనశ్శాంతిని కోల్పోవాలా? లేక ఇది ప్రస్తుతం మన నియంత్రణలో లేని పరిస్థితి అని అంగీకరించి ప్రశాంతంగా ఉండాలా? అనేది మన ఎంపిక. ఇదే పుస్తకంలోని ప్రధాన ఆలోచన. సంఘటనలను పూర్తిగా మార్చలేకపోయినా, వాటికి మనం ఇచ్చే అర్థాన్ని, వాటిపై మన భావోద్వేగ ప్రతిస్పందనను మార్చుకోవచ్చు. చాలా చిన్న సంఘటనలకు మనం అవసరానికి మించిన ప్రాధాన్యం ఇస్తుంటాం. ఎవరైనా క్యూలో మనకంటే ముందుకు వెళ్లడం, సహోద్యోగి మన ఆలోచనను ప్రశంసించకపోవడం, ఇంట్లో ఎవరో వస్తువును సరైన చోట పెట్టకపోవడం, మనం పంపిన సందేశానికి వెంటనే సమాధానం రాకపోవడం, ఎవరైనా నెమ్మదిగా వాహనం నడపడం, రైలు లేదా విమానం ఆలస్యం కావడం వంటి విషయాలు మనకు అప్పటికప్పుడు చాలా పెద్దవిగా అనిపించవచ్చు. కానీ, కొన్ని గంటలు లేదా రోజులు గడిచిన తర్వాత వాటి ప్రాధాన్యం ఎంత తగ్గిపోతుందో గమనిస్తే మనమే ఆశ్చర్యపోతాం. అయినప్పటికీ సంఘటన జరిగిన క్షణంలో దానిని మనసులో పెద్ద సమస్యగా మార్చుకోవడం వల్ల మన సమయం, శక్తి, ప్రశాంతత వృథా అవుతాయి. కొన్ని విషయాలను వెంటనే స్పందించకుండా అలాగే వదిలేయడం కూడా ఒక ముఖ్యమైన జీవన నైపుణ్యమని పుస్తకం సూచిస్తుంది. ఇదే సందర్భంలో 'అన్నింటినీ నియంత్రించాలి' అనే మనిషి సహజమైన కోరికను కూడా కార్ల్సన్ ప్రశ్నిస్తాడు. విశ్లేషిస్తాడు. మన కుటుంబ సభ్యులు మనకు నచ్చినట్లుగా ప్రవర్తించాలని, స్నేహితులు మన అంచనాలకు అనుగుణంగా ఉండాలని, సహోద్యోగులు మనతో ఎప్పుడూ సహకరించాలని, పరిస్థితులు మన ప్రణాళిక ప్రకారం సాగాలని మనం కోరుకుంటాం. కానీ జీవితం అలా ఉండదు. ఇతరుల ఆలోచనలను, వారి ప్రవర్తనను, వాతావరణాన్ని, ఆర్థిక పరిస్థితులను లేదా ప్రతి పరిస్థితి ఫలితాన్ని మనం పూర్తిగా నియంత్రించలేం. మన చేతిలో ప్రధానంగా ఉండేది మన స్పందనే మాత్రమే. మన నియంత్రణలో ఉన్నవి, లేనివి అనే తేడాను గుర్తించడం ద్వారా అనవసరమైన ఒత్తిడిని తగ్గించుకోవచ్చని పుస్తకం చెబుతుంది. ఇందులోని ఆలోచనను ఒక ప్రశ్నలోకి కుదించాలంటే 'ఇది నిజంగా అంత ముఖ్యమైన విషయమా?' అనే ప్రశ్న బాగా ఉపయోగపడుతుంది. ఎవరైనా మనపై చిన్న విమర్శ చేశారనుకోండి. వెంటనే కోపం తెచ్చుకునే బదులు, ఈ సంఘటన ఒక సంవత్సరం తర్వాత కూడా మనకు గుర్తుంటుందా? ఐదు సంవత్సరాల తర్వాత దానికి ఇదే ప్రాధాన్యం ఉంటుందా? అని ఆలోచిస్తే మన ప్రతిస్పందన మారవచ్చు. మన జీవితంలో సమయం, మానసిక శక్తి రెండూ పరిమితమైన వనరులు. డబ్బును ఎక్కడ ఖర్చు చేస్తున్నామో లెక్కపెట్టే మనం, మన సమయాన్ని మాత్రం అనవసరమైన ఆలోచనలకు ఎంత ఖర్చు చేస్తున్నామో చాలాసార్లు గమనించం. ఒక చిన్న అవమానం గురించి గంటల తరబడి ఆలోచించడం అంటే, ఆ సంఘటనకు మన జీవితంలోని విలువైన సమయాన్ని అప్పగించినట్టే. ఇతరుల తప్పులను, వారి పరిమితులను అంగీకరించడం కూడా పుస్తకంలోని ముఖ్యమైన సందేశాల్లో ఒకటి. ప్రతి ఒక్కరూ తప్పు లు చేస్తారు. మనకు నచ్చని విధంగా ప్రవర్తించే వ్యక్తులు ఉంటారు. మన అభిప్రాయాలతో విభేదించే వారు ఉంటారు. ప్రతి ఒక్కరినీ మార్చడానికి ప్రయత్నిస్తే మన జీవితం నిరంతర పోరాటంగా మారుతుంది. అందుకే ఇతరులను మార్చడం కంటే, వారి ప్రవర్తనపై మన స్పందనను మార్చుకోవడం సాధ్యమైన మార్గమని రచయిత సూచిస్తాడు. అయితే దీనిని అన్యాయాన్ని సహించమని లేదా తప్పును ప్రశ్నించవద్దని అర్థం చేసుకోవడం సరికాదు. హింస, దోపిడీ, వివక్ష లేదా తీవ్రమైన అన్యాయాన్ని చిన్న విషయం అంటూ పక్కన పెట్టడం పుస్తకం ఉద్దేశం కాదు. చిన్న విషయాలపై అనవసరమైన మానసిక శక్తిని ఖర్చు చేయకపోవడం ఒకటి.. నిజమైన తీవ్రమైన సమస్యలను నిర్లక్ష్యం చేయడం మరొకటి. ప్రస్తుత క్షణంలో జీవించడం కూడా పుస్తకంలోని ప్రధాన భావన. మనిషి తరచుగా గతంలో జరిగిన విషయాలను తలచుకుంటూ లేదా భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతూ ప్రస్తుతాన్ని కోల్పోతాడు. అలా ఎందుకు జరిగింది?, నేను అలా ఎందుకు మాట్లాడాను?, అతను అలా ఎందుకు చేశాడు?, రేపు ఏం జరుగుతుంది? వంటి ప్రశ్నలు మనసును నిరంతరం ఆక్రమిస్తాయి. గతాన్ని మార్చలేం, భవిష్యత్తును పూర్తిగా నియంత్రించలేం. మనకు నిజంగా అందుబాటులో ఉన్నది ప్రస్తుత క్షణమే. అందుకే ఒక సమస్య గురించి మనసు పదేపదే ఆలోచిస్తున్నప్పుడు, ఇది ప్రస్తుతం నా జీవితంలో నిజంగా ఎంత ముఖ్యమైనది? అని మనల్ని మనమే ప్రశ్నించుకోవడం ఉపయోగకరమైన అలవాటుగా మారుతుంది. అసంపూర్ణతను అంగీకరించడం కూడా ఈ పుస్తకం నేర్పించే మరో ముఖ్యమైన పాఠం. ప్రతి పని పరిపూర్ణంగా జరగాలి, ప్రతి వ్యక్తి మనకు నచ్చినట్లే ప్రవర్తించాలి, ప్రతి ప్రణాళిక అనుకున్నట్లే నెరవేరాలి, ప్రతి రోజు ఉత్పాదకంగా ఉండాలి అనే అంచనాలు పెరిగిన కొద్దీ నిరాశ కూడా పెరుగుతుంది. కానీ జీవితం సహజంగానే అసంపూర్ణమైనది. పని ఎప్పుడూ సమయానికి పూర్తికాదు, కుటుంబ సభ్యులు ఎప్పుడూ మన మాట వినరు, సహోద్యోగులు ఎప్పుడూ సహకరించరు, మనం కూడా ప్రతిరోజూ ఒకే స్థాయిలో సహనంతో ఉండం. ఈ అసంపూర్ణతను జీవితంలోని సహజ భాగంగా అంగీకరించడం వల్ల మన అంచనాలు వాస్తవికంగా మారుతాయి. ఇతరులను నిజంగా వినడం అనే అంశానికి కూడా కార్ల్సన్ ప్రాధాన్యం ఇస్తాడు. మనలో చాలామంది ఎదుటివారు మాట్లాడుతున్నప్పుడు వారి మాటలను పూర్తిగా వినకుండా, మనం తర్వాత ఏమి సమాధానం చెప్పాలా అని ఆలోచిస్తూ ఉంటాం. ఎవరైనా తమ సమస్యను చెబుతున్నప్పుడు వెంటనే సలహా ఇవ్వడం లేదా పరిష్కారం చూపడం మనకు సహజంగా అనిపిస్తుంది. కానీ కొన్నిసార్లు ఎదుటివారికి కావలసింది పరిష్కారం కాదు; తమ మాటను ఎవరైనా ప్రశాంతంగా వినడం మాత్రమే. శ్రద్ధగా వినడం వల్ల సంబంధాల్లో ఉద్రిక్తత తగ్గుతుంది, ఎదుటివారి దృక్కోణాన్ని అర్థం చేసుకునే అవకాశం లభిస్తుంది, వెంటనే తీర్పు ఇవ్వకుండా ఉండగలుగుతాం. కృతజ్ఞతకు కూడా ఈ పుస్తకం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుంది. మనిషి తనకు లేనివాటి గురించి ఎక్కువగా ఆలోచించే స్వభావం కలిగి ఉంటాడు. ఇంకాస్త డబ్బు ఉంటే, ఇంకా మంచి ఉద్యోగం ఉంటే, ఇంకా పెద్ద ఇల్లు ఉంటే, ఇతరులు తనను మరింత గౌరవిస్తే జీవితం బాగుంటుందని అనుకుంటూ ఉంటాడు. ఇలా లేనివి మన దృష్టిని ఆక్రమించినప్పుడు, ఇప్పటికే మన దగ్గర ఉన్న విలువైన విషయాలను గమనించలేం. కృతజ్ఞత మన దృష్టిని ఏం లేదు? అనే ప్రశ్న నుంచి ఏం ఉంది? అనే ప్రశ్న వైపు మళ్లిస్తుంది. ఇది సమస్యలను మాయ చేసే పరిష్కారం కాదు; కానీ జీవితాన్ని చూసే మన దృష్టికోణాన్ని మార్చే ఒక సాధనం. దయ, సానుభూతి కూడా పుస్తకంలోని ముఖ్యమైన విలువలు. మనకు కోపం తెప్పించిన వ్యక్తి ఏదైనా వ్యక్తిగత సమస్యతో బాధపడుతూ ఉండవచ్చు. మనపై అసహనంగా ప్రవర్తించిన వ్యక్తి తన జీవితంలో తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటూ ఉండవచ్చు. ఇది ప్రతి చెడు ప్రవర్తనను సమర్థించదు. కానీ ఇతరుల ప్రవర్తన వెనుక ఉండే పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం మనలోని కోపాన్ని కొంత తగ్గించవచ్చు. కొన్నిసార్లు మనం చూపించే చిన్న దయ ఎదుటివారికే కాకుండా మనకూ ప్రశాంతతను ఇస్తుంది. ఈ పుస్తకం ఇంత ప్రజాదరణ పొందడానికి ప్రధాన కారణం దాని సరళత. పెద్ద తాత్విక సిద్ధాంతాలను క్లిష్టమైన భాషలో వివరించకుండా, రోజువారీ జీవితంలో ప్రతి ఒక్కరికీ ఎదురయ్యే చిన్న సంఘటనలనే తీసుకుని ఆలోచించమని రచయిత చెబుతాడు. అందువల్ల పాఠకుడు పుస్తకంలోని పరిస్థితులను తన జీవితంతో సులభంగా పోల్చుకోగలుగుతాడు. 'ఇది నాకు కూడా జరుగుతుంది' అనే అనుభూతి పుస్తకానికి సహజమైన అనుబంధాన్ని కలిగిస్తుంది. అయితే ఈ పుస్తకానికి కొన్ని పరిమితులు కూడా ఉన్నాయి. ఇది శాస్త్రీయ మానసిక చికిత్సా గ్రంథం కాదు. ప్రధానంగా స్వీయాభివృద్ధి పుస్తకం. ఇందులోని సూచనలు రోజువారీ ఒత్తిడిని ఎదుర్కోవడంలో ఉపయోగపడవచ్చు కానీ తీవ్రమైన మానసిక ఆరోగ్య సమస్యలకు ఇవే సంపూర్ణ పరిష్కారాలు కావు. అలాగే 'చిన్న విషయాలను పట్టించుకోవద్దు' అనే సందేశాన్ని ప్రతి సమస్యకూ వర్తింపజేయడం సరికాదు. వ్యక్తిగత ఆలోచనలు మాత్రమే మన జీవితాన్ని నిర్ణయించవు. ఆర్థిక పరిస్థితులు, కుటుంబ వాతావరణం, పని పరిస్థితులు, సామాజిక అసమానతలు, ఆరోగ్యం వంటి అనేక అంశాలు కూడా మన మానసిక స్థితిపై ప్రభావం చూపుతాయి. అందువల్ల ఈ పుస్తకాన్ని జీవితానికి సంపూర్ణ సిద్ధాంతంగా కాకుండా, మన రోజువారీ మానసిక అలవాట్లను పరిశీలించడానికి ఉపయోగపడే ఒక సాధనంగా చూడడం సముచితం.

**– బిట్రగుంట**




> నిజానికి, 'డోన్ట్ స్వెట్ ది స్మాల్ స్టఫ్ అండ్ ఇట్స్ ఆల్ స్మాల్ స్టఫ్' అనేది గొప్ప తాత్విక గ్రంథమేమీ కాదు. అదే విధంగా, ఇది కొత్త మానసిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించే శాస్త్రీయ రచన కూడా కాదు. కానీ, రోజువారీ జీవితంలో మనమే మనకు సృష్టించుకునే అనవసరమైన ఒత్తిడిని గుర్తించడానికి, చిన్న విషయాలపై మన ప్రతిస్పందనను పరిశీలించడానికి, ఇతరుల అపూర్ణతను అంగీకరించడానికి, ప్రస్తుత క్షణానికి విలువ ఇవ్వడానికి ఉపయోగపడే సరళమైన, ఆచరణాత్మకమైన స్వీయాభివృద్ధి పుస్తకం. సరళతే ఈ పుస్తక బలం. అదే సమయంలో కొన్ని విషయాలను అతిగా సరళీకరించడం దాని పరిమితిగా కూడా కనిపిస్తుంది. 'జీవితం పరిమితమైనది. మన సమయం, మానసిక శక్తి కూడా పరిమితమైనవే. ప్రతి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం లేదు. ప్రతి అవమానానికి ప్రతిస్పందించాల్సిన అవసరం లేదు. ప్రతి విభేదాన్ని యుద్ధంగా మార్చాల్సిన అవసరం లేదు. కొన్ని విషయాలను మార్చాలి. కొన్ని విషయాల కోసం నిలబడాలి. మరికొన్ని విషయాలను అంగీకరించాలి. ఇంకొన్ని విషయాలను మాత్రం వదిలేయడం నేర్చుకోవాలి' అంటూ, ఈ తేడాను గుర్తించడమే ఈ పుస్తకం అందించే ముఖ్యమైన జీవన నైపుణ్యం. మన రోజులో ఎంత సమయం నిజంగా ముఖ్యమైన విషయాలకు కేటాయిస్తున్నాం, ఎంత సమయం అనవసరమైన ఆలోచనలకు వృథా చేస్తున్నాం అనే ప్రశ్నను మనమే మనల్ని అడిగేలా చేయడమే ఈ పుస్తకానికి ఉన్న నిజమైన విలువ.

## ఈ వారం కవితలు

### 'ఒక పాచి వాక్యం'

ఉదయం లేవక ముందే పాచిపూలు
ఊడ్చేసి సుగంధపూలు పూయిస్తరు
మురికిలో మురికి అయిన మనసు
చిరాకు తొడగదు మల్లెపువ్వు అయి నవ్వుతది

చరిత్ర కోసలను ఎప్పుడూ చెక్కుతుంటారు
జీవితాలే మొండి బారినవి
లోకం మాత్రం పాచి వాక్యం గానే చూస్తుంది
రాతిరి కలలో చెత్తతో నిండిన వీధిలే దర్శనమిస్తాయి
తలగడ కింద చీపురు నిద్రపోదు
రోడ్ల వెంబడి జారిన కన్నీళ్లు, దుఃఖపు కుప్పలు,
రక్తం చిమ్మిన తావులు, ఎద గాయాలు మోసి భరించలేక

శరీరాలు ప్రాణాలు వదిలిన స్థలాలు
వేగం వచ్చి ప్రాణాలను ఎగిరేసుకుపోయిన స్థలాలు,
ఒకటేమి అన్నింటినీ ఊడ్చుతనే ఉంటరు
చూసిన కళ్ళకు ఆ దృశ్యాలే మెరుస్తుంటాయి
ఒకన్నీటి బొట్టును కారుస్తాయి
అన్నింటిని ఊడ్చి నిన్నటి రోజు ఖాతాలో వేసి
కొత్త రోజును తెచ్చి నాటుతరు

**గుండెల్లి ఇస్తారి, 9849983874**

### అక్షరాల ఆటలు

అక్షరరూపాలు, అందంగా దిద్దుతా,
ఆనందంగా పంచుతా.
అక్షరజల్లులు చిటపటా కురిపిస్తా,
తనువులు తడిపేస్తా.
అక్షరకుసుమాలు మాలలుగా అల్లుతా,
మెడల్లో అలంకరిస్తా.
అక్షరసౌరభాలు అన్నిదిక్కులా చల్లుతా,
అందరినీ ఆఘ్రాణింపజేస్తా.

అక్షరసుధలు అందరిపై వెదజల్లుతా,
గుటగుటా ఆస్వాదింపజేస్తా.
అక్షరజ్యోతులు ధగధగా వెలిగిస్తా,
కళాకాంతులు చిమ్మిస్తా.
అక్షరతూటాలు పెన్నులతో పేలుస్తా,
వెన్నుల్లో దూర్పిస్తా.
అక్షరవిన్యాసాలుఅద్భుతంగా చేసిచూపుతా,
అందరినీ ఆకట్టుకుంటా.

**గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్**

# ప్రజాస్వామ్య సౌధానికి నిశ్శబ్ద 'వారధి'

చరిత్ర కేవలం అధికార పీఠాలపై వెలిగిన రాజనీతిజ్ఞుల విజయగాథ మాత్రమే కాదు, ఆ పీఠాల వెనుక నిలిచి ఉద్యమ జ్వాలలను రగిలించిన, వ్యవస్థల పునాదులను నిశ్శబ్దంగా నిర్మించిన నిస్వార్థ కర్మయోగుల త్యాగఫలం. సరిగ్గా ఇటువంటి నిబద్ధత కలిగిన మహనీయుడు కీ॥శే॥ శ్రీపూర్ణబోధ నరసింహమూర్తి (పి.ఎన్. మూర్తి). తన జీవితాన్నే జాతి విముక్తికి, ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణకు అంకితం చేసిన ఆయన శతజయంతి (ఆగస్టు 31, 2026) సందర్భాన్ని పురస్కరించుకుని వెలువడిన అపురూప చారిత్రక గ్రంథం 'వారధి'. రచయిత పూర్ణబోధ శ్రీకాంత్ తన తండ్రి ఆశయాలను అక్షరబద్ధం చేయగా, శాసనసభ అంతర్గత కార్యకలాపాలపై లోతైన అనుభవం కలిగిన శ్రీపాద శ్రీనివాసు దీనికి ప్రామాణిక కూర్పును సమకూర్చారు. తెలంగాణ విమోచనోద్యమ తీవ్రతను, హైదరాబాద్ సంస్థాన రాజకీయ పరిణామాలను, శాసనసభా సంప్రదాయాలను కళ్లకు కట్టిన ఈ గ్రంథం చరిత్ర పుటల్లో నిలిచిపోయే ఒక అక్షర దర్పణం.ఈ గ్రంథం ఇంతటి ప్రామాణికమైన చారిత్రక దస్త్రంగా రూపుదిద్దుకోవడానికి ప్రధాన బలం రచయిత పూర్ణబోధ శ్రీకాంత్, కూర్పుకర్త శ్రీపాద శ్రీనివాసుల మధ్య ఉన్న అంతర్గత సమన్వయం. తెలంగాణ శాసనసభలోని కాంగ్రెస్ శాసనసభా పక్షం (సి.ఎల్.పి.) కార్యాలయంలోనే దశాబ్దాల పాటు కలిసి విధులు నిర్వర్తించిన కార్యాలయ సహచరులుగా వారిద్దరికీ శాసనసభా ప్రక్రియలు, అక్కడి రికార్డులు, దస్త్రాల ప్రాధాన్యతపై పరిపూర్ణమైన పట్టు ఉంది. పుస్తకంలో పొందుపరిచిన నాటి నిజాం ప్రభుత్వ ఉర్దూ ఫర్మానాలు, సిఐడి దస్త్రాలు, అరెస్ట్ వారెంట్లు, చారిత్రక లేఖలు, అరుదైన ఛాయాచిత్రాలను పకడ్బందీ క్రమపద్ధతిలో అమర్చడంలో కూర్పుకర్త శ్రీపాద శ్రీనివాసు ప్రతిభ స్పష్టంగా ప్రతిఫలిస్తుంది. కేవలం జీవిత చరిత్ర శైలిలో కాకుండా, ఒక ప్రామాణిక రిఫరెన్స్ గ్రంథంగా పాఠకుల ముందుకు తీసుకురావడంలో వీరిద్దరి కార్యాలయ అనుభవం, విషయ పరిజ్ఞానం పుస్తకానికి విశేషమైన గౌరవాన్ని తెచ్చిపెట్టాయి.గ్రంథ అంతరంగావిష్కరణ – ఉద్యమ ప్రస్థానం నుండి ప్రజాస్వామ్య రథం దాకా :1. పదిహేడేళ్ల చిరుప్రాయంలోనే విప్లవ ప్రస్థానం:జోగులాంబ గద్వాల సంస్థానంలో సంగీత విద్వాంసులైన శ్రీ వెంకోబాచార్యుల ఇంట జన్మించిన పి.ఎన్. మూర్తి, వాణిజ్య శాస్త్రంలో డిప్లొమా పూర్తవగానే వచ్చిన ఉద్యోగావకాశాలను తృణప్రాయంగా తిరస్కరించారు. కేవలం 17 ఏళ్ల ప్రాయంలోనే (1944 ప్రాంతంలో) దేశ విముక్తికై ఇంటిని, కన్నవారిని విడిచి ఉద్యమ బాట పట్టారు. గద్వాల, అలంపూరు ప్రాంతాల్లో 'యువక విజ్ఞాన సమితి' ఆధ్వర్యంలో గ్రంథాలయోద్యమాన్ని నడిపిస్తూ గ్రామగ్రామాన యువతలో రాజకీయ, సామాజిక చైతన్యాన్ని రగిలించారు. నిజాం నిరంకుశత్వంపై పోరాటం – కర్నూలు సరిహద్దు శిబిరం:రజాకార్ల అకృత్యాలు మితిమీరిన కాలంలో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ పిలుపు మేరకు పి.ఎన్. మూర్తి కర్నూలు సరిహద్దు అండర్ గ్రౌండ్ క్యాంపులో అసిస్టెంట్ ఆఫీస్ సెక్రటరీగా చేరారు. పాగా పుల్లారెడ్డి, డి.కె. సత్యారెడ్డి వంటి ఉద్ధండులతో భుజం కలిపి రహస్య కార్యకలాపాలను నిర్వహించారు. సరిహద్దు కార్యాలయం నుంచి 'భాగ్యనగర రేడియో' ప్రసారాలకు అవసరమైన క్షేత్రస్థాయి సమాచారాన్ని ప్రాణాలకు తెగించి సేకరించేవారు. కర్నూలు–కాచిగూడ రైలు మార్గంలోని కీలక స్టేషన్లలో గుప్త పద్ధతిలో కాంగ్రెస్ బులిటెన్లు, నిషేధిత కరపత్రాలు బట్వాడా చేసే అత్యంత ప్రమాదకర బాధ్యతను సమర్థవంతంగా మోశారు. పగలు భోజనం, రాత్రి వేరుశెనగ గింజలు తింటూ రోజుల తరబడి ఆకలిని సైతం లెక్కచేయకుండా ఉద్యమ నిధులను సేకరించిన తీరు పాఠకుల హృదయాలను ద్రవింపజేస్తుంది. నిజాం ప్రభుత్వం హైదరాబాద్ సెక్యూరిటీ యాక్ట్ సెక్షన్ 25 కింద జారీ చేసిన రహస్య డిటెన్షన్ ఆర్డర్లు, సిఐడి దస్త్రాలే ఆయన పోరాట తీవ్రతకు ప్రత్యక్ష నిదర్శనాలు. అందుకే ప్రఖ్యాత రచయిత డా.దాశరథి రంగాచార్యులు సైతం ఆయన్ను 'అనేక కష్టనష్టాలకు గురైన కాకలుతీరిన యోధుడు' అని ప్రశంసించారు. గాంధేయ పంథాలో నవసమాజ నిర్మాణం:1948 సెప్టెంబర్ 'పోలీస్ యాక్షన్'తో హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభించినప్పటికీ, మూర్తి విశ్రమించలేదు. స్వాతంత్ర్యానంతరం అసలైన సమాజ నిర్మాణం మొదలవుతుందని నమ్మి— గద్వాల ప్రాంతంలో అస్పృశ్యత నిర్మూలన, హరిజనోద్ధరణ, వయోజన విద్యా రాత్రి పాఠశాలలు, చరఖా కేంద్రాల నిర్వహణ, జాతీయ సమైక్యత కోసం హిందీ భాషా ప్రచారంలో అహర్నిశలు శ్రమించి నిఖార్సయిన గాంధేయవాదిగా నిలిచారు.నాలుగున్నర దశాబ్దాల సి.ఎల్.పి. ప్రస్థానం – రాజకీయాలకు 'వారధి':1952లో హైదరాబాద్ స్టేట్ ప్రథమ శాసనసభ మొదలుకొని 1996 వరకు సుదీర్ఘంగా 43 సంవత్సరాల పాటు కాంగ్రెస్ శాసనసభా పక్షం (సి.ఎల్.పి.) కార్యాలయ కార్యదర్శిగా పి.ఎన్. మూర్తి అందించిన సేవలు భారత పార్లమెంటరీ చరిత్రలోనే అరుదైనవి. బూర్గుల రామకృష్ణారావు, టంగుటూరి ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య, కాసు బ్రహ్మానంద రెడ్డి, పి.వి. నరసింహారావు, జలగం వెంగళరావు, మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కర రెడ్డి వంటి 19 మంది ముఖ్యమంత్రులు, శాసనసభా పక్ష నేతల పాలనా శైలులకు ఆయన నిశ్శబ్ద సాక్షిగా నిలిచారు. అచంచల విశ్వాసానికి ప్రతీక: పి.వి. నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో, అత్యంత గోప్యమైన పాలనా దస్త్రాలను మంత్రులకు సైతం తెలియకుండా సి.ఎల్.పి. కార్యాలయంలోని మూర్తి చాంబర్లోనే ఏకాంతంగా కూర్చుని పరిశీలించేవారన్న వాస్తవం ఆయన నిజాయితీకి, విశ్వసనీయతకు నిదర్శనం.శ్రీశైలం ప్రాజెక్టు సాధన, పంచాయతీ రాజ్ వ్యవస్థ ఆవిర్భావం, చరిత్రాత్మక భూసంస్కరణలు, సింగూరు–జూరాల ప్రాజెక్టుల రూపకల్పన, సంపూర్ణ మద్యనిషేధం వంటి ఎన్నో చారిత్రక పరిణామాల నేపథ్యంలో శాసనసభ్యులకు విలువైన సమాచారాన్ని, సలహాలను అందిస్తూ వ్యవస్థకు ఆయన ఒక మార్గదర్శిగా నిలిచారు.రసజ్ఞత నిండిన బహుముఖ ప్రజ్ఞ: తీరికలేని రాజకీయ పరిపాలనా వ్యవహారాల నడుమ కూడా ఆయన తనలోని కళాతృష్ణను సజీవంగా ఉంచుకున్నారు. రంగస్థల నటుడిగా 'శ్రీకృష్ణ రాయబారం', 'శ్రీకృష్ణ తులాభారం' నాటకాల్లో శ్రీకృష్ణుడి పాత్రను అద్భుతంగా పోషించి మెప్పించారు. స్వయంగా రచయితగా మారి 'తెలుగుదేశంలో స్వాతంత్ర్యోద్యమం', 'సంక్షిప్తంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ' అనే విలువైన గ్రంథాలను రచించి భావితరాలకు చరిత్రను అందించారు.'వారధి' పుస్తకం కేవలం ఒక వ్యక్తి చరిత్ర కాదు, అది ఒక తరం బాధ్యతను మరో తరానికి అందించే వారసత్వ పత్రం. 'అని అన్నారు. స్వాతంత్ర్య సమర గాథలను, తెలంగాణ విమోచన పోరాటపు నెత్తుటి జ్ఞాపకాలను, ప్రజాస్వామ్య వ్యవస్థల అంతర్గత పరిణామ క్రమాలను లోతుగా అధ్యయనం చేయాలనుకునే సరికొత్త తరానికి, పరిశోధకులకు, ప్రజాప్రతినిధులకు 'వారధి' ఒక అమూల్యమైన కరదీపిక. ఒక మహనీయుని శతజయంతి వేళ— ఆయన పోరాటాన్ని, నిశ్శబ్ద సేవలను భావితరాలకు సజీవంగా అందించిన పూర్ణబోధ శ్రీకాంత్ రచన, శ్రీపాద శ్రీనివాసు సమగ్ర కూర్పు తెలుగు సాహిత్య, చారిత్రక రంగాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి.






**ఎన్ విజయ రాఘవ రెడ్డి**
**9441239803**

## చదవాల్సిన పుస్తకం

# నల్లమల నగారా 'వనమంచు పల్లె' పాటలు

**తరం మారే యుగం మారే**
**తలరాతలు మారలేదు**
**సంస్కరణలు ఎన్నొచ్చిన**
**సంఘంలో మార్పులేదు**

అంటూ మారని సమాజస్థితిని చూసి మార్పు కోసం పాటలను అస్త్రాలుగా మలిచి సాహితీ సృజన చేస్తున్న అభ్యుదయ రచయిత కలువకోలు మద్దిలేటి. నల్లమల నగారాగా మ్రోగుతున్న 'వనమంచు పల్లె'పాటల సంపుటి ఇది. పాట అంటే సంగీతంతో కలిసి పాడదగిన కవితా భావాలను లయాత్మకంగా వ్యక్తపరిచే సాహిత్య రూపం. పాటను, గేయం అనికూడా అంటారు. ఐతే రెండింటి మధ్య చిన్న సరిహద్దు రేఖ ఉంది. పాడబడేది పాట కాగా పాడదగినది మాత్రమే గేయం. పాటకు పల్లవి, అనుపల్లవి(ఐచ్ఛికం), చరణాలు నిర్దిష్ట పాదాల సంఖ్యతో ఉంటాయి. ప్రతి చరణానికి ముగింపులో పల్లవి పునరావృతం అవుతుంది.గేయంలో ఈ నిర్దిష్టత నిబంధన ఉండవచ్చు, లేకపోవచ్చు. పాట ప్రజల భావాలు, జీవన అనుభవాలు, ఆనందంవేదనలను, సమస్యల విముక్తి కోసం ఉవ్వెత్తున లేచే అలజడి,ఆందోళన,ఉద్యమాలను చైతన్య ప్రేరకంగా వ్యక్తపరిచే సాహిత్య ప్రక్రియ. గుణాన్ని పట్టి జనాన్ని మత్తులో నిద్రపుచ్చే పాటలు, నిద్రలేపే మేల్కొలుపు పాటలుగా చెప్పవచ్చు.ఈ మేల్కొలుపు పాటల సమాహారమే కలువకోలు మద్దిలేటి వనమంచు పల్లె పాటల సంపుటి. ప్రపంచ వ్యాపితంగా వస్తున్న ప్రపంచీకరణ,పెట్టుబడిదారి పరిణామాల, ఫలితంగా పాలక వర్గాల స్వార్థపూరిత దోపిడి స్వభావాల మూలంగా సమాజంలో సమస్యలు కోకుల్లలుగా పుడుతున్నాయి. నిరుద్యోగం, బీదరికం, అవినీతి, అక్రమాలు, అణచివేతలు, ప్రజాస్వామ్య హననాలు, మానభంగాలు, మర్డర్లు, ఒక్కటేమిటి చుట్టూ సమస్యల సముద్రమే. ఈ నేపథ్యంలో ప్రజలు సమస్యల విముక్తి కోసం నిత్యం పెనుగులాడుతూ ఏదో ఒక రూపంలో తమ నిసనను, ఆందోళనను వ్యక్తపరస్తూనే ఉన్నారు.

**పల్లె తల్లి మాటల్లో పాటలైనరా**
**జనం గుండె చప్పుడులో డప్పులైనరా–**

అనే పాటలో , కుల్లిపోయిన రాజ్యం, కూలీ తల్లుల శోకం, ఉద్యమాల్లో ఒరిగిన వీరులు, రైతుపడే గోసలు, పల్లెలు వదిలి పట్నం వలసపోయె వారి దయనీయ బతుకులు, ఇలా అన్నిటిని వస్తువులుగా చేసుకొని, చిలుక పలుకుల మెలకువలు నేర్చుకొని పాటలల్లినానని తన శ్రామిక వర్గ పక్షపాత నిజాయితీని చాటుకున్నాడు.

**నడూ నడూ నాగులన్న**
**నల్లమలకు నాగులన్నా**

అనే పాటలో నల్లమల సింగిడి అందాలను దృశ్యమానం చేస్తూనే, యురేనియం కొరకు దానిని విధ్వంసం చేస్తూన్నారని, ఆ ప్రయత్నాలను ప్రతిఘటించాలనే పిలుపునిస్తాడు.

**అందమైన చందమామమ్మా–నా ఆడపిల్ల**
**అంతులేని బాధలోయమ్మా –నా ఆడపిల్ల**

అనే పాటలో పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు ఆడపిల్లను ఇంటి పనులు, బయటి పనులకు పరిమితంగా బానిసను చేసి పితృస్వామ్యం అణచివేస్తున్న క్రమాన్ని కళ్లకు కట్టినట్లు చూపించాడు.

**ఏంపాడుదురా మా పేదోళ్ల బతుకు పాట**
**ఏం చెప్పుదురా మా పేదోళ్ల బతుకు బాధ–**

అనే పాటలో, బీదరికంతో అల్లాడి పోతున్న బ్రతుకుల దైన్యస్థితిని హృదయ విదారకంగా చిత్రించాడు.

**జన్మ జన్మాల్లో అమ్మ జన్మే**
**అపురూపమైనది అమ్మ జన్మే**

అంటూ బిడ్డ పుట్టినప్పటినుండి ఏవిధంగా పెంచి పెద్దచేసి,తన జీవితాన్ని దారబోసి త్యాగదనురాలవుతుందో, అమ్మ గొప్పతనాన్ని గొప్పగా కీర్తించాడు.

**పొద్దున బువ్వుంటే మాపున బువ్వుండదు**
**పూటలెట్ల గడుసునో ఫుట్ పాత్ బతుకుల్లో**

అనే పాట పట్టణాల్లో ఫుట్ పాత్ ల మీద బ్రతుదెరువు కోసం చిన్న చిన్న పనులు చేసుకుంటున్న జీవితాల్ని చిత్రిస్తూ కన్నీరు పెట్టిస్తుంది.

**ఇల నీకు సాటెవ్వరు ఓఓ నాన్న**
**ఇలా నీకు సాటెవ్వరో నాన్న**

అనే పాటలో కుటుంబం కోసం,పిల్లల ఉన్నతికోసం నాన్న పడే కష్టాలను,త్యాగాన్ని,గొప్పతనాన్ని చాటిచెప్పాడు.

**సఫాయన్నలో మీకు సలామన్నలో**
**అంటరాని రూపాలు ఆమని అందాలు**

అనే పాటలో తమ జీవితాల్ని ఫణంగా పెట్టి ఊరు విసర్జించే మలినాల్ని ఎత్తిపోసి పట్టణాల్ని పరిశుభ్రంగా అందంగా ఉంచే అంటరాని రూపాలు సఫాయి కార్మికులని ఆవేదన చెందుతూ వారి మురికి జీవితాల వ్యాధులు, కన్నీటి విషాద గాథను ఎంతో హృద్యంగా చిత్రించాడు.

**డ్రైవరన్నా డ్రైవరన్నా ఓ డ్రైవరన్నా**
**దైవానికి ప్రతిరూపం మాడ్రైవరన్నా**

అనే పాటలోప్రయాణీకులను సురక్షితంగా గమ్యానికి చేర్చే దైవ స్వరూపుడని ఆయన జీవితాన్ని చక్కగా చూపించాడు.

**ఊరూరు తిరిగేటి ఓరన్నా సంచారి**
**ఊరుపేరు ఏదంటే ఉబికివచ్చే కన్నీరే.**

అనే పాట ఊరు,పేరు,ఉండడానికి గూోడు కూడాలేని ఊరూరు తిరిగి జీవనం సాగించే సంచార కులాల విషాదభరిత బతుకు కన్నీటి గాథను, స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లైనా ఇంకా వీరు బతుకులు మారని దుస్థితి చూపి ఆలోచింపజేస్తుంది.

**బాబా నీకు వందనం బాపు నీకు వందనం**
**బాబాసాహెబ్ మీకు వందనం.**

అనే పాటలో అంబేద్కర్ రాజ్యాంగం వల్ల దళిత,బడుగు బలహీన వర్గాలకు జరిగిన న్యాయం,దాని గొప్పతనం గురించి చక్కగా చిత్రించాడు. తన వనమంచు పల్లె అందాలను, గొప్పతనాన్ని,కొల్లాపురం గొప్పతనాన్ని,జ్ఞాన పుష్పం పుస్తకం యొక్క చైతన్య దీప్తిని, నిస్వార్థానికి మారుపేరుగా నిలిచిన పౌరహక్కుల సామాన్య జీవితాల్ని,హీనంగా వచ్చినోళ్ల హీరోలుగా అందగా తయారు చేసే మంగళి వృత్తి గురించి,రైతుల దైన్యస్థితి గురించి,లక్షలాది మందిని పొట్టన పెట్టుకున్న కరోనా మహమ్మారి గురించి,కళాకారుల జీవితం గురించి,రాజకీయాల గురించి, కాశ్మీర్‌లో ఉగ్రవాదం గురించి,విద్యార్థులను తీర్చిదిద్దే పంతులమ్మ గురించి,ప్రజోద్యమాల్లో ఒరిగిన వీరుల గురించి ఇలా విభిన్నమైన వస్తువును తీసుకొని రాసిన 45 పాటలు ఇందులో ఉన్నాయి. వస్తువు,వస్తువుకు తగ్గ బాణీ,భాష,ప్రతీకల పొందికలో పాటలు రాస్తూ తన స్వంత గొంతును వినిపిస్తూ ఎదుగుతున్న రచయిత మద్దిలేటి. ఐతే శబ్ద,అర్థ,లయల సమన్వయం అక్కడక్కడ లోపించినా పాట, గేయం వాటి సరిహద్దు రేఖను దాటినా,కొన్ని దీర్ఘ పాటలుగా పాట లక్షణాలను అతిక్రమించినా, విభిన్న జీవితాలను,వారి సమస్యలను,ఆందోళన, అలజడులను వస్తువుగా తీసుకొని రాసిన,అందరు చదవదగిన,కళాకారులు పాడదగిన చక్కని పాటల సంపుటి ఇది.

**– వేల్పుల నారాయణ, 9440433475**

### పుస్తకం పేరు

**వనమంచు పల్లె(పాటలు)**
రచన : కల్వకోలు మద్దిలేటి
వెల: రూ.200, పేజీలు :142
ప్రచురణ : అభ్యుదయ రచయితల సంఘం,(అరసం)తెలంగాణ

ప్రతులకు

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది). ( విశాలాంధ్ర అన్ని బ్రాంచ్‌లోనూ లభిస్తుంది)

# ‘అద్దె’ మాయలో పడొద్దు

- ప్రశ్నించి పోరాడే జెఎసి కూటమి గెలిపిద్దాం
- ఆర్‌టిసి కార్మికుల పక్షాన శాసనమండలిలో గళం విప్పుతా
- గుర్తింపు సంఘ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో జరుగుతున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఆర్‌టిసి కార్మికులు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆలోచించి బస్ గుర్తు, నిచ్చెన గుర్తుపై ఓటు వేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యలపై నిరంతరం ప్రశ్నించే, పోరాడే సంఘాలకే ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. నల్లగొండలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాబు, టీఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధమాస్ రెడ్డిలతో కలసి ఆర్‌టిసి గుర్తింపు సంఘ ఎన్నికల ప్రచారం ఆదివారం నల్లగొండ ఆర్‌టిసి డిపోలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్‌టిసిలో 2016 తర్వాత ఇప్పటివరకు గుర్తింపు సంఘ ఎన్నికలు జరగలేదని, దాదాపు దశాబ్దం తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలు అత్యంత కీలకమైనవని అన్నారు. ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ ముందుకు సాగుతున్న నేపథ్యంలో గుర్తింపు పొందే యూనియన్‌పై పెద్ద బాధ్యత ఉంటుందని తెలిపారు. ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చే ప్రక్రియలో కార్మికులకు ఎలాంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వ సర్వీస్ రూల్స్, ఆర్‌టిసి నిబంధనలు, రెగ్యులేషన్లను సమగ్రంగా పరిశీలించి కార్మికుల ప్రయోజనాలను కాపాడే యూనియన్‌కు మద్దతు ఇవ్వాలని సూచించారు. విలీనం అంశంపై కొందరు యూనియన్ నాయకులు తామే బ్రాండ్ అంబాసిడర్లమన్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. ఎవరు నిజంగా కార్మికుల కోసం పోరాడారు.. ఎవరు రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేశారు. అనేది కార్మికులు గత చరిత్రను పరిశీలించి నిర్ణయించుకోవాలని కోరారు. ఆర్‌టిసి కార్మికులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ హక్కులు, ఉద్యోగ భద్రత, భవిష్యత్తు గురిం చి ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బాబు, టీఎం యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధమాస్ రెడ్డిలు మాట్లాడుతూ 2019 తర్వాత ఆర్‌టిసిలో యూనియన్లు లేకపోయినా కార్మికుల సమస్యలపై తమ పోరాటం కొనసాగిందని పేర్కొన్నారు. ధర్నాలు, గేట్ మీటింగ్‌లు, నిరాహార దీక్షలు, నిరసనలు, ఛలో హైదరాబాద్, ఛలో ఇందిరాపార్క్, ఛలో బస్‌భవన్, అసెంబ్లీ ముట్టడి వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఇయు, టిఎంయు, ఎన్ఎంయుతో పాటు ఇతర యూనియన్లతో కలిసి జేఏసీ ఏర్పాటు చేసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు వెళ్లామని గుర్తుచేశారు. కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్ర త, వేతనాలు, ప్రభుత్వంలో విలీనం వంటి కీలక అంశాలపై గుర్తింపు సంఘం నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందని అందుకే జేఏసీ కూటమి గెలిపించుకుని హక్కులను సాధించుకుందాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పల్లా దేవేందర్ రెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడింగి శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీర స్వామి, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కేస్‌రెడ్డి, టీఎంయూ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బోనగిరి నరేందర్, కూటమి నాయకులు జమాల్ గౌడ్,టిజే రావు, బాసాని వెంకటయ్య, ఎన్ఆర్‌సి రాజు,కే దయాకర్, ఎస్.కె గులాం రసూల్, ఎల్.స్వామి, లూర్దమ్మ బి.శంకరమ్మ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎండి జానీ, డి.వెంకన్న, వి.లెనిన్, శంకర్ ఉన్నారు.

# ఓటు హక్కు కొల్లగొట్టే కుట్రను అడ్డుకుంటాం

- వామపక్షాలు, కాంగ్రెస్, టిజెఎస్, ఎస్‌పి, ఆర్‌జెడి నేతలు హెచ్చరిక
- ఎస్ఐఆర్‌కు వ్యతిరేక ఆందోళనలు విజయవంతం చేయాలని పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్లను జాబితాల నుంచి తొలగించి ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను సహించేది లేదని వామపక్షాలు, కాంగ్రెస్, టిజెఎస్, ఎస్‌పి, ఆర్‌జెడి నేతలు హెచ్చరించారు. ఓటు హక్కుపై జరుగుతున్న ఈ దాడి రాజ్యాంగ మూల సుత్రాలపై దాడిగా అభివర్ణించారు. సిఇసి జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలని, తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసే వరకు ఐక్య పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ఈనెల 6న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు, కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, 8న హైదరాబాద్‌లో నిలోక్ భవన్ వద్ద ఆందోళన, నవంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాలను నిర్వహించనున్నామని వీటి ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎం.బి.భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఎంపి మల్లు రవి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవర్ధన్, ఎంసిపిఐ(యు)రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, ఎస్‌యుసిఐ(సి) రాష్ట్ర కార్యదర్శి సి.హెచ్.మురహరి, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేశ్ రాజా, ఆర్ ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు, టిజెఎస్ ప్రతినిది సలీం పాషా, ఆర్‌జెడి అధ్యక్షులు శోభ యాదవ్, సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి, ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్లను జాబితాల నుంచి తొలగించి ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. ఓటు హక్కు ప్రజల ప్రాథమిక హక్కని, దానిని హరించే చర్యలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న సిఇసి జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని, లేకుంటే ఆయనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ అక్రమాలపై పార్లమెంట్‌లో ప్రధాని, హోంమంత్రి సమాధానం చెప్పాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేసినా స్పందించలేదన్నారు. ఓటు హక్కు పరిరక్షణకు అన్ని పార్టీలు, ప్రజలు ఐక్యంగా పోరాడాలని మల్లు రవి పిలుపునిచ్చారు. ఈ.టి.నరసింహ మాట్లాడుతూ ఇంతకాలం మత రాజకీయాలను అడ్డం పెట్టుకుని అధికారంలోకి వచ్చిన బిజెపి ఇప్పుడు ఎస్ఐఆర్ పేరుతో ఆపార్టీకి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను తొలగించడం ద్వారా మరోసారి అధికారంలోకి రావాలని కుట్ర జరుగుతోందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రత దెబ్బతింటోందని, ఎన్నికల వ్యవస్థను కూడా రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. సోషల్ మీడియా ద్వారా ప్రజల రాజకీయ అభిప్రాయాలను గుర్తించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నవారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రక్రియ ప్రమాదకరమన్నారు. ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగించకుండా చూడాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందని పేర్కొన్నారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఓట్ల తొలగింపు అక్రమాలకు జ్ఞానేశ్‌కుమార్ ప్రధాన బాధ్యుడని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 13 కోట్ల ఓట్లు తొలగించారని తెలంగాణలో 90–95 లక్షల ఓట్లు తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పోటు రంగారావు, కె.గోవర్ధన్, వనం సుధాకర్, రమేశ్ రాజా, జానికి రాములు తదితరులు మాట్లాడుతూ సంపదతో పాటు ఓటు చోరీ ద్వారా బిజెపి దేశ వినాశ విధానాలకు పాల్పడుతోందని అరోపించారు.2047 నాటికి బిజెపి ధ్యేయం వికసిత్ భారత్ కాదని, దాని అసలు లక్ష్యం హిందు రాజ్య స్థాపన అని దానిని ఎట్టి పరిస్థితుల్లో జరగనీయబోమని స్పష్టం చేశారు.

# గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



- బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అర్హులైన గీత కార్మికులకు లైసెన్సులు, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సొసైటీలు రెన్యూవల్ కాలేదన్న సాకుతో పెన్షన్ అర్హుల దరఖాస్తును తిరస్కరించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని రాజ్ బహద్దూర్‌లో గౌర్ తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమం, వృత్తి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. సొసైటీలకు లైసెన్సుల కోసం రూ.1,000 కోట్ల నిధి కేటాయించాలని, గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి డి.జి. సాయిలుగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గీత ఉత్పత్తిదారుల సమస్యలను నిర్ల క్ష్యం చేస్తోందని విమర్శించారు. కో ఆర్డినేటింగ్ సెక్రటరీ బొమ్మగాని నాగభూషణం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాను రూ.10లక్షలు, పెన్షన్ రూ.5వేలకు పెంచాలని కోరారు. కల్లు దుకాణాల సెక్యూరిటీ డిపాజిట్లు, కాంపౌండింగ్ ఫీజులు రద్దు చేయాలని, గీత కార్మికుల ప్రమాద బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలని, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తాటి, ఈత వానల పెంపునకు 10 ఎకరాల చొప్పున భూమి కేటాయించాలని, కార్మికులకు సేఫ్టీ కిట్లు అందించాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో వృత్తి నిర్వహిస్తున్న గీత కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతో పాటు ఈనెల 19.20 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం 70 వార్షికోత్సవాల సందర్భంగా జెండాను ఆవిష్కరించాలని సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవిఎల్, మారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్, దూసరి శ్రీరాములు, చింతపల్లి పుల్లయ్య, తప్పెట్ల రాములు, బందం నాగేశ్వరరావు, బి.తిరుపతిగౌడ్, జె.ఆనంద్‌గౌడ్, మల్లని సుధాకర్‌గౌడ్, కనుకమామిడి శ్రీశైలంగౌడ్, జె.నాగార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మూడు రోజులు వర్షాలు

- వాతావరణ కేంద్రం హెచ్చరిక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు అక్కడక్కడ తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు 0 వెల్లడించారు. తొలి మూడు రోజులు ఆదివారం నుంచి బుధవారం వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వికారాబాద్, మహబూబ్ నగర్, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ ఈ వర్ష ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. అయితే బుధవారం నుండి ఆదివారం వరకు రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందన్నారు. చివరి నాలుగు రోజులకు సంబంధించి ఎలాంటి హెచ్చరికలు లేవన్నారు.

# సరైన విద్యుత్ సరఫరాతో రైతును ఆదుకోవాలి

- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తీవ్రమైన కరువుతో ఇబ్బంది పడుతున్న తెలంగాణ రాష్ట్రానికి ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసి ఆదుకోవాలని తెలంగాణ రక్షణ సేన(టిఆర్‌ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. దుర్భర కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న దక్షిణాది రాష్ట్రాలను ప్రస్తుతం కేంద్రం ఆదుకోకపోతే ప్రధాని మోదీని ప్రజలు క్షమించబోరన్నారు. రాష్ట్రంలో కరువు, రైతుల సమస్యల పరిష్కారానికి వెంటనే ప్రత్యేక మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి, రాబోయే పరిస్థితులను ఎదుర్కొనేందుకు కార్యాచరణను ప్రకటించాలని తెలిపారు. హైదరాబాద్‌లోని టిఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ దేశంలో చాలా రాష్ట్రాల్లో కరెంట్ ఉత్పత్తి ఎక్కువగా ఉన్నదని, ఆ కరెంట్‌ను దక్షిణాది రాష్ట్రాలకు ఉచితంగా ఇవ్వాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి కేంద్రం నుంచి రూపాయి కూడా అదనంగా ఇవ్వలేదని మండిపడ్డారు. కరవు నేపథ్యంలో ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్రాన్ని ఆదుకోవాలన్నారు. తెలంగాణ నీళ్లను సిఎం రేవంత్ రెడ్డి ఒక గిఫ్ట్ ప్యాక్‌గా ఎపి సిఎం చంద్రబాబుకు పంపిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు కరువుతో అల్లాడుతుంటే సిఎం మాత్రం అచేతన స్థితిలో ఉన్నారని, వరుణయాగం చేసి ప్రజల ఖర్మ అన్నట్టుగా చేతులు దులుపుకున్నారన్నారు. రాష్ట్రంలో కోటి 20 లక్షల ఎకరాల్లో పంటలు ప్రమాదంలో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. వానాకాలం సీజన్‌లో రైతులు బావులు, బోర్ల కింద సాగు చేసిన పంటలు చేతికి రావాలంటే నవంబర్ నెలాఖరు వరకు 24 గంటల ఉచిత కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణికి సంస్థకు ప్రభుత్వం బకాయి ఉన్న రూ.60 వేల కోట్ల బిల్లులు చెల్లించి ఉంటే, ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తికి సమస్య వచ్చేదే కాదన్నారు.

**ఎన్నికల్లో పోటీ చేస్తాం:** ఖైరతాబాద్ ఉప ఎన్నిక సహా రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా తమ పార్టీ పోటీ చేస్తుందని కల్వకుంట్ల కవిత ప్రకటించారు. రాష్ట్రంలో కరువు ప్రాంతాలను తమ పార్టీ నాయకులు సందర్శించి, రైతుల సమస్యలను, కరవు పరిస్థితులను పరిశీలించి,వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి తగిన సూచనలు చేస్తారన్నారు. ఇప్పటికే ‘‘ఆపరేషన్ బ్లాకోడ్’’ పేరుతో రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్పిటల్లలో నెలకొన్న పరిస్థితులపై తమ పార్టీ నేతలు అధ్యయనం చేస్తున్నారని వివరించారు. దేశంలో ఎన్నికల ప్రక్రియ మళ్లీ బ్యాలెట్ విధానంలో జరగాలని కవిత డిమాండ్ చేశారు.

# ఆశా వర్కర్ల డిమాండ్లు పరిష్కరించాలి

- బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు గౌరవం, పారితోషికం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఆశా వర్కర్లు తమ హక్కులు, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడాలని పిలుపునిచ్చారు. బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, ఆశా వర్కర్ల అధ్యక్షుల సంతోష ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం జరిగిన ‘ఆశా వర్కర్ల సమావేశం’లో వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో ఆశా వర్కర్లు ఒక ముఖ్యమైన వారధిగా పనిచేస్తున్నారన్నారు. ఆశా వర్కర్ల సమస్యలను కేవలం ఉద్యోగుల సమస్యగా కాకుండా ప్రజారోగ్యానికి సంబంధించిన అంశంగా చూడాలని ఆయన సూచించారు. ఎన్నికల సమయంలో ఆశా వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆశా వర్కర్ల పారితోషికాన్ని పెంచడంతో పాటు వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చామని వివరించారు. కొవిడ్‌లాంటి మహమ్మారులను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే బలమైన ప్రజారోగ్య వ్యవస్థ అవసరమన్నారు.



# ఓటమి భయంతోనే.. ఉపఎన్నికలు అడ్డుకుంటున్నారు: డి.కె.అరుణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖైరతాబాద్ ఉపఎన్నికలో ఓటమి భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నిక జరగకుండా కోర్టులో పిటిషన్లు వేయిస్తోందని బిజెపి ఎంపి డి.కె. అరుణ ఆరోపించారు. హైదరాబాద్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ బిఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. తమ పాలనపై నమ్మకం ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయించాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందంతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి అభివృద్ధిని నిలిపేశాయని ఆరోపించారు. గతంలో ఖైరతాబాద్‌లో బిజెపి విజయం సాధించిందని, రానున్న ఉపఎన్నికలోనూ కమలం జెండా ఎగురుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

# రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై విషప్రచారం

- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరుస ఎన్నికల పరాజయాలను జీర్ణించుకోలేక కాంగ్రెస్ పార్టీ ప్రజాతీర్పును అవమానిస్తూ రాజ్యాంగబద్ధ సంస్థలపై విషప్రచారం చేస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆరోపించారు. హైదరాబాద్ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు వరుసగా మూడోసారి నరేంద్ర మోదీకి మద్దతు ఇవ్వడాన్ని కాంగ్రెస్ నాయకత్వం అంగీకరించలేకపోతోందన్నారు. ఎన్నికల ఫలితాలను ప్రశ్నించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని, ఓటర్ల తీర్పును అవమానిస్తున్నారని విమర్శించారు. సుప్రీంకోర్టు, రాష్ట్రపతి కార్యాలయం, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రజల్లో అనుమానాలు కల్పించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, ఫామ్ 7 దరఖాస్తు సమర్పించినంత మాత్రాన ఓట్లు తొలగించబోరన్నారు. ఎన్నికల్లో గెలిస్తే వ్యవస్థలను ప్రశంసిస్తూ, ఓడిపోతే ఈవిఎంలు, ఎన్నికల ప్రక్రియపై నిందలు వేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు.

# ఆర్‌టిసిలో ఎన్నికల సమరం

- పదేళ్ల తర్వాత జరుగుతున్న గుర్తింపు సంఘం ఎన్నికలు
- పోటాపోటీగా కొనసాగుతున్న ప్రచారం
- హక్కుల కోసం గళమెత్తే సంఘానికే మద్దతిస్తామంటున్న కార్మికులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి)లో ఎన్నికల సమరం ఆరంభమైంది. గుర్తింపు పొందిన సంఘానికి విలీన కమిటీలో ప్రాతినిధ్యం లభించడంతో పాటు యాజమాన్యం, ప్రభుత్వంతో కార్మిక సమస్యలపై అధికారికంగా చర్చించే కీలక హక్కు ఉండటంతో ఈ ఎన్నికలకు ప్రాధాన్యం ఏర్పడింది. దాదాపు పదేళ్ల తర్వాత గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరగనుండటంతో డిపోల్లో ఎన్నికల సందడి ఊపందుకుంది. అక్టోబర్ 9న జరగనున్న పోలింగ్‌లో సుమారు 39 వేల మంది కార్మికులు రహస్య బ్యాలెట్ ద్వారా తమ ప్రతినిధి సంఘాన్ని ఎన్నుకోనున్నారు. ప్రచారంలో ప్రధానంగా ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనం, పెండింగ్ వేతన సవరణలు, 2017, 2021 బకాయిల చెల్లింపు, సిబ్బంది కొరత, పని భారాన్ని తగ్గించడం, ఉద్యోగ భద్రత, పదోన్నతులు, బదిలీల విధానం వంటి అంశాలు ముందుకు వస్తున్నాయి. ఎన్నికల బరిలో పలు సంఘాలు ఉండగా ప్రధాన సంఘాల మధ్య పొత్తులు, రాజకీయ మద్దతు కూడా చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ మద్దతును టిజిఎస్‌ఆర్‌టిసి వర్కర్స్ యూనియన్ (టిడబ్ల్యుయు)కు ప్రకటించగా, ఎంప్లాయీస్ యూనియన్ (ఇయు), తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టిఎంయు), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయు) కలిసి జెఎసిగా ప్రచారం సాగిస్తున్నాయి.

**కార్మిక సమస్యలే ప్రచారాస్త్రాలు..**
ఎన్నికల తేదీ సమీపిస్తుండటంతో డిపోలు, వర్క్‌షాప్‌లు, ప్రాంతీయ కార్యాలయాల వద్ద యూనియన్ల నేతలు కార్మికులను కలిసి తమ విధానాలను వివరిస్తున్నారు. ప్రభుత్వ విలీనం జరిగితే ఉద్యోగుల ప్రయోజనాలు ఎలా కాపాడాలి? పెండింగ్ బకాయిలను ఎలా సాధించాలి? సిబ్బంది కొరత, పని ఒత్తిడిని ఎలా తగ్గించాలి? వంటి అంశాలపై సంఘాలు తమ కార్యాచరణను వివరిస్తున్నాయి. అలాగే పెండింగ్ వేతన సవరణ, బకాయిల చెల్లింపు, పదోన్నతులు, బదిలీలు, సిబ్బంది నియామకాలు, పని ఒత్తిడి, డ్రైవర్లు, కండక్టర్లకు మెరుగైన పని పరిస్థితులు, పదవీ విరమణ ప్రయోజనాలు, కారుణ్య నియామకాలు తదితర అంశాలపై కార్మిక సంఘాలు దృష్టి సారిస్తున్నాయి. దీంతో ఎన్నికల ప్రచారంలో రాజకీయ, కార్మిక అంశాలు రెండూ చర్చనీయాంశంగా మారాయి. అక్టోబర్ 17న వెలువడే ఫలితాలతో కార్మిక సంఘాల భవితవ్యం బహిర్గతం కానుంది.

**ఉద్యమించే సంఘానికే కార్మికుల మద్దతు..**
హక్కుల కోసం గళమెత్తే సంఘానికే తమ మద్దతు ఉంటుందని ఆర్‌టిసి కార్మికులు స్పష్టం చేస్తున్నారు. ఎన్నికల వేళ ఇచ్చే హామీలకంటే.. సమస్యలొచ్చినప్పుడు యాజమాన్యం, ప్రభుత్వాన్ని నిలదీసి కార్మికుల పక్షాన పోరాడే నాయకత్వమే తమకు అవసరమని చెబుతున్నారు. ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనం ప్రక్రియ ముందున్న నేపథ్యంలో ఉద్యోగుల భవిష్యత్ ప్రయోజనాలపై బలంగా మాట్లాడే సంఘానికే ప్రాధాన్యం ఇస్తామని అంటున్నారు. విలీనం సందర్భంగా ఉద్యోగుల హోదా, వేతనాలు, సర్వీసు నిబంధనలు, బకాయిలు, పదోన్నతులు, ఉద్యోగ భద్రత వంటి అంశాలపై తమ వాణిని బలంగా వినిపించే సంఘం అవసరమని కార్మికులు అభిప్రాయపడుతున్నారు.


## శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానము
గ్రా|| & మం|| పాలకుర్తి, జిల్లా: జనగామ - 506146.

సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలము

Letter No. SSLNST/Tender Notice/2026 Date:03.10.2026

దేవాదాయ ధర్మాదాయశాఖ, జనగామ జిల్లా, పాలకుర్తి గ్రా. & మం., శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానము నందు తేది: 13.10.2026 మంగళవారం రోజున ఉ. 11:00 గం.ల నుండి సీల్డ్ టెండర్-కం బహిరంగ వేలము ద్వారా ఈ క్రింద తెలిపిన పద్దులపై టెండర్లు కోరడమైనవి. పూర్తి వివరాలకోసం దేవస్థాన కార్యాలయమును సంప్రదించగలరు.

| క్ర.సం. | వేలము వివరములు | డిపాజిట్ సొమ్ము | కాలపరిమితి |
|---|---|---|---|
| 01. | కొబ్బరి కాయలు మరియు ఇతర పూజా సామాగ్రి (అభిషేక సామాగ్రి మినహాయించి) వాహన పూజ సామాగ్రి సప్లయ్ చేయు హక్కు | రూ. 5,00,000/- | తేది: 01.01.2027 నుండి 31.12.2027 వరకు |
| 02. | తలనీలాలు ప్రోగు చేసుకొను హక్కు | రూ. 5,00,000/- | తేది: 18.01.2027 నుండి 17.01.2028 వరకు |
| 03. | కొబ్బరి చిప్పలు ప్రోగుచేసుకొను హక్కు | రూ. 1,00,000/- | తేది: 10.01.2027 నుండి 09.01.2028 వరకు |

సం/- కార్యనిర్వాహణాధికారి

DIPR R.O. No. : 11117-PP/CL/ADVT/2026-27, Date: 03-10-2026

## జవహర్ నగర్ సుక్కమ్మ బస్తీలో క్షేత్రస్థాయి పర్యటన



ప్రజాపక్షం/జవహర్‌నగర్ : జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని విఘ్నేశ్వర కాలనీ సుక్కమ్మ బస్తీలో స్థానికులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. వీర్ల భుజంగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ మాజీ మేయర్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శాంతి కోటేశ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై కాలనీలో ప్రత్యక్షంగా పర్యటించారు. ఈ సందర్భంగా బస్తిలో వేలాడుతున్న ప్రమాదకర విద్యుత్ వైర్లు, సరిపడా విద్యుత్ స్తంభాలు లేకపోవడం ఇతర మౌలిక సదుపాయాల కొరతను కాలనీవాసులను అడిగి తెలుసుకొని స్వయంగా పరిశీలించారు. అనంతరం శాంతి కోటేశ్ గౌడ్ మాట్లాడుతూ, సుక్కమ్మ బస్తిలోని విద్యుత్ సమస్యలతో పాటు మౌలిక వసతుల లేమిని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి, వారి సహకారంతో త్వరలోనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ మనోహర్ రెడ్డి, ఎర్ర గుడ్ల వెంకటేశ్వర్, రఫీక్, కన్నీబోయిన రాజు యాదవ్, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసిని రక్షించాలంటే ఉద్యోగుల బస్ గుర్తుపై ఓటేయాలి:కె.ఏసురత్నం



ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత, పనిభారం తగ్గింపు కోసం ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.ఏసురత్నం కోరారు. ఆదివారం జగద్గిరిగుట్ట బస్టాండ్‌లో ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసిని రక్షించడంతో పాటు కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత కోసం ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 9న జరగనున్న ఆర్‌టిసి ఎన్నికల్లో ఎఐటియుసి అనుబంధ ఎంప్లాయిస్ యూనియన్‌కు మద్దతుగా బస్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కార్మికులను కోరారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి యూనియన్ తరపున నిరంతరం పోరాటం చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల ఆర్‌టిసి డిపో ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ధాన్యల్, కుత్బుల్లాపూర్ సిపిఐ సహాయ కార్యదర్శి చర్లపల్లి రాములు, ఇమామ్ బాయ్, ఆర్‌టిసి కార్మికులు, కుత్బుల్లాపూర్ ఎఐవైఎఫ్ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## జీడిమెట్ల డిపోలో ఎఐటియుసి గేట్ మీటింగ్



ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ : మేడ్చల్ జిల్లా జీడిమెట్ల ఆర్‌టిసి డిపో వద్ద ఆదివారం ఆర్‌టిసి జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఎఐటియుసి నాయకులు గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 9న జరగనున్న ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ బలపరిచిన అభ్యర్థులకు బస్, నిచ్చెన గుర్తులపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కార్మికులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో ఆర్‌టిసి కార్మికుల మద్దతుతో అధికారంలోకి వచ్చిన బిఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెబుతూ కార్మికులకు హామీలు ఇస్తోందని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను తీసుకు రావడంతో పాటు కార్మికులను ఇష్టారీతిన బదిలీలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాల హామీలను నిశితంగా పరిశీలించి, కార్మికుల సమస్యలపై అవగాహనతో ఎన్నికల్లో నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర నాయకులు ఏసురత్నం, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జీడిమెట్ల డిపో యూనియన్ కార్యదర్శి డానియల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు హరినాథరావు, స్వామి, జెఎసి నాయకులు, యువజన నాయకుడు ప్రవీణ్‌తో పాటు పెద్ద సంఖ్యలో ఆర్‌టిసి కార్మికులు పాల్గొన్నారు.

## ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్‌టిసి ఎన్నికల్లో పోటీ చేయదు

**టిజిఎస్‌ఆర్‌టిసి ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ అసోషియేషన్ జనరల్ సెక్రటరి కృష్ణ**



ప్రజాపక్షం/శామీర్‌పేట : తెలంగాణ ఆర్‌టిసి కార్మిక సంఘాల ఎన్నికల్లో ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ అసోషియేషన్ పోటీ చేయడం లేదని టిజిఎస్‌ఆర్‌టిసి ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ కృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్‌టిసి ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యుల వారి స్థానిక పరిస్థితి, ఇతర కారణాల వలన ఎవరికి నచ్చిన విధంగా వారు పనిచేస్తున్న యూనిట్‌లలో అన్ని యూనియన్‌ల లో వివిధ పదవుల్లో పని చేస్తున్న కారణంగా సంఘం ఎన్నికల్లో పోటీ చేయ డం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయనందున అన్ని యూనియన్‌ల సంఘం నాయకులు సంఘం కమిటీకి రాత పూర్వకంగా మద్దతు ఇవ్వాలని కోరారని తెలిపారు. పోటీలో ఉన్నవారు వివిధ రకాలు గా పొత్తులు పెట్టుకుని గెలుపు కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నార ని పేర్కొన్నారు. ఈ పరిస్థితిల్లో అనేక రకాల చర్చల తర్వాత రాష్ట్ర జోనల్ రీజియన్ కమిటీల నాయకులు అభిప్రాయాల మేరకు ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ అసోషియేషన్ సంఘం సభ్యులు, వివిధ కమిటీలలో అవకాశం ఇచ్చిన కా ర్మికుల శ్రేయస్సు, సంస్థ రక్షణ, విలీనం అనేక సమస్యల పరిష్కారం కోసం రాజ్యాంగం ద్వార పొందిన ఓటు హక్కును ఎవరి ఇష్టానుసారం వారు వేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర కమిటీ ఏ ఒక్క యూనియన్‌కు మద్దతు ఇవ్వడం లేదని మరోసారి స్పష్టం చేశారు. సంఘం ఐఖ్యత ధ్యేయంగా తటస్థంగా ఉండాలని రాష్ట్ర జోనల్ రీజియన్ డిపో స్థాయి కమిటీల సభ్యులకు తెలియపరిచారు.

## మైనర్ బాలుడు అదృశ్యం



ప్రజాపక్షం/చర్లపల్లి : మైనర్ బాలుడు అదృశ్యమైన సంఘటనకుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుషాయిగూడ శివసాయి నగర్ కాలనీకి చెందిన తండ్రి కలికివాయి మహేష్ కుమారుడు కె లోకేష్(16)ను కమాలా నగర్ శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్ ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.శనివారం ఉదయం కుమారున్ని తండ్రి కాలేజీ వద్ద ద్విచక్ర వాహనంపై దించాడు.తిరిగి లోకేష్ ఇంటికి రాకపోవడంతో కాలేజీ,స్నేహితులు,చుట్టు పక్కలవారిని విచారించిన ఆచూకీ లభించకపోవడంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# సిఇసి జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలి

**6న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి: ఇటి నరసింహ**




ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 6న ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ పిలుపునిచ్చారు. ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ వద్ద సిఇసి జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన కటౌట్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇటి.నరసింహ మాట్లాడుతూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించటానికి ఏర్పాటు చేసిన భారత ఎన్నికల కమిషన్ వ్యవస్థను జ్ఞానేశ్ కుమార్ అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఎన్నికల కమిషనర్‌గా టి.ఎన్. శేషన్ ఎటువంటి పక్షపాతం లేకుండా రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా స్వతంత్ర నిర్ణయాలు తీసుకుంటూ ప్రజల విశ్వాసం , నమ్మకాన్ని కలిగించారని గుర్తు చేశారు. కాని నేడు అధికారంలో ఉన్న బిజెపి కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలలో అధికారంలోకి రావడం కోసం 2023 ఎన్నికల చట్టాన్ని సవరించి జ్ఞానేష్ కుమార్ ప్రధాన కమిషనర్‌గా నియమించుకుని ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభించి కోట్లాదిమంది ప్రజల ఓట్లు తొలగించి మహారాష్ట్ర బెంగాల్ బీహార్ రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నిర్ణయాలు తీసుకుంటూ ఏకపక్షంగా బిజెపి పార్టీకి లబ్ధి చేకూరే విధంగా ప్రజా ప్రాతినిధ్య చట్టానికి విరుద్ధంగా ఫారం 6లో మార్పులు చేయడం జరిగిందన్నారు. దేశవ్యాప్తంగా తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని దేశద్రోహచార్యలకు పాల్పడిన జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని అతనిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు పార్టీలు రోడ్ల మీదకు వచ్చి నిరసన తెలియజేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిస్సిగ్గుగా ఆయనకు వంత పాడుతోందని ఆగ్రహంవ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ జీవించే హక్కుతో సమానమైన ఓటు హక్కును కాపాడుకోవడం కోసం ఈనెల 6న ఇండియా కూటమి పార్టీల ఆధ్వర్యంలో జరిగే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఇటి.నరసింహా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుఎస్.ఛాయాదేవి, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శికమతం యాదగిరి ఎఐటియుసి అధ్యక్షుడు బి.వెంకటేశం,ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు కె.ధర్మేంద్ర, రాష్ట్ర అధ్యక్షుడు నేర్లకంటి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి శ్రీమాన్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చెట్టుకింది శ్రీనివాస్, కళ్యాణ్, అనిల్, ఎస్.ఆర్.శ్రీనివాస్, కృష్ణ, భాను, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయానికి నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలి

**ఉద్దెమర్రి సబ్ స్టేషన్ ముందు రైతుల మెరుపు ధర్నా**



ప్రజాపక్షం/శామీర్‌పేట : వ్యవసాయానికి సరిపడా విద్యుత్‌ను సరఫరా చేయడం లేదని మూడుచింతలపల్లి మున్సిపల్ ఉద్దెమర్రి, ఉషార్‌పల్లి, అద్రాస్‌పల్లి, కేశ్వాపూర్ గ్రామాల రైతులు ఉద్దెమర్రి సబ్ స్టేషన్ వద్ద ఆదివారం మెరుపు ధర్నా కు దిగారు. ఈ సందర్భంగా రైతులు సబ్‌స్టేషన్ ముందు బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఉద్దెమర్రితో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని వ్యవసాయ పొలాలకు త్రీఫేజ్ కరెంట్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు ఆవేదన వ్య క్తం చేశారు. చేతికొచ్చిన వరి పంటలు ఎండిపోతున్నాయని రైతులు తీవ్ర ఆం దోళన చెందారు. పంటలను కాపాడేందు కు రైతులు ఆరాటపడుతుండగా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విద్యుత్ సరఫరా విషయంలో అధికారుల నిర్లక్ష్యమే తమ పం టలు ఎండిపోవడానికి కారణమని రైతు లు ఆరోపించారు. త్రీఫేజ్ కరెంట్ సరఫరాలో అప్రకటిత కోతలతో కాకుండా ని రంతరంగా నిర్దేశించిన సమయం ప్రకా రం సరఫరా చేసి పంటలను కాపాడాల ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని రైతులు హె చ్చరించారు. ఉన్నతాధికారులు వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదంటూ రైతులు భీష్మించారు. వెంటనే స్పందించి న ఎఇ విజయ్‌కుమార్ రైతులతో మాట్లా డి విద్యుత్ సరఫరాలో ఏలాంటి అవాంతరాలు లేకుండా నిరంతరమైన నాణ్యమై న విద్యుత్‌ను సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

## ఉరేసుకొని ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాపక్షం/ఉప్పల్ : ఇంజనీరింగ్ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతం ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పల్ ప్రాంతం శ్రీనగర్ కాలనీలో నివసించే ముకేష్‌కుమార్ కుమారుడు ఆయుష్ కుమార్ షా(19) ఇబ్రహీపట్నంలోని కేశవ మెమోరియల్ ఇంజనీరింగ్ కాలేజిలో బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నారు. శనివారం ఉదయం స్నేహితుడి ఇంటికి వెళ్లి మధ్యాహ్నం 3.30గంటలకు ఇంటికి తిరిగి వచ్చి పడుకొంటానని చెప్పి గదిలోకి వెళ్లాడు. సాయంత్రం కుమారుడి లేపేందుకు వెళ్లిన తల్లి ఎంత పిలిచినా పలుక పోవటంతో అనుమానం కల్గి చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు పగులగొట్టి చూడగా చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొన్న కుమారుడు విగతజీవిగా కనిపించాడు. ఈ మేరకు సమాచారం అందుకొన్న పోలీసులు అ క్కడికి చేరుకొని సమీప ఆస్పత్రికి తరలించగా అ ప్పటికే మృతి చెందాడని వైద్యులు ధృవీకరించటంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నాగారంలో ఉచిత కిడ్నీ, హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు



ప్రజాపక్షం/చర్లపల్లి : నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి ఆర్‌టిసి కాలనీ కమ్యూనిటీ హాలులో కిమ్స్, సన్‌షైన్ హాస్పిటల్ నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాల సహకారంతో ఉచిత కిడ్నీ,హెల్త్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఇందులో కాలనీవాసులు కిడ్నీ సంబంధిత ఆరోగ్య పరీక్షలు, ర్యాండమ్, బ్లడ్, షుగర్, సిరమ్ క్రియాటినిన్,యూరిన్,అనాలిసిస్,యూరోఫ్లోమెట్రీ పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి,మాజీ వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్,పంగ హరిబాబు,గూడురు అశోక్‌గౌడ్,భూమయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సిఐకి అభినందనలు



ప్రజాపక్షం/చర్లపల్లి : కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ సిఐ నరేందర్‌రావును బిల్డర్ అసోసియేషన్ సభ్యులు,అడ్వకేట్లు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. సన్మానించివారిలో భాగ్యనందరావు, తోట నాగేశ్వర్,అడ్వకేట్ అరుణ్‌కుమార్,బాల్‌రాజ్,నర్సింగ్‌రావు,పోచయ్య,సాధిక్,సాయి,బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఓటుపై గర్జన

ప్రజాపక్షం/ఘట్‌కేసర్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటు హక్కు కలిగిన పట్టభద్రులు విధిగా తమ ఓటును నమోదు చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ ఘట్‌కేసర్ డివిజన్ అధ్యక్షుడు బొక్క సంజీవ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఓటు విద్యావంతుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. యువత, నిరుద్యోగులు, ఉద్యోగ నోటిఫికేషన్లు విద్యా వ్యవస్థకు సంబంధించిన సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించే అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టభద్రులు,నిరుద్యోగ యువత నిర్లక్ష్యానికి గురయ్యారని బొక్క సంజీవ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి సమర మోహన్ రెడ్డికి మద్దతుగా పట్టభద్రులు ఓటును నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

# ఓటరు నమోదులో ఉత్సాహంగా పాల్గొనాలి

**బిఆర్‌ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద**



ప్రజాపక్షం/ నిజాంపేట్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనాలని బిఆర్‌ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజుల రామారం, దండముడి లే అవుట్ కమిటీ గాల్‌లో గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని నిర్వహించిన అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఆర్‌ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద పాల్గొని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అనుసరించాల్సిన విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియ మొదట మన ఇంటి నుండి ప్రారంభమవ్వాలని, మన ఇళ్లలోని పట్టభద్రులతో పాటు కాలనీ, డివిజన్‌తో పాటు పరిచయం ఉన్న ప్రతి ఒక్కరి ఇళ్లలో పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదు చేయించాలన్నారు. గతంలో ఓట్లు వేసిన పట్టభద్రులు కూడా తిరిగి ఓటర్ నమోదును చేయించుకుని ఓటు హక్కుని వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో కెసిఆర్ నాయకత్వాన్ని తిరిగి 70శాతం మంది ప్రజలు కోరుకుంటున్నారని, గత పదేళ్ల బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నడిపించారని గుర్తు చేశారు. నేడు కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల అసమర్థత, యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్న తీరును ప్రజలకు వివరించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో కుత్బుల్లాపూర్ నుండి సాధించేలా నాయకులు, కార్యకర్తలు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు విజయ్ రాంరెడ్డి, బాల్‌రాజ్, శ్రీనివాస్ యాదవ్, కమలాకర్, మసూద్ అలీ, సాయి, నవాబ్ భాయ్, మూసాఖాన్, ఇబ్రహీం ఖాన్, మహేష్, వెంకటేష్, లక్ష్మ న్, చిన్నా చౌదరి, ప్రవీన్, అజయ్, సాజిద్, భాస్కర్, తౌర్య నాయక్, చందు గౌడ్, జువైద్, సాధుల వేణు, శ్రావన్ పాల్గొన్నారు.

**నేర నియంత్రణ, పటిష్ట నిఘాకు సిసి కెమెరాలు దోహదం...**

నేర నియంత్రణ, పటిష్ట నిఘా ఏర్పాటులో సిసి కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని బిఆర్‌ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని విజయ దుర్గా కాలనీ (జిపిఆర్)లో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ఎమ్మెల్యే కెపి వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ సిసి కెమెరాల ఏర్పాటుతో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయవచ్చని కాలనీకి వచ్చి వెళ్లే రహదారులను గుర్తించి కెమెరాల ద్వారా సేఫ్ అండ్ స్మార్ట్ కా లనీగా నిలుస్తుందని అన్నారు. కాలనీ అసోసియేషన్ వారు పోలీసులతో కలిసి స్ట్రాటజిక్ పా యింట్లను గుర్తించి సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, నిఘా కెమెరాల ద్వారా కాలనీలో రక్షణ మరింతగా బలపడుతుందని చెప్పా రు. రోజురోజుకి పెరుగుతున్న జనాభాకు, పెరుగుతున్న కాలనీలకు అనుగుణంగా తగిన మౌలిక వసతులను కల్పిస్తున్నామని వివరించా రు. కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీధర్, రాము రాథోడ్, డిఇ పాపమ్మ, ఏఈ ప్రవీన్, నాయకులు దన్‌రాజ్ యాదవ్, రమణారెడ్డి, శ్యాంసిం గ్, తిరుపతిరెడ్డి, రాకేష్, వెంకటరాంరెడ్డి, సుమన్, సందీప్, విశ్వనాథ్, వినోద్, శివ నాగరాజు, యుగంధర్, దుర్గాప్రసాద్, మాజీ కార్పొరేటర్‌లు రవికిరన్, బాలాజీ నాయక్, నాయకులు సాంబశివరెడ్డి, శ్రీకర్ గుప్త, మదుసూదన్, చంద్రయ్య పాల్గొన్నారు.

## జవహర్ నగర్ డంపింగ్ యార్డు బాధితుల మరణాలపై ప్రజా ఉద్యమం



ప్రజాపక్షం/జవహర్ నగర్ : జవహర్ నగర్ డంపింగ్ యార్డు ప్రభావంతో స్థానికంగా నమోదువుతున్న అనారోగ్య మరణాలపై సమిష్టిగా చర్చించి, త్వరలోనే ప్రజలను చైతన్యపరుస్తూ స్పష్టమైన కార్యాచరణతో ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ (జెఎసి) నేతలు స్పష్టం చేశారు. డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో రోజురోజుకూ తీవ్రమవుతున్న అనారోగ్య మరణాలు రాంకీ సంస్థ నిర్వహిస్తున్న చెత్త డంపింగ్ వల్ల పరోక్షంగా జరుగుతున్న హత్యలేనని వారు ఆరోపించారు. కీసర సర్కిల్, జవహర్ నగర్ జిహెచ్‌ఎంసి పరిధిలోని గబ్బిలాలపేట, వైఎస్సార్ నగర్ ప్రాంతంలో డంపింగ్ యార్డు కాలుష్యం కారణంగా గత సెప్టెంబర్ 26న తీవ్ర అనారోగ్యంతో మృతి చెందిన బొల్లం కృష్ణ నివాళి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లం కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం జెఎసి నాయకులు మాట్లాడుతూ, ఇకపై బొల్లం కృష్ణ వంటి దారుణ మరణాలు సంభవించకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు నుండి వెలువడే విషవాయువులు, దుర్వాసనను వెంటనే అరికట్టాలని, ప్రభావిత ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించి, స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే మృతి చెందిన బొల్లం కృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నివాళి కార్యక్రమంలో జెఎసి చైర్మన్ షేక్ షావలి, కోకన్వీనర్లు, సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గడ్డం సదానందం, పిఒడబ్ల్యు(విముక్తి) నేత గడిపే సునీత, జర్నలిస్ట్ కొన్నె వేణు, శారద, సిఎంఎస్ రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, కార్యవర్గ సభ్యురాలు శ్రీదేవి, సిటీ కమిటీ ప్రతినిధి వసంత, అల్లూరి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్‌ఎసిఎస్ చైర్మన్‌గా నల్లపొల్ల ఎల్లారెడ్డి

**ఎఎంసి చైర్‌పర్సన్‌గా అనిత,వైస్ చైర్‌పర్సన్ మధులతచారి**



ప్రజాపక్షం/తాండూరు : పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం(ఎఫ్ఎసిఎస్) చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నల్లపొల్ల ఎల్లారెడ్డిని, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌ను నియమించారు. ఈ మేరకు ఆదివారం తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి వారికి నియామక పత్రాలను ఆందజేసారు. అదే విధంగా కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి(ఎఎంసి) చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్‌పర్సన్‌గా మధులత చారిలతో డైరక్టర్‌లను నియమించడంతో పాటు వారికి నియామక పత్రాలను ఎంఎల్‌ఎ అందజేశారు. ఈ మేరకు ఎఫ్ఎసిఎస్ చైర్మన్ నల్లపొల్ల ఎల్లారెడ్డి, ఎఎంసి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ అనిత, మధులత చారిలు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్బంగా ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి నూతన పాలకవర్గాన్ని, డైరక్టర్‌లను అభినందించారు. అనంతరం ఎంఎల్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం, వ్యవసాయ అభివృద్ధియే లక్ష్యంగా అంకిత భావనతో పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను రైతులకు సకాలంలో అందించే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు పెండ్యాల ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంపిటిసి విద్యాసాగర్, పంచాయతీ కారోబార్ నర్సిరెడ్డి, నరేందర్‌రెడ్డి, గ్రామ కమిటి అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనతో లబ్ధి

**తాండూరు విద్యుత్ ఎడిఇ కె.శంకర్ నాయక్**

ప్రజాపక్షం/తాండూరు : సేవాసేతు అభియాన్ ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తాండూరు సబ్ డివిజన్ విద్యుత్ ఎడిఇ శంకర్ నాయక్ అన్నారు. శనివారం తాండూరు ఎడి కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన ముఫ్త్ యోజనపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎడిఇ మాట్లాడుతూ ప్రతి ఇంటిపై రూఫ్ టాప్ సోలార్ ఫ్యానల్‌ను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ పథకం ప్రకారం గృహ విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్ల రూఫ్‌టాప్‌పై సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకుని ప్రతి నెల 360యూనిట్ల వరుకు విద్యుత్ పొందవచ్చన్నారు. దేశవ్యాప్తంగా కోటి కుటుంబాలకు లబ్ధి చేకూర్చడంతో పాటు విద్యుత్ బిల్లులను తగ్గించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. దీంతో విద్యుత్ బిల్లులు తగ్గించడంతో పాటు కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. ఇందుకు గాను ప్రభుత్వం సబ్సిడిని అందజేస్తుందన్నారు. కోడంగల్ ఎడిఇ రంగారెడ్డి, డిఇ సూర్య, టిజి రెడ్‌కో మేనేజర్ శ్రీనివాస్, ఓం సోలార్ ప్రతినిధులు, న్యాచుర్ ఎనార్జీస్ ప్రతినిధులు శ్రీనివాస్ తదితరులు పాల్గోన్నారు.




## గాగిల్లపూర్‌లో లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ పర్యటన

ప్రజాపక్షం/దుండిగల్ : దుండిగల్ సర్కిల్ గాగిల్లపూర్‌లో రోడ్డు అక్రమనపై లోకాయుక్తలో స్థానికులు ఫిర్యాదు చేయడంతో అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. స్థానికుల ఫిర్యాదుతో కదిలిన లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ డిప్యూటీ డైరెక్టర్ పి.జైపాల్ సర్వే నంబర్ 185,186లో 25 ఫీట్ రోడ్డును ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను స్థానిక అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణాలు జరిగినట్లు గుర్తించిన ఆయన అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించినట్లు సమాచారం. రోడ్డు పొడవునా హై టెన్సెన్ లైన్ ఉండడం రోడ్డును ఆక్రమించి ఓ భారీ నిర్మాణం చేపట్టడంతో నిర్మాణ సమయంలో హై టెన్సెన్ వైర్ తగిలి ఓ భవన నిర్మాణ కార్మికుడు మరణించడంతో మున్సిపల్ అధికారుల తీరుపై అప్పట్లో పెద్దఎత్తున విమర్శలు వినిపించాయి. గాగిల్లపూర్ పాత పోస్టాఫీస్ రోడ్డును ఆక్రమించి జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై మేడ్చెల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని, గవర్నర్‌కు సైతం ఫిర్యాదు చేశామని స్టానికుడు శివ నాగేశ్వర రావు అన్నారు. అక్రమ నిర్మాణాలతో 25 ఫీట్ల రోడ్డు కాస్త12 ఫీట్లకు చేరుకుందని,మున్సిపల్ అధికారుల తీరుపై హై కోర్టును ఆశ్రాయించామని లోకాయుక్తలో సైతం ఫిర్యాదు చేసామన్నారు. శనివారం లోకాయుక్త అధికారులు విజిట్ చేసి అక్రమ నిర్మాణాలను తొలగించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారన్నారు.



# కెబిఆర్ ఫ్లైఓవర్, అండర్‌పాస్ ప్రాజెక్టుకు స్వస్తి

### పంజాగుట్ట- జూబ్లీహిల్స్ మధ్య ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం

### నగరంలో రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం

### జిహెచ్‌ఎంసి స్థాయీ సంఘం నిర్ణయాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి పరిధిలో మౌలిక వసతుల కల్పన, రహదారుల అభివృద్ధి, రవాణా వ్యవస్థ మెరుగుదలకు స్థాయీ సంఘం పచ్చజెండా ఊపింది. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక అధికారి, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ సంయుక్త అధ్యక్షతన జరిగిన 8వ స్థాయీ సంఘం సాధారణ సమావేశంలో మొత్తంగా 14 కీలక తీర్మానాలకు ఆమోదించింది. ఈ భేటీలో అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ట్రాఫిక్ చిక్కులను అధిగమించేందుకు ప్రభుత్వం పలు కీలక ప్రాజెక్టులపై నిర్ణయం తీసుకుంది. కెబిఆర్ పార్కు చుట్టూ జూబ్లీ చెక్‌పోస్ట్, బసవతారకం ఆసుపత్రి, ఫిల్మ్‌నగర్ సహా ఏడు కూడళ్లలో రూ.1090 కోట్లతో నిర్మించతలపెట్టిన స్టీల్ బ్రిడ్జిలు, అండర్‌పాస్‌ల నిర్మాణ ప్రాజెక్టును జిహెచ్‌ఎంసి రద్దు చేసింది. ఇటీవల పార్కు చుట్టూ అమలు చేసిన 'వన్ వే' విధానం విజయవంతమై ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడంతో, కెఎన్ఆర్, మేఘా సంస్థలతో చేసుకున్న కాంట్రాక్టు ఒప్పందాలను రద్దు చేసేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. దీనికి ప్రత్యామ్నాయంగా పంజాగుట్ట నుంచి హైటెక్ సిటీ వరకు సిగ్నల్ ఫ్రీ ప్రయాణం కోసం పంజాగుట్ట ఎన్‌ఎఫ్‌సిఎల్ కూడలి నుంచి జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 36 (చెక్‌పోస్ట్ మెట్రో స్టేషన్) వరకు 4 కిలోమీటర్ల పొడవున ఆరు లైన్‌ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 3లోని ముఫకమ్జా కళాశాల వద్ద ఈ పైవంతెన ఎక్కి నేరుగా చెక్‌పోస్ట్ వద్ద దిగేలా, అలాగే రోడ్డు నెంబర్ 1 వైపు వెళ్లే వాహనాల కోసం జలగం వెంగళరావు పార్కు వరకు ప్రత్యేక ర్యాంప్ నిర్మించేలా డిజైన్‌లు రూపుదిద్దుకుంటున్నాయి. మరోవైపు నగరంలో పలు ప్రాజెక్టుల వ్యయాలకు పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. జూపార్కు నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు రూ.799.74కోట్లతో నిర్మించిన పైవంతెన నిర్మాణ వ్యయానికి, అలాగే ఒవైసీ జంక్షన్, బహదూర్ పూరా కూడళ్లలోని ఫ్లైఓవర్లపై రూ.132 కోట్లతో రెండో స్థాయి వంతెనల నిర్మాణానికి కమిటీ ఆమోదముద్ర వేసింది. ఎన్‌హెచ్44 నుంచి జల్‌పల్లి వరకు రహదారిని 36 మీటర్ల వెడల్పుతో విస్తరించే రోడ్డు అభివృద్ధి ప్రణాళిక (ఆర్‌డిపి)లో భాగంగా 251 ఆస్తుల సేకరణకు నిర్ణయించారు. ఇతర నిర్ణయాల్లో మైలార్‌దేవ్‌పల్లి గగన్‌పహాడ్ పరిధిలో రూ.2.4 కోట్లతో సిసి రోడ్లు, ఆదిభట్ల సర్కిల్ తో్రరూరు పరిధిలోని ఇంజాపూర్ డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద రూ.3.7 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణాలకు ఆమోదం తెలిపారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 25, 26లోని రెండు పార్కుల నిర్వహణను సిఎస్‌ఆర్ నిధులతో మూడేళ్ల పాటు మేఘా సంస్థకు అప్పగించేందుకు అంగీకరించారు. కాటేదాన్ ఇండోర్ స్టేడియం సహా ఇతర జిహెచ్‌ఎంసి క్రీడా ప్రాంగణాల వినియోగ రుసుముల సవరణ, పారిశుద్ధ్య నిర్వహణ బలోపేతంపై కూడా ఈ సమావేశంలో చర్చించారు.

## ఆర్‌టిసి గుర్తింపు ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ కూటమిని గెలిపించాలి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** ఆర్‌టిసి గుర్తింపు ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ ఐక్య కూటమిని గెలిపించాలని ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్మిక సంఘం సీనియర్ నాయకులు సిఎచ్ యాదగిరి కార్మికుల పిలుపునిచ్చారు.ఆదివారం ఇబ్రహీంపట్నం ఆర్‌టిసి డిపో సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ నాయకులు సిఎచ్ యాదగిరి మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై రాజీ లేని పోరాటం చేసే ఎంప్లాయిస్ యూనియన్ ఐక్య కూటమి అభ్యర్థులకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఐక్య కూటమి నాయకులు వి.శ్రీనివాస్, బి శ్రీనివాస్, బి అశోక్,జిల్ల జంగయ్య,సిఎచ్ పరమేష్,వెంకటేష్,కిషన్,దూసరి జంగయ్య, కార్మికులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి



**ప్రజాపక్షం/హయత్‌నగర్:** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువత కృషి చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. జిఎస్ఐ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు పోచబోయిన వినోద్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు యువకులు యువజన కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ డివిజన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా చిర్రబోయిన జైకృష్ణ యాదవ్,ప్రధాన కార్యదర్శులుగా రాకేష్, కళ్యాణ్, రోహిత్,కార్యదర్శులుగా ఫిరోజ్, శివసాయి,జాయింట్ సెక్రెటరీగా రితీష్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా భవానీ శంకర్లకు నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా లింగోజిగూడ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గణేష్‌గౌడ్‌ని నియమించి నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యరమల రామచంద్రారెడ్డి, లోకేశ్, శివకుమార్, మిద్దెల భగత్, సామలేటి సాయి, సంజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ అడ్డా సమస్యకు పరిష్కార మార్గం



**ప్రజాపక్షం/హయత్‌నగర్:** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని లేబర్ అడ్డా వద్ద నెలకొన్న సమస్యకు పరిష్కారం చూపేందుకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి చర్యలు చేపట్టారు. ఆదివారం లేబర్ అడ్డా ప్రాంతాన్ని సందర్శించిన ఎమ్మెల్యే.. స్థానిక కాలనీవాసులు, కార్మికులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. లేబర్ అడ్డా కారణంగా ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి స్పందిస్తూ.. ఎన్నో సంవత్సరాలుగా ఇదే ప్రాంతంలో జీవనోపాధి పొందుతున్న కార్మికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా,అదే సమయంలో స్థానిక ప్రజలకు సమస్యలు లేకుండా పరిష్కారం చూపుతామని తెలిపారు. రేడియో స్టేషన్ సమీపంలోని ఫుట్‌పాత్ ప్రాంతంలో కార్మికుల కోసం మూత్రశాలలు, తాగునీటి సౌకర్యం, విశ్రాంతి తీసుకునేందుకు షెడ్డు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొప్పుల విఠల్ రెడ్డి, చెన్నగోని శ్రీధర్ గౌడ్,గుత్త లక్ష్మారెడ్డి, దీపావళి శ్రీకాంత్‌తో పాటు కాలనీ అధ్యక్ష,కార్యదర్శులు,కార్మికులు పాల్గొన్నారు.

## డివిజన్ సమస్యలు పరిష్కరించండి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వనస్థలిపురం డివిజన్ సమస్యలు పరిష్కారం చూపాలని రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబును ఆదివారం వారి నివాసంలో వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి కాలనీతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి వనస్థలిపురంలోని అభ్యుదయ నగర్ కాలనీ, జనప్రియ కాలనీ, నాగార్జున కాలనీ, శక్తి నగర్ కాలనీ తదితర కాలనీలకు సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, ఇతర మౌలిక వసతులు కల్పనకు కృషి చేసి నిధులు మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. ఈమేరకు మంత్రి సానుకులంగా స్పందించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చి సమస్యలను త్వరలోనే పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట శక్తి నగర్ కాలనీ అధ్యక్షులు అజయ్ యాదవ్, అభ్యుదయ నగర్ కాలనీ అధ్యక్షులు గంగిరెడ్డి ఉన్నారు.

## వెండి నాణేల కలకలం..



**ప్రజాపక్షం/కొందుర్గు:** రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రానికి చెందిన ఒక పురాతన మట్టి ఇల్లును కూల్చివేసి..ఆ మట్టిని తరలిస్తుండగా భారీగా పురాతన వెండి నాణేలు బయటపడ్డాయి. మొదట గమనించిన కొంతమంది కూలీలు, చుట్టుపక్కల వారు ఎవరికి తెలియకుండా రహస్యంగా వాటిని ఏరుకున్నారు. ఈ విషయం రహస్యంగా ఉంచినప్పటికి ఈనిది వ్యవహారం కాస్తా లీకై గ్రామంలో క్షణాల్లో వ్యాపించింది. మట్టిలో ఇంకా నాణేలు ఉన్నాయనే వార్త తెలియడంతో వందలాది మంది జనం ఆ మట్టి కుప్పల వద్దకు ఉరుకులు, పరుగులు పెట్టారు. నాణేల కోసం జనం ఎగబడ్డారు. చేతులతోపాటు పారలతో, కర్రలతో మట్టిని తవ్వుతూ దొరికిన నాణేలను జేబుల్లో వేసుకున్నారు. కొంతమందికి నాగుగైదు నాణేలు లభించగా మరికొంతమందికి అంతకంటే ఎక్కువే దొరికినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న కొందుర్గు పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. లభించిన నాణేల తీరుని స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. స్థానికుల నుంచి వివరాలు తెలుసుకొని పురావస్తుశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

## యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** జిల్లా7 అధ్యక్షుడు వందనపు మధు, ప్రధాన కార్యదర్శి పి.రవీంద్ర కుమార్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని కాస్మోపాలిటన్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి యోగ సాధకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమానికి భారతీయ యోగ సంస్థాన్ తెలంగాణ రాష్ట్ర (తూర్పు) అధ్యక్షులు సుధీర్ కులకర్ణి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా మాజీకార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, సంస్థాన్ కార్యదర్శి సదానంద చారి, కాస్మోపాలిటన్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రుద్ర లక్ష్మీనరసింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సంస్థాన్ అధికారులు,యోగ గురువులతో పాటు 550 మందికి పైగా యోగ సాధకులు పాల్గొన్నారు. కార్యక్రమం చివరలో మంగ ఆధ్వర్యంలో యోగ సాధికులు ప్రదర్శించిన ప్రత్యేక యోగ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. యోగాసనాలను నృత్య రూపంలో ప్రదర్శించిన తీరు కార్యక్రమానికి ఆకర్షణగా నిలిచింది.

## ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

### జిఒ641ని తక్షణమే రద్దు చేయాలి

### ప్రొఫెసర్ హరగోపాల్



**ప్రజాపక్షం/కొత్తూరు:** ప్రజల ఆరోగ్య భద్రతతో పాటు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివారం కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో ఎకో టౌన్ పేరుతో తీసుకువచ్చిన 641జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. గ్రామీణ ప్రాంతాలను కాలుష్య కోరల్లోకి నెట్టి వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ( గత ప్రభుత్వ హయాంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు భూమికి కేటాయిస్తే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం చెత్త డింపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు యత్నించి జిఒ 641 తీసుకురావడం ఎంతవరకు సమంజసమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రశ్నించారు. సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డును ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సిద్దాపూర్‌లో చెత్త డింపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే భూగర్భ జలాలు దెబ్బతిని తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ప్రొఫెసర్ విజయ్ అన్నారు. డంపింగ్ యార్డు చుట్టుపక్కల ఈగలు, దోమలు, క్రిమి కీటకాలు వంటి వ్యాధి కారకాలు పెరిగి ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుందన్నారు. జెఎసి చైర్మన్ రాంబాల్‌నాయక్, నాయకులు, ప్రజాప్రతినిధులు పినపాక ప్రభాకర్, తిరుమలయ్య, రవీంద్రనాథ్, కోడిచర్ల తండా రజిత, రాజేందర్‌రెడ్డి, శ్రీధర్ ఆచారి, నాగేష్ నాయక్, సురేష్, మల్లేష్, నవీన్, శ్రీకాంత్, మహేందర్, చరణ్‌చారి, ప్రమోద్, చాకలి యాదగిరి, మహేష్, రమేష్, నరేందర్‌రెడ్డి, ఎమ్మెసత్యనారాయణ, వడ్డె బాలయ్య, కృష్ణయ్య, బైర్‌ఖాన్‌పల్లి సర్పంచ్ శివ, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, హరికృష్ణ చారి, మల్లేష్, వంశీచారి, పిప్పల చిన్న, కార్తీక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

### తొ్రరూర్ డివిజన్‌లో రూ.1.38 కోట్లతో

## అభివృద్ధి పనులకు శ్రీకారం



### ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**ప్రజాపక్షం /తుర్కయంజాల్:** పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవటమే లక్ష్యంగా పనిచేస్తున్నానని, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధి పథంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆదిభట్ల సర్కిల్ తొ్రరూర్ డివిజన్ పరిధిలో కోటి 38లక్షల రూపాయలతో పూర్తి చేసిన పలుఅభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. రూ.10లక్షలతో శ్రీరంగంపురం కాలనీలో, రూ.20లక్షలతో బాలాజీనగర్‌లో, రూ.10క్షలతో తిరుమలనగర్ కాలనీలో, రూ.35లక్షలతో యాపిల్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇంజాపూర్ మండల పరిమిత పాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. తుర్కయంజాల్‌లో రూ.30లక్షలతో నిర్మించిన స్మశానవాటిక, రూ.20లక్షలతో కమ్యూనిటీహాల్, యాపిల్ ఎవెన్యూ కాలనీలో రూ.13లక్షలతో ఓపెన్ జిమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న పదేళ్లలో తుర్కయంజాల్, హయత్‌నగర్ ప్రాంతాలు ఆదర్శంగా నిలిచాయని మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నిధుల కేటాయింపులో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి అగ్రతాంబూలం వేస్తున్నారు. హైదరాబాద్ కాలనీలను తలదన్నేలా ఇక్కడి మున్సిపాలిటీలను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. ఆరుట్ల టీపీఎస్, ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రి నిర్మాణాలే ఇందుకు నిదర్శనం అని పేర్కొన్నారు. తొ్రరూర్ సమీపంలోని మరో ప్రభుత్వాస్పత్రి నిర్మిస్తామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ నివాసం ఉండే వారిని ఎవరైనా ఇబ్బంది పెడితే సహించబోనని ఎమ్మెల్యే మల్‌రెడ్డి హెచ్చరించారు. తాను తొ్రరూర్‌లోనే అందుబాటులో ఉంటానని ఎవరికి ఇబ్బంది ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సహకార బ్యాంక్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య, మాజీ వైస్ చైర్పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు సామ భీమ్ రెడ్డి, కొశికే ఐలయ్య, శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ కాకుమాను సునీల్ పాల్గొన్నారు

### రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం..

## భూమికోసం ఆగిన పేద రైతు గుండె

### తహసీల్దార్, ఆర్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**ప్రజాపక్షం/షాబాద్:** రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం..భూమి కోసం కార్యాలయం చుట్టు తిరిగి అలసిపోయి పేద రైతు గుండె ఒక్కసారిగా అగిపోయింది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం తిమ్మారెడ్డిగూడ గ్రామంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వారణాసి యాదయ్య (50) అనే పేద రైతు ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై మృతి చెందాడు. తిమ్మారెడ్డిగూడ గ్రామంలో సర్వేనంబర్ 483లో నాలుగు ఎకరాల భూమి ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. ఇందిరమ్మ కాలంలో జీవనోపాధి కోసం గతంలో ఇచ్చారని, అప్పటి నుండి రెవిన్యూ రికార్డుల్లో మృతుడు యాదయ్య పేరుపై ఉన్న భూమిని ఎండాన్స్‌మెంట్ సర్వే చేసి నీకు భూమి లేదని మండల తహాశీల్దార్ అన్వర్, ఆర్ఐ విజయ్ చేపడంతో చేవెళ్ళ ఆర్‌డిఓ కార్యాలయానికి వెళ్ళినట్లు వివరించారు. అక్కడ ఆర్‌డిఓ మృతుడు యాదయ్య ముందే మండల తహాశీల్దార్ అన్వర్, ఆర్ఐ విజయ్‌లకు ఫోన్ చేసి చెప్పినట్లు తెలిపారు. యాదయ్య మృతికి కారణమైన తహాశీల్దార్ అన్వర్, ఆర్ఐ విజయ్‌లపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**రెవెన్యూ అధికారుల నిర్యక్ష్యంతోనే రైతు మృతి : సర్పంచ్ చెన్నయ్య**

షాబాద్ మండల రెవెన్యూ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తప్పుడు రికార్డులు సృష్టిస్తూ రైతుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని తిమ్మారెడ్డిగూడ సర్పంచ్ చెన్నయ్య ఆరోపించారు. గ్రామానికి చెందిన మృతుడు యాదయ్యకు నాలుగు ఎకరాల భూమి ఉన్న మాట వాస్తవమేనని, తహసీల్దార్, ఆర్ఐలు కుమ్మక్కై పేదల భూములను ఉన్నవాళ్ళకు రాస్తూ తప్పు డు రికార్డులు సృష్టిస్తున్నారని వాపోయారు. తప్పుడు రికార్డులు చేసినట్లు తమ వద్ద ఆధారా లు ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనపై సమాగ్ర విచారణ చేసి తహసీల్దార్ అన్వర్, ఆర్ఐ విజయ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో మరికొంతమంది రైతుల ప్రాణాలో పోయే అస్కారం ఉందని, ఉన్నతాధికారులు సకాలంలో మేల్కొని విచారణ చేసి చర్యలు చేపట్టాలని సర్పంచ్ డిమాండ్ చేశారు.

# ఒబిసిల హక్కుల సాధనకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

### సింహగర్జనకు భారీగా కాంగ్రెస్ శ్రేణులు, బిసి సంఘాల ప్రతినిధులు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఒబిసి వర్గాల హక్కుల సాధన, రాజకీయ ప్రాధాన్యతతో పాటు వారి సర్వతోముఖ అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం సాగుతోందని రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని శంషాబాద్ మండలం గొల్లపల్లి రోడ్డులో ఒబిసి చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒబిసి సింహగర్జన' భారీ బహిరంగ సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్బంగా పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఒబిసిల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతోందన్నారు. సమాజంలోని బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలవడమే కాంగ్రెస్ విధానమని, ఒబిసిల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు.

**షాద్‌నగర్:** జాతీయ జనగణనలో ఒబిసి కుల గణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఒబిసి చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం షాద్‌నగర్ నుండి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నేతృత్వంలో సుమారు వెయ్యి వాహనాల్లో పెద్ద ఎత్తున శంషాబాద్‌లో నిర్వహించే బిసి సింహగర్జన మహాసభకు తరలివెళ్ళారు. అంతకుముందు ముఖ్యకూడలిలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్ళు అర్పించారు. భారీ గజమాలతో స్వాగత తోరణం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మెన్ అందె మోహన్, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇబ్రహీం, బాబర్‌ఖాన్, శ్రేణులు రఘునాయక్, చందునాయక్, శ్రీనునాయక్, కేకే కృష్ణ పాల్గొన్నారు.

**కేశంపేట :** దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణనలో ఒబిసి కులగణనను నిర్వహించాలనే డిమాండ్‌తో శంషాబాద్‌లో టిపిసిసి ఒబిసిసెల్ చైర్మెన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్ళారు. కేశంపేట మండల అధ్యక్షుడు రమేష్, మాజీ జడ్పిటిసి తాంద్ర విశాల శ్రావణ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్ అప్ప, సింగిల్ విండో చైర్మెన్ శ్రీధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్ళారు.

**కొందుర్గు:** ఒబిసి సింహగర్జన మహాసభకు శ్రీరంగాపూర్ కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్ళారు. ఓబీసిల హక్కుల సాధన, కులగణన, జనాభా ప్రాతిపదికన సామాజిక న్యాయం సాధించాలనే లక్ష్యంతో టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఓబీసి చైర్మెన్ వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. ఓబీసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తగిన ప్రాధాన్యత, ప్రాతినిత్యం కల్పించేందుకు కృషి చేయాలన్నారు.







ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
సోమవారం
05-10-2026
www.prajapaksham.in
GREATER HYDERABAD
మహానగరి
GREATER HYDERABAD


# హైదరాబాద్‌కు సరికొత్త పాలనా వ్యవస్థ

- అమల్లోకి కోర్ అర్బన్ రీజియన్ చట్టం-2026
- 'క్యూర్' చట్టంలో ఒకే ప్రాపర్టీ ఐడి, ఒకే బిల్లు, ఒకే పోర్టల్ రోడ్లు, ట్రాఫిక్, చెరువులు, విపత్తులపై సమగ్ర వ్యవస్థ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ నగర పాలనలో కీలక మార్పులకు శ్రీకారం చుడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కోర్ అర్బన్ రీజియన్ (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) చట్టం2026 అమల్లోకి వచ్చింది. 70 ఏళ్ల నాటి జిహెచ్ఎంసి చట్టం స్థానంలో తీసుకొచ్చిన ఈ కొత్త చట్టం అక్టోబర్ 2 నుంచి అమల్లోకి వచ్చింది. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లకు ఈ చట్టం వర్తించనుంది. నగర పాలనను సమగ్రంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి అధ్యక్షతన క్యూర్ అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్ ఏర్పాటు కానుంది. నగరాభివృద్ధికి సంబంధించిన కీలక నిర్ణయాలను ఈ కౌన్సిల్ తీసుకుంటుంది. మున్సిపల్ కార్పొరేషన్‌లతో పాటు పోలీస్, రెవెన్యూ, హెచ్ఎండిఎ, జలమండలి, విద్యుత్, మెట్రో, ఆర్‌టిసి, హైడ్రా వంటి విభాగాలు ఒకే వేదికపై సమన్వయంతో పనిచేసే విధంగా కొత్త వ్యవస్థను రూపొందించారు. 1955లో పాత మున్సిపల్ చట్టం అమల్లోకి వచ్చిన సమయంలో హైదరాబాద్ జనాభా సుమారు 15 లక్షలు మాత్రమే ఉండగా, ప్రస్తుతం కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో దాదాపు 1.3 కోట్ల మంది నివసిస్తున్నారు. నగరం విస్తరించడంతో పాటు వరదలు, ట్రాఫిక్ సమస్యలు, కాలుష్యం, నీటి కొరత, చెరువులు, నాలాల ఆక్రమణలు, ఎత్తైన భవనాల్లో అగ్నిప్రమాదాల వంటి కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితులకు అనుగుణంగా నగర పాలన వ్యవస్థను మార్చేందుకు ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. ప్రస్తుత మూడు కార్పొరేషన్ల సరిహద్దుల్లో ఎలాంటి మార్పులు ఉండవు. మేయర్, డిప్యూటీ మేయర్, స్థాయీసంఘం, కమిషనర్, వార్డు కమిటీ వ్యవస్థలు కొనసాగుతాయి. స్థానిక సంస్థల పదవీకాలం ఐదేళ్లుగానే ఉంటుంది.

**ఇంటి రిజిస్ట్రేషన్తోనే ఆటోమేటిక్ మ్యుటేషన్**

కొత్త చట్టంలో ఆస్తుల నిర్వహణకు సంబంధించి కీలక మార్పులు చేశారు. ఇంటి కొనుగోలు అనంతరం మ్యుటేషన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే మ్యుటేషన్ ప్రక్రియ ఆటోమేటిక్‌గా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి ఆస్తికి ప్రత్యేకమైన ఇంటిగ్రేటెడ్ ప్రాపర్టీ ఐడెంటిటీ కోడ్ ఇవ్వనున్నారు. ఆస్తిపన్ను, నీటి బిల్లులు, మురుగునీటి ఛార్జీలు, పారిశుద్ధ్య బకాయిలు వంటి వివరాలన్నీ ఈ గుర్తింపు సంఖ్యకు అనుసంధానమవుతాయి. పౌరులకు అన్ని రకాల మున్సిపల్ సేవలు, అనుమతులు, లైసెన్సులు ఒకే ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా అందుబాటులోకి రానున్నాయి.

**ఆస్తిపన్ను పెంపునకు పరిమితులు**

ఆస్తిపన్ను విధానంలోనూ మార్పులు చేశారు. ఇప్పటివరకు ఉన్న వార్షిక అద్దె విలువ ఆధారిత విధానానికి బదులుగా రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించే మూలధన(క్యాపిటల్) విలువ ఆధారంగా పన్ను లెక్కించనున్నారు. 375 చదరపు అడుగుల వరకు ఉన్న ఆస్తులకు ప్రస్తుతం ఉన్న రూ.101 నామమాత్రపు పన్ను కొనసాగుతుంది. ఇతర నివాస ఆస్తులకు క్యాపిటల్ విలువలో 0.10 శాతం నుంచి 0.50 శాతం వరకు, నివాసేతర ఆస్తులకు 0.20 శాతం నుంచి 2 శాతం వరకు పన్ను రేట్లను కార్పొరేషన్లు నిర్ణయించనున్నాయి. కొత్త రేట్లు ఖరారయ్యే వరకు నివాస ఆస్తులకు 0.15 శాతం, నివాసేతర ఆస్తులకు 0.75 శాతం చొప్పున పన్ను వసూలు చేయనున్నారు. కొత్త విధానంతో ప్రజలపై ఒక్కసారిగా పన్ను భారం పడకుండా పరిమితులు విధించారు. గత ఏడాది చెల్లించిన పన్నుతో పోలిస్తే ఏ సంవత్సరంలోనూ పెరుగుదల 10 శాతానికి మించకుండా నిబంధనలు రూపొందించారు. ప్రస్తుతం రూ.10 వేల ఆస్తిపన్ను చెల్లిస్తున్న వారు మొదటి ఏడాది గరిష్ఠంగా రూ.11 వేల వరకు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.

**భవన అనుమతులు పూర్తిగా ఆన్‌లైన్‌లో..**

భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోకి తీసుకురానున్నారు. నిర్ణీత సమయంలో అధికారులు నిర్ణయం తీసుకోకపోతే దరఖాస్తు పైస్థాయికి వెళ్లే విధానం ఉంటుంది. అవసరమైన సందర్భాల్లో డీమ్డ్ అప్రూవల్‌కు కూడా అవకాశం కల్పించారు. వ్యాపార లైసెన్సింగ్ విధానాన్ని సరళీకరించడంతో పాటు రాత్రివేళల్లో కార్యకలాపాలు కొనసాగించే నైట్ ఎకానమీ జోన్‌లు ఏర్పాటు చేసే అవకాశం కల్పించారు. చిన్నపాటి ఉల్లంఘనలకు క్రిమినల్ కేసులు నమోదు చేసే పాత విధానంలో మార్పులు చేశారు. చాలా ఉల్లంఘనలకు సివిల్ జరిమానాలు విధించే విధానం అమల్లోకి రానుంది. జరిమానా విధించే ముందు తప్పనిసరిగా షోకాజ్ నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది.

**రోడ్డు తవ్వకాలపై సమన్వయ వ్యవస్థ**

నగరంలో ఒక శాఖ రోడ్డు వేసిన వెంటనే మరో శాఖ తవ్వే పరిస్థితులకు అడ్డుకట్ట వేసేందుకు యుటిలిటీ కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేయనున్నారు. రోడ్డు తవ్వకాలపై వివిధ శాఖల మధ్య ఈ కమిటీ సమన్వయం చేస్తుంది. ట్రాఫిక్ నిర్వహణ కోసం క్యూర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ అథారిటీ పనిచేస్తుంది. ఫుట్‌పాత్‌లు, పాదచారుల క్రాసింగ్‌లు, కర్బ్ ర్యాంపులు, వీధి దీపాలు, ట్రాఫిక్ సిగ్నళ్ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పాఠశాలల వద్ద సేఫ్ స్కూల్ జోన్లు ఏర్పాటు చేసే అవకాశం కూడా కల్పించారు.

**చెరువులు, నాలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు**

చెరువులు, నాలాలు, పార్కులు, బహిరంగ ప్రదేశాల పరిరక్షణకు కొత్త చట్టంలో ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. జలవనరుల్లో మురుగునీరు, కాలుష్య వ్యర్థాలను వదలడాన్ని నిషేధించారు. చెరువులు, నాలాలు, పార్కుల ఆక్రమణలపై చర్యలు తీసుకునేందుకు హైడ్రాకు చట్టబద్ధమైన బలం కల్పించారు. నిర్మాణ వ్యర్థాలను అనుమతి లేకుండా పారేస్తే కఠిన జరిమానాలు విధించనున్నారు. నాలాలు, చెరువులు, ఫుట్‌పాత్‌లపై వ్యర్థాలు వేస్తే జరిమానాలు రెట్టింపు కానున్నాయి. పెద్ద భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు తప్పనిసరి చేసే అవకాశం ఉంది. పర్యావరణహిత చర్యలు తీసుకునే ఆస్తులకు ఆస్తి పన్నులో రాయితీలు కల్పించే అవకాశాన్ని కూడా చట్టం కల్పించింది.

**విపత్తుల నిర్వహణకు ప్రత్యేక అథారిటీ**

కోర్ అర్బన్ రీజియన్ మొత్తం పరిధికి ఒకే విపత్తు నిర్వహణ ప్రణాళిక ఉండనుంది. క్యూర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ విపత్తుల నివారణ, ముందస్తు సన్నద్ధత, అత్యవసర స్పందన, పునరుద్ధరణ చర్యలను సమన్వయం చేస్తుంది. హైడ్రా విపత్తు స్పందన సంస్థగా పనిచేయనుంది. ఎత్తైన భవనాలు సహా నిర్దేశిత భవనాలకు ఫైర్ ఆడిట్ సర్టిఫికెట్ తప్పనిసరి చేసే అవకాశం ఉంది. ప్రాణాలకు ముప్పు ఉన్న భవనాలను లోపాలు సరిచేసే వరకు సీల్ చేసే అధికారాలు ఉంటాయి. మార్కెట్లు, రవాణా కేంద్రాలు, బహిరంగ ప్రదేశాల్లో సిసిటివి కెమెరాల నిఘాకు కూడా చట్టం ప్రాధాన్యం ఇచ్చింది.

**మహిళలు, వృద్ధులు, గిగ్ కార్మికులకు ప్రాధాన్యం**

నగర మౌలిక సదుపాయాల రూపకల్పనలో మహిళలు, ట్రాన్స్‌జెండార్లు, దివ్యాంగులు, చిన్నారులు, వృద్ధుల అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని కొత్త చట్టం సూచించింది. ప్రతి కార్పొరేషన్‌లో ట్రాన్స్‌జెండర్ సమాజానికి ప్రాతినిధ్యం కల్పించనున్నారు. గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల కోసం విశ్రాంతి ప్రదేశాలు, పారిశుద్ధ్య సదుపాయాలు, పార్కింగ్, ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. వీధి వ్యాపారులకు ప్రత్యేక వెండింగ్ జోన్‌లలో మౌలిక వసతులు కల్పించనున్నారు.

**కాలం చెల్లిన నిబంధనలకు ముగింపు**

70 ఏళ్ల నాటి చట్టంలోని అనేక కాలం చెల్లిన నిబంధనలను కొత్త చట్టం తొలగించింది. టాంగాలు, జట్కాలు, ఎద్దుల బండ్లు, గుర్రాలు, ఒంటెలు, ఏనుగులపై పన్నులు వంటి పాత నిబంధనలు ఇక ఉండవు. నగరంలోకి వచ్చే సరుకులపై ఆక్ట్రాయ్ వసూలు, ఆవిరి విజిల్ వినియోగానికి అనుమతులు, రూ.5 నుంచి రూ.20 వరకు ఉన్న పాత జరిమానాల వంటి నిబంధనలకు కొత్త చట్టంతో తెరపడింది. కొత్త క్యూర్ చట్టం ద్వారా హైదరాబాద్ నగర పాలనను సమగ్రంగా, సాంకేతిక ఆధారితంగా, ప్రజలకు మరింత సులభంగా అందుబాటులో ఉండేలా మార్చడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది.

## లంచంతో బెయిల్ తెచ్చుకున్నారు

ఎంపి అసదుద్దీన్ ఒవైసి సంచలన వ్యాఖ్యలు

**ప్రజాపక్షం/సైదాబాద్:** వైద్య కారణాలతో 83 ఏళ్ల వయస్సులో ఉన్న నిందితుడి నడవలేని పరిస్థితిని పరిగణలోకి తీసుకుని నాంపల్లి క్రిమినల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే ఈ విషయాన్ని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ తీవ్రంగా పరిగణిస్తూ కామెంట్లు చేయడం చర్చనీయాంశంగా మారింది. చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌కు రూ.2 కోట్లు లంచం ఇచ్చి న్యాయవాది ఖాజా మొయినుద్దీన్‌ను హత్య చేసిన రౌడీ షీటర్ బెయిల్ తెచ్చుకున్నాడంటూ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలు విమర్శలకు తావిస్తున్నది. అడ్వకేట్ హత్య కేసులో ఇటీవల విడుదలైన రౌడీషీటర్‌కు జైలు సూపరింటెండెంట్ సహకరిస్తున్నాడని ఆరోపించారు.రౌడీషీటర్ దాడులకు కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. అమాయకులపై హత్యలకు పాల్పడే వారిని బహిష్కరించాలని అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు.

## 6న అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్రస్థాయి సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్రస్థాయి సమావేశం ఈ నెల 6వ తేదీన ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలోని రాజ బహదూర్ గౌర్ హాల్‌లో నిర్వహించనున్నట్లు సంఘం ఉపాధ్యక్షురాలు గుడిమెట్ల రజిత, ప్రధాన కార్యదర్శి జి.వి.రావు తెలిపారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి తిరుపతిరావు, తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం అధ్యక్షురాలు పశ్య పద్మ హాజరవుతారని పేర్కొన్నారు. అగ్రిగోల్ బాధితుల సమస్యల పరిష్కారం కోసం 12 ఏళ్లుగా సాగుతున్న పోరాటం, ఏపీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మంత్రుల ఉపసంఘం ఏర్పాటుకు చేసిన అంశాన్ని ఈ సమావేశంలో చర్చించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చే కార్యచరణను రూపొందించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ సమావేశానికి డిపాజిట్‌దారులు, ఏజెంట్లు, అగ్రిగోల్ సంస్థ వద్ద స్థలాలు కొనుగోలు చేసిన బాధితులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు

## కామన్వెల్త్ లీడర్‌షిప్ అవార్డు



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** రిపబ్లిక్ ఆఫ్ కజకిస్తాన్ గౌరవ కాన్సుల్, ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్‌కు అరుదైన గౌరవం దక్కింది. లండన్‌లోని చారిత్రాత్మక మార్లబరో హౌస్‌లో జరిగిన గ్లోబల్ సమ్మిట్ ఆన్ లాంగెవిటీ అండ్ హెల్తీ ఏజింగ్ సదస్సులో కామన్వెల్త్ మెడికల్ అసోసియేషన్ ఆయనను ప్రతిష్టాత్మక 'కామన్వెల్త్ మెడికల్ అసోసియేషన్ గ్లోబల్ లీడర్షిప్ అవార్డు'తో సన్మానించింది. దౌత్య రంగం, పర్యావరణహిత జీవనం, అంతర్జాతీయ సహకారానికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ మాట్లాడుతూ, ఈ అవార్డు ప్రదానం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## నైపుణ్యం పెంచేందుకు సెమినార్లు



**ప్రజాపక్షం/అమీర్‌పేట్:** కరాటే క్రీడను మరింత అభివృద్ధి చేయడంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రిఫరీలు, జడ్జిల నైపుణ్యాలను పెంపొందించేందుకు సెమినార్లు ఎంతో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. జపాన్ షోటోకాన్ కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బాబు రాజ్ ఆధ్వర్యంలో ఆదివారం అమీర్‌పేట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కరాటే రిఫరీ, జడ్జిల సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి కరాటే ఇండియా ఆర్గనైజేషన్ రిఫరీ కమిషన్ కౌన్సిలర్ పరమ్‌జిత్ సింగ్ ముఖ్య శిక్షకుడిగా హాజరై రిఫరీలు, జడ్జిలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ మాస్టర్లు విజయ్‌కుమార్, డీఎల్ నారాయణ, ఇబ్రహీం బేగ్, మీర్జా, మురళీధర్, ఖాజా పాషా తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల కురవాలని ఈద్గాలో ప్రార్థనలు



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ చిలకలగూడ ఈద్గా వద్ద నమాజ్‌ఎఇస్తిస్కా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిలకలగూడ జామియా మసీద్ అహ్లే సున్నత్ వల్ జమాత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సయ్యద్ ఖాజా జియావుద్దీన్ సబ్రీ, సయ్యద్ రిజ్వాన్ పాషా ఖాద్రీతో పాటు పలువురు ఉలామాలు పాల్గొన్నారు.

## సమస్యలపై టిడిపి సమరం



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** తెలుగుదేశం పార్టీని తెలంగాణ రాష్ట్ర క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలుగుదేశం ప్రజాపథం' 2వ విడత కార్యక్రమం ఆదివారం కొనసాగింది. ఈ మేరకు మాజీ కార్పోరేటర్ పి.బాలరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో కవాడిగూడ డివిజన్‌లోని వాంబే హౌజింగ్ కాలనీలో నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు కాట్రగడ్డ ప్రసూన, సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ నల్లెల్ల కిషోర్, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎంకె బోసు, కవాడిగూడ డివిజన్ నాయకులు ఎల్.రవి గౌడ్, ఎ.సత్తన్న, మగ్గి యాదగిరి, కడెం ఆనంద్, చంద్రమోహన్ గౌడ్, ఉదయ్ కుమార్ గుప్త, శంకర్ గౌడ్, బి.రాజు, భవాని శ్రీనివాస్, శక్తి ప్రేమ్, కట్ట రాములు తదితరులు పాల్గొన్నారు.

## మెడికవర్ ఆస్పత్రి ఎదుట.. సిఎంకు వ్యతిరేకంగా బ్యానర్లు

**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆస్పత్రి పరిసరాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వెలసిన భారీ బ్యానర్లు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆస్పత్రి ఎదుట ప్రధాన రహదారికి ఇరువైపులా వివాదాస్పద రీతిలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, హోర్డింగులను ఏర్పాటు చేయడంతో ఉదయం నుంచి స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఈ బ్యానర్లపై 'రేవంత్ రెడ్డిస్ సన్‌ఇన్‌లాస్' అనే శీర్షికతో పాటు, ముఖ్యమంత్రి ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న పలు చిత్రాలను ముద్రించారు. అంతేకాకుండా దిగువన 'మెడికవర్.. కంగ్రాట్యులేషన్స్ రేవంత్ గారు.. ఫర్ రూ. 13,200 క్రోర్స్' అంటూ




వ్యంగ్యంగా రాసి ఉన్న రాతలు దుమారం రేపుతున్నాయి. మెడికవర్ ఆస్పత్రి లావాదేవీలు, భారీ మొత్తంలో నిధుల మళ్లింపు వ్యవహారాలు జరిగాయంటూ ప్రతిపక్ష నేతలు ఇటీవల చేసిన ఆరోపణల నేపథ్యంలోనే ఈ తరహా ఫ్లెక్సీలు ప్రత్యక్షమైనట్లు భావిస్తున్నారు. రద్దీగా ఉండే మెయిన్ రోడ్డు వెంబడి, పెట్రోల్ బంకులు, ఆస్పత్రి ముఖద్వారం సమీపంలో వరుసపెట్టి వీటిని నిలబెట్టడంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు విస్మయానికి గురవుతున్నారు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఇంత భారీ స్థాయిలో నడిబొడ్డున ఉన్న రోడ్లపై బ్యానర్లు ఎవరు ఏర్పాటు చేశారనే కోణంలో దర్యాప్తును ముమ్మరం చేశారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ నిందితులను గుర్తించే పనిలో పడ్డారు. అధికార కాంగ్రెస్ శ్రేణులు ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తుండగా, నగరంలో ఒక్కసారిగా వెలిసిన ఈ ఫ్లెక్సీలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనానికి తెరతీశాయి.

## గురుకులాలకు స్వంత భవనాలు నిర్మించాలి

విద్యార్థుల ధర్నాలో ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలకు స్వంత భవనాలు నిర్మించాలని జాతీయ బిసి సంక్షేమ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగా వంద బిసి కాలేజీ హాస్టళ్లు, వంద బిసి గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ నిఖిల్ పటేల్, సంఘం ప్రధాన కార్యదర్శి అల్లం యాదయ్య సంయుక్త అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్ ధర్నాచౌక్ వద్ద వందలాది మంది విద్యార్థులు ధర్నా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై, మాట్లాడారు. ప్రభుత్వ భూములను వేలం వేసి, అమ్మాలని చూస్తుందని, దీనిని గట్టిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వ స్థలాలు ప్రజల ఆస్తులని, వీటిని ప్రజా అవసరాలకు, పేదల ఇండ్ల నిర్మాణానికి, ప్రభుత్వ ఆఫీసులు, హాస్టళ్లకు, స్కూళ్ల నిర్మాణానికి ఉపయోగించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ఫీజులు రూ.8500 కోట్లు చెల్లించాలని కోరారు. కాలేజీ హాస్టల్ విద్యార్థులకు బస్‌పాస్, ఇతర చిల్లర ఖర్చుల కింద బాలికలకు రూ.1000, బాలురకు రూ.800 చొప్పున నెలవారీగా అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూములు అమ్మే నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే, ప్రధాని మోదీకి ఫిర్యాదు చేస్తానని, పార్లమెంట్‌లో చర్చకు లేపుతానని కృష్ణయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో బిసి ఫ్రంట్ చైర్మన్ గొరిగె మల్లేశ్, బిసి సంఘం అధ్యక్షులు సి.రాజేందర్, భీంరాజు, చిక్కుడు బాలయ్య తదితర నేతలు పాల్గొన్నారు.

## ఉద్యమకారుడికి మద్దతు పలకాలి

అన్ని పార్టీలకు కాచం డిమాండ్

**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్:** హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి నియోజకవర్గాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో నిలబడే తెలంగాణ ఉద్యమకారుడికు మద్దతు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డా.కాచం సత్యనారాయణ అన్ని రాజకీయ పార్టీలను కోరారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం నేతలతో కలిసి పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన గోడపత్రికను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. అర్హులైన ప్రతిభ పట్టభద్రుడు తప్పనిసరిగా తమ పేరును మన మోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారులకు ఫ్యూచర్ సిటీలో వెయ్యి ఎకరాలు కేటాయించి, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. సమావేశంలో సంఘం నేతలు వీరెల్లి వెంకట రెడ్డి, కొత్త రవి, ఏలేటి వెంకట్‌చారి, కార్తీక్, పవన్, కె.వినోద్, బుద్ధ ప్రవీణ్, జాహీద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌జెజిసి విద్యార్థులకు 'మకుట డెవలపర్స్' సాయం

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** సిల్వర్ జూబ్లీ గవర్నమెంట్ కాలేజీ (ఎస్‌జెజిసి) కర్నూలు ఫ్రాటర్నిటీ వార్షికోత్సవంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ మకుట డెవలపర్స్ ప్రతిభ విద్యార్థులకు భారీ ఆర్థిక సాయం చేసింది. దీనికి ముఖ్యఅతిథిగా మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు హాజరుకాగా, ఆయన చేతుల మీదుగా ఐదుగురు ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.లక్ష చొప్పున మకుట డెవలపర్స్ వ్యవస్థాపకులు, చైర్మన్ కొంపల్లి జనార్దన్ ప్యాట్రన్‌గా అందజేశారు. ఆదివారం హైదరాబాద్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో జరిగిన ఈ వార్షికోత్సవంలో కాలేజీ పూర్వ విద్యార్థులు, ఫ్రాటర్నిటీ సభ్యులు కాలేజీ విజయాలను ఈ సందర్భంగా స్మరించుకొన్నారు. ఎం.వెంకయ్య నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ, సంస్కారంతో మెలగాలని,




అప్పుడే జీవితంలో పైకొస్తారన్నారు. ఎస్‌జెజిసిలో చదివినవారంతా గొప్ప స్థాయిలో ఉన్నారని, ఆ కాలేజీ నేర్పిన క్రమశిక్షణ కారణమన్నారు. కొంపల్లి జనార్దన్ మాట్లాడుతూ ఎస్‌జెజిసి ఫ్రాటర్నిటీతో ఆయనకున్న అనుబంధం, సమాజానికి తిరిగి అందించాలనే స్ఫూర్తిని చాటిచెప్పారు. ఎస్‌జెజిసి ఎంతో మంది విద్యార్థులను తమతమ రంగాల్లో గొప్ప విజయాలు సాధించేందుకు దోహపడిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసి బాధ్యతగా వ్యవహరించలేదు




**ప్రజాపక్షం/బేగంపేట్:** ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు.. ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో ఎన్నికల కమిషన్ బాధ్యతగా వ్యవహరించలేదని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు పద్మారావునగర్‌లోని బెల్వర్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. బిఎల్‌ఓలుగా నియమితులైన వారికి కార్యక్రమంపై సరైన అవగాహన లేదన్నారు. అనేక చోట్ల గందరగోళం నెలకొని లక్షల మంది ఓట్లు తొలగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పద్మారావునగర్ బిఆర్‌ఎస్ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్‌గౌడ్, అపార్ట్మెంట్ వాసులు జగ్గయ్య, రాజశేఖర్, ముకుంద్, సత్యనారాయణ, ఆనంద్, ప్రసాద్, పవన్, బాల్ రెడ్డి, డాక్టర్ ఇందిర, బిఆర్‌ఎస్ పార్టీ బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు ఏసూరి మహేష్, వెంకటరమణ, శ్రీకాంత్‌రెడ్డి, మిట్టపల్లి బాబూరావు, కొత్తూరు వెంకట్, ఎంఎన్ శ్రీనివాస్, కృష్ణ ముదిరాజ్, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 'బిఆర్‌ఎస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ' అభ్యర్థిగా అవకాశం కల్పించండి

హరీశ్‌రావుకు బచ్చు శ్రీనివాస్ దరఖాస్తు..



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహబూబ్‌నగర్ రంగారెడ్డి హైదరాబాద్ పట్టభద్రుల (గ్రాడ్యుయేట్స్) బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని బిఆర్‌ఎస్ నాయకుడు బచ్చుశ్రీనివాస్ కోరారు. తెలంగాణ ఉద్యమం నుంచి ఇప్పటి వరకు వివిధ హోదాలలో పని చేశానని, మూడు జిల్లాలల్లోతనకు మంచి పట్టు, విస్తృత పరిచయాలు ఉన్నాయన్నారు. ఈ మేరకు ఆయన బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నేత తన్నీరు హరీశ్ రావును ఆదివారం కలిసి దరఖాస్తు చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా,తెలంగాణ జాగృతి తొలి రాష్ట్ర కార్యదర్శిగా క్రియాశీలక పాత్ర పోషించానని, బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివిధ చర్చా వేదికల ద్వారా తెలియజేసినట్టు వివరించారు. బిఆర్‌ఎస్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పిస్తే పట్టభద్రులందరినీ సమన్వయం చేసుకుంటూ , వారి గొంతుకగా నిలుస్తానని బచ్చు శ్రీనివాస్ తెలిపారు.

## రాజకీయ వివక్ష లేకుండా అన్ని ప్రాంతాల అభివృద్ధి

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి

**ప్రజాపక్షం/ఉప్పల్ :** రాజకీయ వివక్ష లేకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. నాచారం, హెచ్ఎంటి నగర్ డివిజన్లలోని కోటి రూపాయల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన ఆదివారం ప్రారంభించారు. సాయినగర్ కాలనీలో రూ.9 లక్షలతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం, రాఘవేంద్రనగర్‌లో రూ. 13 లక్షలతో మంచినీటి పైపు లైన్ నిర్మాణం, కౌండిన్యనగర్‌లో రూ.33.8 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనుల పూర్తి, రాఘవేంద్రనగర్ శివ నర్సింగ్ హోమ్ వెనుక వీధిలో రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులను స్థానిక బిఆర్‌ఎస్ నేతలు సాయిజెన్ శేఖర్, మేడల మల్లికార్జున గౌడ్‌లతో కల్సి ఆయన ప్రారంభించారు. దశలవారీగా ఈ డివిజన్లలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను పూర్తి స్థాయిలో చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎంసి నాచారం సర్కిల్ కార్యాలయ అధికారులు సాయి పృథ్వి, సూరజ్, విజయ్‌కుమార్, రామారావు, రోహిత్, సాయినగర్, రాఘవేంద్రనగర్, కౌండిన్య నగర్, భవానినగర్ సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## కార్మికులకు అండగా ఉండే యూనియన్‌ను గెలిపించుకోవాలి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ఆర్‌టిసి యూనియన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అధ్యక్షతన మేడ్చల్ ఆర్‌టిసి బస్‌డిపోలో ఐఎన్‌టియుసి,ఎస్‌డబ్ల్యు, టిఎంయు, ఎస్‌డబ్ల్యు బలపరచిన అభ్యర్థులను గెలిపించాలంటూ ప్రచారం నిర్వహించారు. ఆర్‌టిసి కార్మికులను కలుసుకొంటు కార్మికుల హక్కుల పరిరక్షణకు అండగా ఉండే యూనియన్‌ను గెలిపించుకోవాలని కోరారు. కాంగ్రెస్‌కు చెందిన జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు, నాగరాజు, మేడ్చల్ ఆర్‌టిసి డిపో గౌరవ అధ్యక్షుడు నరేందర్, రమేష్, దేవరాజ్, మహేష్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



### ఎన్నికలు జరుగనున్న 5 రాష్ట్రాలలో..

# డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ల పర్యటన




**న్యూఢిల్లీ :** క్షేత్ర స్థాయిలో ఎన్నికల సన్నాహాలను పర్యవేక్షించేందుకు డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ల నేతృత్వంలోని సీనియర్ ఎలక్షన్ కమిషన్ అధికారులు ఈ వారం నుంచి ఎన్నికలు జరుగనున్న 5 రాష్ట్రాలలో పర్యటించనున్నారు.ఈ వారం ఎన్నికల సంఘం (ఇసి) బృందాలు గోవాను సందర్శిస్తాయని, ఆ తర్వాత వచ్చేవారం ఉత్తరాఖండ్‌ను సందర్శిస్తాయని అధికారులు తెలిపారు.రాబోయే వారాల్లో ఇసి అధికారులు పంజాబ్‌ను, ఆ తర్వాత మణిపూర్‌ను కూడా సందర్శిస్తారు. అధికారులు ఉత్తరప్రదేశ్‌ను ఎప్పుడు స్సందర్శిస్తారనే దానిపై ఎలాంటి సమాచారం లేదని ఉత్తరప్రదేశ్ ఇసి అధికారులు చెప్పారు. సాధారణంగా, ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్లతో కూడిన 'పూర్తి కమిషన్' ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలను సందర్శిస్తుంది. 403మంది సభ్యులున్న ఉత్తరప్రదేశ్ శాసనసభ పదవీకాలం వచ్చే ఏడాది మే 22న ముగియనుండగా, 60మంది సభ్యులున్న మణిపూర్, 40మంది సభ్యులున్న గోవా, 117మంది సభ్యులున్న పంజాబ్, 70మంది సభ్యులున్న ఉత్తరాఖండ్ శాసనసభల పదవీకాలం 2027మార్చిలో వేర్వేరు తేదీలలో ముగుస్తుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం , 1950లోని నిబంధనలు, 'పదవీకాలం ముగియడానికి ఆరునెలల కంటే ముందే' ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘాని(ఇసి)కి అనుమతినిస్తాయి. ఎన్నికల సన్నాహాల్లో భాగంగా,ఉత్తరప్రదేశ్, గోవా రాష్ట్రాలు, పోలింగ్‌లో ఉపయోగించనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, పేపర్ ట్రయల్ యూనిట్లపై మొదటి స్థాయి తనిఖీలను (ఎఫ్ఎల్‌సిలు) ప్రారంభించాయి.ఎఫ్ఎల్‌సిల సమయంలో, ఈ రెండు పరికరాలను తయారుచేసే రెండు ప్రభుత్వరంగ సంస్థలైన బిఇఎల్, ఇసిఐఎల్‌కు చెందిన ఇంజినీర్లు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలుపేపర్ ట్రయల్ యంత్రాలలోని యాంత్రిక లోపాలను తనిఖీ చేస్తారు. లోపాలున్న యాంత్రాలను మరమ్మతు లేదా భర్తీ కోసం తయారీదారులకు తిరిగి పంపుతారు.రాజకీయ పార్టీల సమక్షంలో ఆ రెండు యంత్రాలను తనిఖీ చేయడానికి ఒక నమూనా పోల్ కూడా నిర్వహిస్తారు. ఎన్నికల సన్నాహాలలో ఎఫ్ఎల్‌సిలు కూడా ఒక ముఖ్యమైన భాగం. ఎన్నికల సంఘం ఒక క్యాలెండర్‌ను జారీ చేస్తుంది. దానిని రాష్ట్రాలు తప్పనిసరిగా పాటించాలి. ఈ తనిఖీలు ఆ షెడ్యూల్‌లో భాగమే. ఎఫ్ఎల్‌సి సమయంలో కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లలో మిగిలి ఉన్న గత ఎన్నికల డేటాఏదైనా పూర్తిగా తొలగించబడుతుంది. ఒక యూనిట్ అన్ని నిర్ధారణ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత, ఎన్నికల సన్నాహాల తదుపరి దశలకు ముందు అనధికారిక ప్రవేశాన్ని నిరోధించడానికి దానిపై 'ఎఫ్ఎల్‌సి ఓకే' అని గుర్తించి, ప్రత్యేకమైన గులాబీ రంగు కాగితపు ముద్రతో సీల్ చేస్తారు. కనీసం ఒక బ్యాలెట్ యూనిట్, ఒక కంట్రోల్ యూనిట్, ఒక పేపర్ ట్రయల్ మెషీన్‌తో ఒక ఇవిఎం ఏర్పడుతుంది.

### 'ధారాపురం' టివికె అభ్యర్థికి మద్దతుగా...

# సిఎం విజయ్ 'రోడ్ షో'

### మహిళలపై అవమానకర వ్యాఖ్యలు చేసిన డిఎంకెపై విమర్శనాస్త్రాలు



**ధారాపురం(తమిళనాడు):** ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ఉప-ఎన్నికల ప్రచారం నేపథ్యంలో డిఎంకెపై విమర్శనాస్త్రాలు సంధించారు. తమ పార్టీ అభ్యర్థి పి.సత్యభామకు మద్దతుగా టివికె అధ్యక్షుడు సి.జోసెఫ్ విజయ్ ఆదివారం ధారాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో రోడ్‌షో చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలపై వ్యాఖ్యలు చేసినందుకు డిఎంకెను విజయ్ తీవ్రంగా విమర్శించారు. మహిళలపై విమర్శల దాడులు చేయడం హద్దులు దాటిందని, ఇక తాను మౌనంగా ఉండబోనని హెచ్చరించారు. విజయ్ ప్రత్యేక విమానంలో కొయంబత్తూర్‌లో దిగి ధారాపురం వెళ్లారు. ఈ రిజర్వ్‌డ్ అసెంబ్లీ నియోజకవర్గం అల్లిక పరిశ్రమ కేంద్రమైన తిరుప్పూర్ జిల్లా పరిధిలోకి వస్తుంది.ధారాపురంలో టివికె ప్రధాన కార్యదర్శి గ్రామీణాభివృద్ధి, జలవనరుల శాఖ మంత్రి ఎన్.ఆనంద్, రెవెన్యూ, విపత్తుల శాఖ మంత్రి కెఎ. సెంగొట్టయ్యన్ తో సహా ఆయన సీనియర్ కేబినెట్ మంత్రులు ఆయనకు స్వాగతం పలికారు. ధారాపురంలో విజయ్, మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో తాను ప్రత్యేకంగా రూపొందించిన కాన్వాయ్‌పై రోడ్ షోను ప్రారంభించారు. అక్టోబరు 6న జరుగనున్న ఉప ఎన్నికల ప్రచారం ఆదివారం సాయంత్రం 6గంటలకు ముగిసేలోపు ఆయన 40కిలోమీటర్ల మేర పర్యటించనున్నారు. రోడ్ షో సందర్భంగా తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ఓటర్లతో కూడా ముచ్చటించారు. ఆయన కొద్దిసేపు ఎద్దులబండిపై ప్రయాణించారు. రోడ్ షో సందర్భంగా సిఎం విజయ్‌కు పలు బహుమతులు, పువ్వులు, పూలదండలు, పార్టీ టవల్స్ కూడా అందాయి. మార్గమధ్యంలో, ఆయన మూలనూర్ వంజీయమ్మన్ ఆలయంలో ప్రార్థనలు సమర్పించారు. అక్కడ ఆయనకు సాంప్రదాయ ఆలయ లాంఛనాలతో సత్కరించారు. ఒక ప్రదేశంలో,ఆయన రోడ్డుకు ఇరువైపులా బారులు తీరిన ప్రజలకు, టివికె మద్దతుదారులకు అభివాదం చేస్తూ కొంతదూరం నడిచి, ఓట్లు అభ్యర్థించారు. అనేకచోట్ల ప్రజలు ఆయనపై పూలరేకులను కురిపించారు. ప్రణాళికా బద్ధమైన ప్రచార మార్గం ధారాపురం ప్రాంతంలో 40 కి.మీ.మేర 20కి పైగా ప్రజా సంప్రదింపు కేంద్రాలను కవర్ చేస్తుందని అంచనా. మధురాంతకం, ధారాపురం అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి అప్పటి ఏఐడిఎంకె ఎమ్మెల్యేలు అయిన కె.మరకతం కుమారవేల్, పి.సత్యభామలు ఆ పార్టీకి రాజీనామా చేసి, శాసనసభ్యులుగా టివికెలో చేరారు. వారి రాజీనామా కారణంగా ఉప ఎన్నిక అనివార్యమైంది. విజయ్ వారిద్దరినీ ఆయా స్థానాల నుంచి నామినేట్ చేశారు.

### 7న ఢిల్లీ ఇసి ఆఫీస్ ఎదుట

# ఇండియా కూటమి నిరసన

**న్యూఢిల్లీ :** 'సర్'కు వ్యతిరేకంగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, ఇండియా కూటమి పార్టీల ఢిల్లీ విభాగాలు బుధవారం ఢిల్లీ ఎన్నికల కమిషన్ కార్యాలయం వెలుపల సంయుక్త నిరసన చేపట్టనున్నాయి. కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ), కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్), రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి), రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్‌ఎస్‌పి) తదితర పార్టీల ప్రతినిధులు ఆదివారం సమావేశమయ్యాయి. అనంతరం ఢిల్లీ కాంగ్రెస్ ఒక ప్రకటనను విడుదల చేసింది. తాము లోపభూయిష్టమైనదిగా అభివర్ణిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను సంయుక్తంగా వ్యతిరేకించాలని, దానిని తక్షణమే రద్దు చేయాలని కోరాలని పార్టీలు నిర్ణయించినట్లు ఢిల్లీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అనిల్ భరద్వాజ్ తెలిపారు. 'ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి పునాది. ఓటర్ల పేర్లను తొలగించే లేదా వారి హక్కులను ప్రభావితం చేసే ఏదైనా ప్రక్రియను అవలంబిస్తే, ఇండియా కూటమి దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదు' అని భరద్వాజ్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, రాజ్యాంగ నిబంధనలకు, ఓటర్ల హక్కులకు అనుగుణంగా నిర్వహించాలని కూడా పార్టీలు డిమాండ్ చేశాయి. 'ఢిల్లీ ఓటర్ల హక్కులు, నిష్పక్షపాత ఎన్నికలు, ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించేందుకు' అక్టోబర్ 7న జరగనున్న నిరసన ఒక ఉమ్మడి ప్రయత్నమని భరద్వాజ్ అన్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ నాయకులతో పాటు, సిపిఐ కార్యదర్శి దినేష్ సి వర్ష్నీ, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి అనురాగ్ సక్సేనా, ఆర్‌జెడికి చెందిన నవల్ కిషోర్, ఎన్‌సిపి, ఆర్ఎస్‌పి ప్రతినిధులు హాజరయ్యారు.

# సిఇసి జ్ఞానేశ్ కుమార్‌పై విజిలెన్స్ విచారణకు కేరళం హోంమంత్రి ఆదేశాలు

### 2006లో కెఎస్‌టిపి ప్రాజెక్ట్‌లో జ్ఞానేశ్ అవినీతి ఆరోపణలు తెరపైకి




**తిరువనంతపురం :** కేరళం హోంమంత్రి రమేష్ చెన్నితాల, కెఎస్‌టిపి రోడ్డు పనుల ప్రాజెక్ట్‌లో జరిగిన అవినీతి ఆరోపణలు, 2006లో దానికి సంబంధించిన ఒక మలేషియన్ ఇంజినీర్ మరణంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు ఆదివారం సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆ సమయంలో, ప్రస్తుత సిఇసి జ్ఞానేష్‌కుమార్ రాష్ట్రంలో పిడబ్ల్యుడి కార్యదర్శిగా పనిచేస్తున్నారని ఆ వర్గాలు తెలిపాయి. భారతదేశ వ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కు వ్యతిరేకంగా జ్ఞానేష్ కుమార్‌పై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు నిరసనలు చేస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. జ్ఞానేష్ కుమార్ కేరళ కేడర్‌కు చెందిన ఐఎఎస్ అధికారి. ఈయన కేంద్ర మంత్రిత్వ శాఖలకు వెళ్లడానికి ముందు రాష్ట్రంలోని పలు శాఖలకు అధిపతిగా పనిచేశారు. శనివారం జ్ఞానేష్‌కుమార్‌పై విచారణ జరపాలని కోరుతూ కెపిసిసి నాయకుడు మళయింకీళు వేణుగోపాల్ ఫిర్యాదు చేసిన తర్వాత, కేరళం హోం మంత్రి రమేష్ చెన్నితాల విచారణకు ఆదేశించారు. చెన్నితాల విలేకరులతో మాట్లాడుతూ తాను ఫిర్యాదును పరిశీలించానని, ఆరోపణలలో ప్రాథమికంగా నిజం ఉందని తెలిపారు. 'వివరణాత్మక విజిలెన్స్ విచారణ తప్పనిసరి' అని తాను దృఢంగా నమ్ముతున్నానని ఆయన అన్నారు. సమగ్ర దర్యాప్తు జరిపేందుకు చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ డైరెక్టర్ మనోజ్ అబ్రహంను ఆదేశించే ముందు తాను ముఖ్యమంత్రి విడి.సతీషన్‌తో మాట్లాడినట్లు రమేష్ చెన్నితాల చెప్పారు. 2006లో అంగమాలి నుంచి తిరువనంతపురం వరకు ఉన్న ఎంసి రోడ్ పునర్నిర్మాణం కోసం, ప్రపంచ బ్యాంక్ నిధులతో రూ.215 కోట్లు విలువైన ప్రాజెక్ట్‌ను కేరళ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్ట్ (కెఎస్‌టిపి) చేపట్టింది. మలేషియా సంస్థ, భగీరథ ఇంజనీరింగ్ సంయుక్త సంస్థ అయిన పాటి-బెల్ ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టిందని హోం మంత్రి రమేష్ చెన్నితాల చెప్పారు.ఒక మలేషియన్ కంపెనీ ఈ పనిని చేపట్టగా, దాని ప్రాజెక్ట్ ఇంజినీర్ అయిన లీ సీ బీన్, నిర్మాణ సమయంలో అనేక ఫిర్యాదులు చేసి, ఆ తర్వాత మలేషియాకు తిరిగి వెళ్లి అక్కడ ఆత్మహత్య చేసుకుని మరణించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంజినీర్ భార్యకు ఒకటి, జ్ఞానేశ్ కుమార్ పేరు స్పష్టంగా పేర్కొనబడిన కంపెనీ ఈడైరెక్టర్‌కు మరొకటి చొప్పున రెండు ఆత్మహత్య లేఖలు లభించాయని చెన్నితాల తెలియజేశారు. ఈ సంఘటన జరిగిన తర్వాత, కౌలాలంపూర్‌లో రాసిన నోట్‌లోని విషయాలతో సహా విజిలెన్స్ ఈ విషయాన్ని పరిశీలించిందని, అయితే, 2006లో ప్రభుత్వం మారిన తర్వాత దర్యాప్తు ముందుకు సాగలేదని మంత్రి చెప్పారు. 'ఇది అణిచిపెట్టబడిన కేసు. అప్పట్లో అచ్చుతానందన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కేసు ముందుకు సాగలేదు' అని ఆయన ఆరోపించారు. ఆరోపణలకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానమిస్తూ , బిల్లులు చెల్లించడానికి డబ్బులు డిమాండ్ చేయడం, చెల్లింపులలో జాప్యం చేయడం వంటివి దీనితో ముడిపడి ఉన్నాయని హోం మంత్రి రమేష్ చెన్నితాల వివరించారు. 'నేను స్వయంగా ఆత్మహత్య లేఖ చూడలేదు. ఇది మీడియా ద్వారా ప్రచారమైన సమాచారం' అని ఆయన స్పష్టంచేశారు. ఫిర్యాదులోని అన్ని అంశాలపై దర్యాప్తు జరిపి, దాని ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలని విజిలెన్స్‌ను ఆదేశించినట్లు మంత్రి చెప్పారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్ పదవి దర్యాప్తునకు ఏమైనా ఆటంకం ఏమైనా చట్టపరమైన ఆటంకం కలిగిస్తుందా? అని అడగ్గా, అన్ని చట్టపరమైన అంశాలను పరిశీలించామని, ఎటువంటి అడ్డంకి లేదని చెన్నితాల స్పష్టం చేశారు. 'ఈ దర్యాప్తు ఆయన 2006లో కేరళ పిడబ్ల్యుడి కార్యదర్శిగా పనిచేసిన కాలం నాటి సంఘటనకు సంబంధించినది. అందువల్ల, ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవికి ఉండే రక్షణ ఆయనకు లభించదు అని ఆయన న్యాయ సలహాను ఉటంకిస్తూ అన్నారు. తీవ్రమైన అవినీతి కేసు విచారణ బాహ్య ప్రభావం వల్ల దెబ్బతిందని పిటిషనర్ ఆరోపిస్తున్నారు. ఇది చాలా తీవ్రమైన విషయం.దీనిని క్షుణ్ణంగా పరిశీలించి, న్యాయ ప్రయోజనాల దృష్ట్యా చట్టప్రకారం తక్షణ చర్యలు చేపట్టండి' అని విజిలెన్స్ డైరెక్టర్‌కు జారీ చేసిన తన ఆదేశంలో చెన్నితాల పేర్కొన్నారు.

# 'అధికార అహంకారం ఆత్మహత్యాసదృశం'

### రామాలయ విరాళాల చోరీ దర్యాప్తులో జాప్యంపై మోదీపై కాంగ్రెస్ మండిపాటు



**న్యూఢిల్లీ :** రామమందిర విరాళాల చోరీపై జరుగుతున్న దర్యాప్తులో రామమందిర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ వంటి వారిని కాపాడుతున్నారని కాంగ్రెస్ ఆదివారం ఆరోపించింది. ఈ విషయంపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహించడంపై విమర్శలు గుప్పిస్తూ, 'అధికార అహంకారం ఆత్మహత్యాసదృశం' అని పేర్కొంది. జూన్ 4న చోరీకి సంబంధించిన వీడియో చంపత్ రాయ్ దృష్టికి వచ్చినప్పటికీ, ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో 21 రోజుల జాప్యం ఎందుకు జరిగిందని కూడా ప్రతిపక్ష పార్టీ ప్రశ్నించింది. ఈ దర్యాప్తు కేవలం చిన్న దొంగలను పట్టుకోవడం కోసమేనా, లేక ఎవరి పర్యవేక్షణలో, అండదండలతో ఈ సంఘటనలు జరిగాయో వారి బాధ్యతను కూడా నిర్ధారించడం కోసమా అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ప్రశ్నించారు. 'చందా చోరీ – ఆస్థా ధోఖా' (విరాళాల చోరీ విశ్వాసానికి ద్రోహం): శ్రీరాముని అయోధ్య మందిరానికి ఉద్దేశించిన విరాళాలను దొంగిలించిన వారి పట్ల మోదీ ప్రభుత్వం ఎందుకు అంత ఉదారంగా వ్యవహరిస్తోంది?' అని రమేశ్ ఆదివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'మోదీ జీ, ప్రతిపక్ష నాయకులపై ఇడి, సిబిఐ వంటి సంస్థలను దుర్వినియోగం చేయడానికి ప్రభుత్వం ఏమాత్రం వెనుకాడదు; అయినప్పటికీ, అయోధ్య రామమందిరంలో 105 విరాళాల చోరీ ఘటనలు సీసీటీవీ ఫుటేజీలో వెల్లడైన తర్వాత, ఆలయ నిర్వహణ బాధ్యత వహిస్తూనే దొంగలను కాపాడారనే అనుమానం ఉన్నవారి వరకు దర్యాప్తు ఎందుకు వెళ్లలేదు?' అని కాంగ్రెస్ నేత ప్రశ్నించారు. 105 చోరీ ఘటనలకు సంబంధించి కేవలం రూ. 79.85 లక్షల మొత్తాన్ని మాత్రమే రికవరీ చేసి, ఈ విషయాన్ని ఎందుకు తొక్కిపెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆయన నిలదీశారు. 'చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలను నిందితులుగా కాకుండా సాక్షులుగా ఎందుకు పరిగణిస్తున్నారు? ఎందుకిలా?' అని రమేశ్ ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం అసలైన దొంగలను పట్టుకోవాలనుకుంటుందా, లేక శక్తివంతమైన, బాధ్యతాయుతమైన వ్యక్తులను ఇరికించే ప్రశ్నలను పూడ్చిపెట్టాలని చూస్తోందా?' అని దేశం సమాధానం కోరుతోందన్నారు. రామ మందిరంలో విరాళాల దొంగతనంపై సిట్ జరుపుతున్న దర్యాప్తుపై కాంగ్రెస్ పలు ప్రశ్నలు లేవనెత్తింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరిగే నిష్పక్షపాత, పారదర్శక విచారణ మాత్రమే నిజాన్ని బయటపెట్టగలదని పేర్కొంది.

### సీట్ -షేరింగ్ కంటే...

# 'కూటమి విజయమే' ముఖ్యం

### సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్‌యాదవ్



**లక్నో :** ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్‌తో సీట్ల పంపకంపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో, వ్యక్తిగత పార్టీలకు కేటాయించిన సీట్లకంటే ప్రతిపక్ష కూటమి విజయమే ముఖ్యమని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఆదివారం అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను పరిరక్షించడానికి ఐక్య కృషి అవసరమని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్‌యాదవ్ ఉద్ఘాటించారు. ఆయన తన 'ఎక్స్' పోస్ట్‌లో ఇలా అన్నారు. 'లక్ష్యం స్పష్టంగా ఉన్నప్పుడు, చేదోడు వాదోడుగా సహకరించుకుంటారు. గమ్యం కళ్ల ముందు ఉన్నప్పుడు ప్రయాణం సులభతరం అవుతుంది. ప్రతీ కూటమి భాగస్వామ్యానికి ఎన్ని సీట్లు వచ్చాయి. లేదా ఏ సీటు ఎవరికి దక్కింది అన్నది ముఖ్యం కాదని,కూటమి విజయం సాధించడమే ముఖ్యమని ఆయన అన్నారు. మరోసారి పునరావృతం చేస్తున్నాను ఇది సీట్ల గురించి కాదు. విజయం గురించే' అని అఖిలేష్ యాదవ్ నొక్కిచెప్పారు. ఇలాంటి విజయం కేవలం కూటమిలోని భాగస్వాములకే పరిమితం కాదని, మతతత్వం మళ్లీ తలెత్తకుండా నిరోధించే సామూహిక కృషికి ఇది ప్రతీక అని యాదవ్ అన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, రిజర్వేషన్ల విషయంలో 'బిజెపి హీట్' లేకుండా చూడటం, దేశానికి సామరస్యం, అభివృద్ధి, శ్రేయస్సు తిరిగి తీసుకురావడం కూడా ఉమ్మడి పోరాట లక్ష్యమని ఆయన చెప్పారు.ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికలు 2027లో జరుగనున్నాయి. 2024లోక్‌సభ ఎన్నికలలో సమాజ్‌వాదీ పార్టీ ఉత్తరప్రదేశ్‌లో 37 స్థానాలను గెలుచుకుంది. ఇందులో, అయోధ్య పుణ్యక్షేత్రం అంతర్భాగంగా ఉన్న ప్రతిష్ఠాత్మక ఫైజాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం కూడా ఉంది.కాగా, దానిమిత్రపక్షమైన కాంగ్రెస్ ఆరు స్థానాలను కైవసం చేసుకుంది. బిజెపి స్థానాల సంఖ్య 33కి, ఎన్‌డిఎ స్థానాల సంఖ్య 36కి పరిమితమైంది. ప్రస్తుతం 403మంది సభ్యులున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీకి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండగా, సమాజ్‌వాదీ పార్టీకి 101 మందిఎమ్మెల్యేలు ఉన్నారు.

# ప్రజల్లో ధైర్యం పెరుగుతోంది... మార్పు తథ్యం

### 'సర్' వ్యతిరేక నిరసనలపై ఎన్‌సి అధినేత ఫరూక్ అబ్దుల్లా



**శ్రీనగర్ :** 'సర్' ప్రక్రియపై ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ పట్ల నిరసనలు వ్యక్తమవుతున్న తరుణంలో, ఓటర్ల జాబితా నుండి పేర్లను తొలగించారన్న ఆరోపణలపై నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా తీవ్రంగా మండిపడ్డారు. అయితే, ప్రజలు ధైర్యాన్ని ప్రదర్శించడం మొదలుపెట్టారని, దీనిని బట్టి మార్పు రాబోతోందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం శ్రీనగర్‌లో జరిగిన ఐదవ 'హల్లా బోల్' సమావేశంలోజమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి అబ్దుల్లా ప్రసంగిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను విమర్శించారు. భారతీయ పౌరుడిని ఓటర్ల జాబితా నుండి తొలగించే హక్కు ఎవరికీ లేదని ఆయన స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా నుండి ప్రజల పేర్లను ఎలా తొలగించారో అందరికీ తెలు అని అన్నారు. భారత రాజ్యాంగం ఒక భారతీయ పౌరుడిగా మీకు ఓటు వేసే హక్కును కల్పించినప్పుడు, జాబితా నుండి ఎవరినైనా తొలగించే హక్కు ఎవరికీ ఉండదు అని ఆయన అన్నారు. అయినప్పటికీ తొలగించారని మండిపడ్డారు. ముస్లింలను ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకుని జాబితా నుండి తొలగించారని, కపిల్ సిబాల్ వంటి ప్రముఖ న్యాయవాది పేరును కూడా జాబితా నుండి తొలగించారంటే పరిస్థితి ఏ మేరకు ఉందో అర్థమవుతోందన్నారు. బిజెపి లక్ష్యం ఒక్కటేనని, తామే శాశ్వతంగా అధికారంలో ఉండాలని చూస్తోందని, అలా ఉండాలంటే తమ మాట వినేవారు కావాలని కోరుకుంటోందన్నారు. దేశంలో మార్పు గాలి వీయడం మొదలైందని, భారతదేశ స్ఫూర్తి ఇంకా సజీవంగానే ఉందని అబ్దుల్లా అన్నారు. ఉత్తరం నుండి దక్షిణం వరకు, తూర్పు నుండి పడమర వరకు ఈ దేశాన్ని నిర్మించింది ప్రజలేనని, భారతదేశాన్ని గొప్పగా తీర్చిద్దేది కూడా ఆ ప్రజలేనని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు అన్నారు. సర్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలను ప్రస్తావిస్తూ 'ధైర్యంగా నిలబడి వారిని ప్రశ్నించిన ఆ యువతిని చూడండి! నీ పేరు ఎక్కడ ఉంది? నీ పత్రాలు ఎక్కడ ఉన్నాయి? అని అడిగిన పోలీసు అధికారిని ఎదుర్కొన్న ఆ అమ్మాయిని చూడండి! ముందు మీ బ్యాడ్జ్ చూపించండి, అప్పుడే మీరు ఎవరో మాకు తెలుస్తుంది! అని ఆమె బదులిచ్చింది అని ఐసా జాతీయ అధ్యక్షురాలు నేహా బోరాను ఉద్దేశించి మాజీ ముఖ్యమంత్రి అన్నారు. అయితే, నెహ్రూ హయాంలో ఎన్నికల కమిషన్‌ను పూర్తిగా స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థగా మార్చకపోవడమే అతిపెద్ద పొరపాటు అని అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు.

# ఎఎంయులో ఉద్రిక్తత

### నాలుగు ప్రవేశ ద్వారాలను దిగ్బంధించిన వర్సిటీ విద్యార్థులు



**అలీగఢ్ :** ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయంలో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించాలని ఆందోళన చేస్తున్న విద్యార్థులు క్యాంపస్‌లోని నాలుగు ప్రవేశ ద్వారాలను దిగ్బంధించినట్లు అధికారులు తెలిపారు. ఎంఎల్ హాల్‌లోని ఒక హాస్టల్ నుండి పోలీసులు నలుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారన్న వార్తల నేపథ్యంలో, శనివారం సాయంత్రం నిరసనకారులు ప్రాక్టర్ కార్యాలయంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. 'బయటి శక్తుల'పై చర్య తీసుకోవడానికి హాస్టల్‌పై పోలీసులు దాడి చేసిన తర్వాత ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారని, ఈ దాడిలో విశ్వవిద్యాలయానికి ఎలాంటి పాత్ర లేదని ప్రాక్టర్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం దిగ్బంధించిన గేట్లను ఆదివారం తెల్లవారుజామున విశ్వవిద్యాలయ భద్రతా సిబ్బంది తిరిగి తెరిచారని వారు తెలిపారు. సస్పెండ్ అయిన పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థి యాసిర్ ఫహద్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష కూడా ఇందులో భాగంగా ఉంది. ఈ నిరసన సెప్టెంబర్ 21న ప్రారంభమైంది. దాదాపు ఎనిమిదేళ్లుగా జరగని విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. కొందరు బయటి వ్యక్తులు హాస్టల్‌లో ఉంటున్నారన్న సమాచారం ఆధారంగా పోలీసులు దాడి చేశారని ఎఎంయు ప్రాక్టర్ నవేద్ ఖాన్ తెలిపారు. 'వారిలో ముగ్గురు నిజమైన విద్యార్థులు కాగా, నాల్గవ వ్యక్తి బయటివాడు, అతని ధృవపత్రాలు సందేహాస్పదంగా ఉన్నాయి, అతను గతంలో ఒక కేసులో నిందితుడిగా ఉన్నాడు' అని ఖాన్ అన్నారు. ఆ ముగ్గురు విద్యార్థులను విడుదల చేయగా, నాల్గవ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, ఆ తర్వాత జైలుకు పంపినట్లు ఆయన తెలిపారు. జరుగుతున్న నిరసనను భగ్నం చేయడానికి విద్యార్థులను నిర్బంధించాలని విశ్వవిద్యాలయ అధికారులు పోలీసులను కోరారన్న ఆరోపణలను ఖాన్ తోసిపుచ్చారు, ఆ వాదనను పూర్తిగా అబద్ధం అని పేర్కొన్నారు. క్యాంపస్‌లో పరిస్థితిని అవకాశంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్న కొందరు నేరస్తులు ఉన్నారనే సమాచారం ఆధారంగానే పోలీసులు చర్యలు తీసుకున్నారని ఆయన అన్నారు. ఏడేళ్లకు పైగా నిష్క్రియంగా ఉన్న విద్యార్థి సంఘాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ గత 12 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థి యాసిర్ ఫహద్ ఆరోగ్యంపై ఆందోళనలు వ్యక్తమవడంతో ఉద్రిక్తతలు కూడా పెరిగాయి. ఆదివారం నాడు భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్, విద్యార్థి సంఘ ఎన్నికలు జరపాలన్న విద్యార్థుల డిమాండ్‌కు మద్దతు తెలిపారు. నిరసనకారులతో తక్షణమే చర్చలు ప్రారంభించాలని విశ్వవిద్యాలయ అధికారులను కోరారు. యూనివర్సిటీ కోర్టు, కార్యనిర్వాహక మండలి, అప్రతినిధుల ఎన్నికలు ఎప్పుడో జరగాల్సి ఉందని, వాటిని తక్షణమే నిర్వహించాలని కోరుతూ ఎఎంయు ఉపాధ్యాయుల సంఘం (ఎఎంయుటిఎ) కార్యదర్శి అష్రఫ్ మతీన్, వైస్ ఛాన్సలర్ నైమా ఖతూన్‌కు లేఖ రాశారు.

# సీలింగ్ ఫ్యాన్స్ తొలగిస్తే.. విద్యార్థుల ఆత్మహత్యలు తగ్గుతాయా?

- విదేశాల్లో ఎప్పుడో ఈ చర్యలు తీసుకున్నారు
- విద్యాలయం హాస్టళ్లలో భద్రతపై చర్చ




**న్యూఢిల్లీ:**మనదేశంలో విద్యార్థుల ఆత్మహత్యలు నివారించడానికి యూనివర్సిటీలు, ఇతర విద్యాలయాలు,విద్యాసంస్థల హాస్టళ్ళు,ఇతర చోట్ల ఉన్న సీలింగ్ ఫ్యాన్స్ తొలగిస్తున్నారు. గోడకు బిగించే ఫ్యాన్లు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఈ విధమైన తాత్కాలిక చర్చలవల్ల ఎలాంటి ప్రయోజనం ఉందని విమర్శలు వస్తున్నాయి.గతనెల 18వ తేదీన ఐఐటి బొంబాయి క్యాంపస్‌లోని హాస్టల్ గదిలో ఒక విద్యార్థి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గత ఆగస్టులో ఢిల్లీ ఐఐటిలో కూడా విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు. విద్యార్థులు ఆగ్రహంతో ఊగిపోయారు. దీంతో ఈ ఆత్మహత్యలపై మళ్ళీ చర్చ మొదలైంది.అంతకుముందు మూడేళ్ళక్రితం కోటాలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న 25 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడినప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం చెలరేగింది. విద్యార్థులలో ఈ విధమైన ఆలోచనలు అరికట్టేందుకు విదేశీ నమూనాలను కూడా ఆదర్శంగా తీసుకుంటున్నారు.కానీ విదేశీ విశ్వవిద్యాలయాలు, కాలేజీలు ఈ విధమైన చర్యలు, నివారణ పద్ధతులను ఏనాడో అమలులోకి తీసుకువచ్చాయి. హ్యూస్టన్ విశ్వవిద్యాలయం, కార్నెల్ విశ్వవిద్యాలయం, న్యూయార్క్ విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ కాలేజ్ లండన్,బ్రూనెల్ యూనివర్సిటీ ఆఫ్ లండన్, జాన్ హాప్కిన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ఆక్స్‌ఫర్డ్‌లోని వాధమ్ కాలేజీలో సీలింగ్ ఫ్యాన్లు తొలగించారు. ఈ విద్యాలయాలు, యూనివర్సిటీల ప్రాంగణాలలో ఉన్న బాల్కనీల నుండి విద్యార్థులు దూకి ఆత్మహత్యలు చేసుకోకుండా వలలు ఏర్పాటు చేశారు. ఎత్తైన పర్వత ప్రాంతాలమధ్య,ప్రకృతి ప్రదేశాలలో ఉన్న యూనివర్సిటీలు విద్యార్థులు కొండలు ఎక్కకుండా,పై అంతస్తులు ఎక్కకుండా,కిటికీలలోంచి దూకి చనిపోకుండా ఉండటం కోసం నిర్మాణ సమయంలోనే అనేక ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఆత్మహత్య ఘటనలు జరిగిన తర్వాత అనేక మార్పులు చేర్పులు చేశారు. మనదేశంలో కూడా ఇప్పుడు ఇలాంటి చర్యలకు సిఫార్సు చేయడంతో సీలింగ్ ఫ్యాన్స్ తొలగించడంతోపాటు కాలేజీలలో ఉన్న ప్రయోగశాలలో ప్రమాదకరమైన, విషతుల్యమైన పదార్థాలను అందుబాటులో ఉంచకుండా నిఘా వేయడం వంటి చర్యలు తీసుకుంటున్నారు.విద్యార్థులకు ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన వచ్చినప్పుడు మొదటి పది నిమిషాలలో ఆలాంటి ప్రయత్నం చేసినప్పుడు ఆటంకాలు ఎదురైతే రెండోసారి ఆత్మహత్యా ప్రయత్నం చేసే ఆలోచనలు వారిలో తగ్గుతాయని సైకాలజిస్టులు చెబుతున్నారు.ఆత్మహత్యలు నివారించాలంటే విద్యార్థులకు ప్రాణాంతకమైన సాధనాలు వీలైనంత వరకూ అందుబాటులో లేకుండా చూడాలి. అప్పుడు తక్షణం వాటిని అరికట్టగలుగుతాం,ఆలోచనలను వాయిదా వేయగలుగుతాం అని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసింది.ఐతే ఆత్మహత్యల నివారణలో సంపూర్ణ ప్రభావాన్ని తొలగించలేం,కొంతవరకూ వీటిని ప్రాథమికంగా అరికట్టగలుగుతాం,ఇదొక రక్షణ పొరలా పనిచేస్తుందని మనో వ్యాధుల నియంత్రణకు సంబంధించిన నిపుణురాలు వైశాలీ షణ్ముగం చెప్పారు.అగ్రశ్రేణి విద్యాలయాలు,విద్యాసంస్థలలో ఈ విధమైన తాత్కాలిక చర్యలను ఒక తక్షణ నివారణ రక్షణగా మాత్రమే ఉపయోగపడతాయి.దీనివల్ల విద్యార్థులలో తాత్కాలికంగా ఒక పెద్ద సమస్య నుండి వారి దృష్టిమళ్ళిపోయే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.బ్రిటన్‌కు చెందిన విశ్వవిద్యాలయాలలో కిటికీలను విద్యార్థులు తెరచి బయటకు తొంగి చూడకుండా గట్టి ఏర్పాట్లు చేశారు.

## ఇండియన్ పైలట్ యావత్ ప్రపంచానికీ హీరో

- ఇజ్రాయెల్ ఇండిపెండెన్స్ డేకు రండి
- మోదీ–స్మిత్ మచ్చార్‌లకు నెతన్యాహూ ఆహ్వానం



**దుబాయ్:** భారతదేశ పైలట్ స్మిత్ మచ్చార్ ''యావత్ ప్రపంచానికీ హీరో''అని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ కొనియాడారు. తన దేశానికి రావాల్సిందిగా మచ్చార్(38)ను ఆహ్వానించారు.నెతన్యాహూ ఆదివారం ఫోన్ ద్వారా మచ్చార్‌తో సంభాషించారు.ఫ్లయ్ దుబాయ్ విమానాన్ని కూల్చివేసి అందులో ప్రయాణిస్తున్న మొత్తం 180 మందినీ హతమార్చాలని కో–పైలట్ హమామీ కుట్రచేశాడని,ఆ కుట్రను స్మిత్ మచ్చార్ భగ్నం చేశారని అన్నారు.గడచిన బుధవారం(సెప్టెంబరు 30) ఫ్లయ్ దుబాయ్ ఎఫ్‌జెడ్ 1073 బోయింగ్‌లో కాక్‌పిట్‌లో తీవ్ర ఘర్షణలో మచ్చార్ కత్తిపోట్లకు గురయ్యాడు.ఈ విమానం దుబాయ్ నుండి టెల్అవీవ్‌కు వెళుతుండగా ఘటన జరిగింది.ప్రస్తుతం మచ్చార్‌కు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని ఆసుపత్రిలో చికిత్స జరుగుతోంది.

మచ్చార్‌తో ఫోన్ సంభాషణ సందర్భంగా తమ దేశానికి రావాల్సిందిగా నెతన్యాహూ ఆహ్వానం పలికారు.ఇజ్రాయెల్ ఇండిపెండెన్స్ డే సెలబ్రేషన్స్‌లో పాల్గొనవలసిందిగా కోరారు.లౌడ్ స్పీకర్‌మోడ్‌లో మచ్చార్‌కు ఆహ్వానం పలుకుతున్న ఒక వీడియోను సోషల్‌మీడియా ద్వారా నెతన్యాహూ షేర్ చేశారు.అదేవిధంగా భారత్ ప్రధానమంత్రి నరేంద్రమోదీని కూడా ఈ ఉత్సవాల్లో పాల్గొనవలసిందిగా ఆహ్వానించారు.త్వరలోనే మిమ్మల్ని ఇజ్రాయెల్‌లో కలుసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.''మీరు భారత్,ఇజ్రాయెల్ దేశాలకు మాత్రమే కాదు, యావత్ ప్రపంచానికే గొప్ప హీరో.

# వామపక్ష నేత లులాపై 11 మంది పోటీ

బ్రెజిల్‌లో కీలక ఎన్నికల సందడి





**బ్రసిలియా:** దక్షిణ అమెరికాలో అతిపెద్ద దేశం బ్రెజిల్ అధ్యక్ష–ఉపాధ్య పదవులకు ఆదివారం మొదటి రౌండ్ పోలింగ్ జరిగింది మొదటి రౌండ్‌లో ఎవరికీ మెజారిటీ రాకపోతే ఎక్కువ ఓట్లు సంపాదించుకున్న లీడింగ్‌లో ఉన్న మొదటి ఇద్దరి అభ్యర్థులమధ్య ఈనెల చివరి ఆదివారం అక్టోబరు 25న రెండవ రౌండ్ ఎన్నికలు నిర్వహిస్తారు.బ్రెజిల్‌లోని 26 రాష్ట్రాలలో గవర్నర్లు, వైస్–గవర్నర్లు, ఫెడరల్ జిల్లాలలో కూడా ఇదే పద్దతిలో రెండు విడతలుగా ఎన్నికల ప్రక్రియ జరుగుతుంది.బ్రెజిల్‌లో 16 ఏళ్ళ వయసు దాటిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉంది. 18–70 మధ్య వయసుగల అక్షరాస్యులు తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనాలి.

అత్యంత సీనియర్ రాజకీయ నాయకుడు, ప్రస్తుత అధ్యక్షుడు, వామపక్ష వర్కర్స్‌పార్టీ నాయకుడు లూయిజ్ ఇనాసియో లులా డసిల్వాను 11 మంది ప్రత్యర్థులు సవాలు చేస్తున్నారు. వీరిలో ప్రధానంగా మితవాద సోషల్ లిబరల్‌పార్టీ నాయకుడ ఫ్లావియా బోల్సెనారో (45) ప్రధాన ప్రత్యర్థిగా ఉన్నారు.బ్రిటన్ మీడియా సర్వే ప్రకారం, ఈ ఇద్దరు ప్రత్యర్థులు ప్రజాదరణలో 40 శాతం దాటారు.గత ఎన్నికల్లో లులా డసిల్వా చేతిలో ఫ్లావియా బొల్సెనారో తండ్రి ఓడిపోయారు. ఇప్పుడు ఫ్లావియా రంగంలోకి వచ్చారు.నాలుగేళ్ళక్రితం జరిగిన ఎన్నికల్లో ఫ్లావియా బోల్సెనారో తండ్రి జైర్ బోల్సెనారోను స్వల్పతేడాతో ఓడించి వామపక్ష వర్కర్స్‌పార్టీ బ్రెజిల్ దేశాధికారాన్ని స్వాధీనం చేసుకుంది. కానీ ట్రంప్ మాత్రం జైర్ బోల్సెనారోకు అత్యంత మిత్రుడు కావడంతో వామపక్ష వర్కర్స్‌పార్టీ ప్రభుత్వంపై ఆయన ద్వేషభావంతో వ్యవహరిస్తున్నారు.

జైర్ బోల్సెనారో ఓటమి తర్వాత వేలాదిమంది ఆయన మద్దతుదారులు బ్రెజిల్ కాంగ్రెస్ భవనంపై దాడి చేయడం, ఆ తర్వాత ఆయన తిరుగుబాటు కుట్ర ఆరోపణలు రుజువు కావడంతో ఈ ఘటనలు దేశ రాజకీయాలపైన,ప్రస్తుత ఎన్నికల పైనా కూడా తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. గతంలో 2002,2006 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో కూడా వామపక్ష వర్క్స్‌పార్టీ ఘన విజయం సాధించి పరిపాలించింది.తండ్రి వారసత్వాన్ని నిలబెట్టేందుకు ఫ్లావియా పోటీ పడుతున్నారు. 2003 నుండి 2019 వరకూ రియో డీ జెనైరో స్టేట్ డిప్యూటీగా ఫ్లావియా బోల్సెనారో పనిచేశారు.2018లో సెనేట్‌కు ఎన్నికయ్యారు. అప్పటినుండీ ఆయన వివాదాస్పద ప్రకటనలు చేస్తూ వస్తున్నారు.2019 నుండి 2023 వరకూ బ్రెజిల్‌ను పాలించిన ఆర్మీ కెప్టెన్,మితవాద నాయకుడు జైర్ బోల్సెనారో(71)పై కుట్ర ఆరోపణలు రుజువు కావడంతో ప్రస్తుతం ఆయన 27 సంవత్సరాలు శిక్ష అనుభవిస్తున్నారు.ఐతే ఆరోగ్య కారణాల రీత్యా ఆయన కారాగారంలో కాకుండా గృహనిర్బంధంలో ఉన్నారు.

## 'ఫ్లయ్ దుబాయ్'పాతబడిన ఎత్తుగడ

- ఆరోపణలకు ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ ఖండన

**టెహ్రాన్:** ఫ్లయ్ దుబాయ్ విమానం కాక్‌పిట్‌లో జరిగిన ఘటనను ఇరాన్‌కు ముడిపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆ దేశ విదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ అన్నారు. అవన్నీ తప్పుడు ఆరోపణలు ''ఫ్లాగ్‌షిప్'' అని కొట్టిపారేశారు.ఇవన్నీ పాతబడిపోయిన ఎత్తుగడలని విమర్శించారు.ప్రపంచానికి ఇరాన్ ఒక ముప్పుగా పరిణమిస్తుందనే అభిప్రాయం కలిగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయంలో ఇరాన్‌పై చేస్తున్న ఆరోపణలన్నీ కల్పిత సాక్ష్యాలపై ఆధారపడ్డాయన్నారు.కో–పైలట్ హమామీతో కుట్ర చేయించారని బ్రిటన్ సహా ఇతరదేశాలు చేస్తున్న ఆరోపణలను ఆయన తిరస్కరించారు. ఇరాన్ తనను తాను రక్షించుకోవడానికి సిద్ధంగా ఉందన్నారు.గడచిన ఏడు నెలలుగా ప్రపంచం స్వయంగా అనేక అనుభవాలను చవిచూస్తోందని,ప్రస్తుతం చేస్తున్న ఆరోపణలు దానికి కొనసాగింపుగా ఉన్న జ్ఞాపకమేనన్నారు.తప్పుడు సాక్ష్యాలతో యూదుపాలకులు,యూరప్ దేశాలు ఆరోపణలు చేస్తున్నాయన్నారు.గాజాలో పరిస్థితుల నుండి,ఇరాన్‌లో జరిగిన ఆక్రమణలు,విధ్వంసాల నుండి ప్రపంచాన్ని తప్పుతోవ పట్టించేందుకు జియోనిస్టు పాలకులు,దాని యూరప్‌మిత్రులు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.ప్రస్తుత ఆరోపణలను చరిత్రను దృష్టిలో ఉంచుకుని పరిశీలించాలని కోరారు.

కో–పైలట్ ఒమన్ దేశానికి చెందినవాడని, ఆయన విమానాన్ని తన అదుపులోకి తీసుకుని హైజాక్ చేసేందుకు ప్రయత్నం చేశాడని,విమానం కూల్చేసేందుకు కుట్ర చేశారని ప్రచారం చేశారు.అమెరికాఅధ్యక్షుడు ట్రంప్ కూడా దీనిని సమర్థించారు. ఇరాన్‌కు ప్రమేయం ఉందని తెలిస్తే తీవ్ర పరిణామాలను ఆ దేశం చవిచూస్తుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఇస్మాయిల్ బఖాయీ ఈ ప్రచారాన్ని ఖండించారు.

# జర్మన్‌పై రష్యా దాడికి అవకాశం

- ఆకస్మిక కీవ్ పర్యటనలో ఛాన్సలర్ మెర్జ్



**కీవ్:** జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ ఉక్రేన్‌లో ఆకస్మిక పర్యటన ప్రారంభించారు. ఆదివారం ఆయన రాజధాని కీవ్ నగరానికి చేరుకున్నారు. భారీ ఎత్తున కీవ్ నగరంలో రష్యా దాడులు కొనసాగుతున్న తరుణంలో మెర్జ్ ఈ అప్రకటిత పర్యటన చేశారు. యుద్ధం ప్రారంభమైనప్పటినుండీ ఉక్రేన్‌కు భారీస్థాయిలో ఆర్థిక సహాయం చేసిన దేశం జర్మనీ. ఇప్పుడు కూడా ఉక్రేన్‌కు ఆర్థిక సహాయ ప్యాకేజీని మెర్జ్ ప్రకటిస్తారని భావిస్తున్నారు. ఇప్పటివరకూ జర్మనీ 43.3 బిలియన్ యూరోలు (48.8 బిలియన్ డాలర్లు) ఉక్రేన్‌కు ఆర్థిక సహాయం చేసింది. ''ఒకవేళ రష్యా గనుక యుద్ధం ఆపకపోతే రష్యా తన ఆయుధాలను జర్మనీపైకి ఎక్కుపెట్టే అవకాశం ఉంది'' అని ఆదివారం ఒక ప్రకటనలో మెర్జ్ చెప్పారు.ఉక్రేన్‌లో ఆయన పర్యటించడం ఇది రెండవసారి. ఉక్రేన్‌కు తమ దేశ సంఘీభావం ప్రకటించడంకోసమే తాను వచ్చానన్నారు. రష్యాను అడ్డుకోకపోతే దాని యుద్ధ తంత్రం మాపైన తిరగబడుతుంది, మీరు మా సహాయం కోరవచ్చు, మాపై ఆధారపడవచ్చు అని జెలెన్స్కీకి ఫ్రెడరిక్ మెర్జ్ భరోసా ఇచ్చారు. అందువల్ల ఉక్రేన్‌కు తమ సహాయాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ఉక్రేన్–జర్మనీ మధ్య భాగస్వామ్యం ఏకపక్షంగా కొనసాగడంలేదని, ఇరువైపుల నుండి ఆదాన ప్రదానాలు కొనసాగుతున్నాయని చెప్పారు. జర్మనీ–ఉక్రేన్ ఇరు దేశాలు రెంటికీ ప్రయోజనం చేకూర్చే సాంకేతికతలను అభివృద్ధి చేస్తున్నాయని చెప్పారు. ఎక్స్ వేదికగా జెలెన్స్కీ ఒక పోస్టింగ్ పెడుతూ, మెర్జ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. రష్యాను ఉమ్మడిగా అడ్డుకోవాలన్నారు. మిగిలిన యూరప్ దేశాలతో రక్షణను బలోపేతం చేసేందుకు ఈ పర్యటనలో తాము ఒప్పందాలు చేసుకుంటామన్నారు. ఉమ్మడి భద్రతను బలోపేతం చేసే ఎజెండాపై తాము దృష్టి కేంద్రీకరిస్తామని ఉక్రేన్ విదేశాంగమంత్రి ఆండ్రీ సిబహా చెప్పారు. ఉక్రేన్‌పై తీవ్ర దాడులు చేస్తామని, విదేశీయులు, దౌత్యవేత్తలు దేశం వదిలి వెళ్ళిపోవాలని శనివారం రష్యా హెచ్చరించిన తర్వాత మెర్జ్ పర్యటన జరిగింది.

# ఇమ్రాన్ పార్టీతో పాక్ ప్రభుత్వ చర్చలు విఫలం

లాంగ్ మార్చ్ కొనగించేందుకు పిటిఐ రెడీ

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధులకు,ఆ దేశ ప్రతిపక్షనేత ఇమ్రాన్‌ఖాన్ పార్టీ ప్రతినిధులకు మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి.దీంతో ఇమ్రాన్‌ఖాన్‌కు చెందిన పాకిస్థాన్ తెహ్రిక్ ఇన్సాఫ్ (పిటిఐ)పార్టీ దేశవ్యాప్తంగా లాంగ్ మార్చ్ కొనసాగించాలని నిర్ణయించుకుంది. అందుకు సన్నాహాలు చేసింది.జైలు నిర్బంధంలో ఉన్న ఇమ్రాన్‌ఖాన్ ఆరోగ్యం క్షీణించిపోవడం,బంధువులను కలుసుకోవడానికి ఆయనను నిరాకరించడం,దేశంలో తీవ్రస్థాయిలో ఉద్రిక్తతలు పెరిగిపోవడంతో ఈ ఉద్రిక్తతలను సడలించేందుకు పాకిస్థాన్ ప్రభుత్వం చర్చల మంత్రాన్ని ప్రయోగించింది. కానీ ఈ చర్చలు విఫలమయ్యాయి.ఇమ్రాన్‌ఖాన్ కొన్ని కీలక డిమాండ్లు చేస్తున్నారు. ఈ డిమాండ్లు పరిష్కరించే విషయంపై చర్చలు జరిగాయి. కానీ శుక్రవారం మొదటి విడత చర్చలు విఫలమయ్యాయి.అక్టోబరు నాలుగో తేదీ నుండి దేశవ్యాప్తంగా తలపెట్టిన లాంగ్ మార్చ్‌ను నిలిపివేయాలని ప్రభుత్వం పిటిఐని డిమాండ్ చేస్తోంది.శనివారం సాయంత్రం రెండో విడత చర్చలు కూడా జరిగాయి. అనేక గంటలపాటు జరిగిన ఈ చర్చలు ఆదివారం తెల్లారేవరకూ కొనసాగినప్పటికీ ఎటూ తెగలేదు. చర్చల్లో ప్రతిష్టంభన నెలకుంది.సెప్టెంబరు 27న లాంగ్ మార్చ్ ప్రారంభించాలని పిటిఐ పార్టీ తొలుత పిలుపు ఇచ్చింది.తర్వాత దీనిని అక్టోబరు నాలుగో తేదీకి వాయిదా వేసింది.73 ఏళ్ళు వయసు గల మాజీ క్రికెటర్,మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ 2023 నుండి 100కు పైగా కేసులు ఎదుర్కొంటున్నారు. ఇవన్నీ దేశవ్యాప్తంగా అధికార కూటమి బలవంతంగా,అక్రమంగా బనాయించినవే.ఇందులో అవినీతి కేసులు,హింసాత్మక ఘటనలు వంటివి ఉన్నాయి. ప్రస్తుతం ఇమ్రాన్‌ఖాన్ రావల్పిండిలోని అదియాలా జైలులో ఉన్నారు. ఆయనను,ఆయన సోదరీమణులు,ఇతర ప్రధాన అనుచరులను విడుదల చేయాలని పిటిఐ డిమాండ్ చేస్తోంది.ఖాన్‌ను ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి మంచి చికిత్స చేయించాలని పాకిస్థాన్ సుప్రీంకోర్టు ఆగస్టు 18వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ప్రభుత్వం మాత్రం తిరస్కరించింది. ప్రభుత్వ ఆసుపత్రిలోనే తాము నిబంధనలకు అనుగుణంగా చికిత్స చేయించగలమని వాదించింది.ఈ ఉత్తర్వులను సవాలు చేసింది.ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఆయనకు ప్రభుత్వం చికిత్సలు చేయిస్తోంది.ఐతే ఖాన్ కుటుంబ సభ్యులు,పార్టీ కార్యకర్తలు ప్రభుత్వ చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.ఈ కేసును కోర్టు ప్రస్తుతం వాయిదా వేసింది. మరోవైపు పిటిఐ ప్రతినిధులు చేసిన చర్చల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంద.లాంగ్‌మార్చ్ కొనసాగించేముందుగా ఇమ్రాన్‌ఖాన్‌తో ఒక సమావేశం ఏర్పాటు చేయాలన ఆ ఆపీర్ట కార్యకర్తలు కోరుతున్నారు.చర్చల్లో సమస్య పరిష్కారం కాలేదని ప్రతిపక్ష నాయకుడు అల్లమా నజీర్ చెప్పారు. నిరసన ప్రదర్శనలు కొనసాగుతాయని ఖైబర్‌పఖ్తుంఖ్వా ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది ప్రకటించారు. పఖ్తుంఖ్వారాష్ట్రంలో ఇమ్రాన్ ఖాన్‌పార్టీ అధికారంలో ఉంది. కానీ ఈ ప్రాంతంలో దీర్ఘకాలంగా ఉగ్రవాదం కొనసాగుతోంది.ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల నుండి ఉగ్రవాదులు పాకిస్థాన్‌లోకి ప్రవేశిస్తున్నారని ప్రభుత్వం విమర్శిస్తోంది.

# బోస్నియా–హెర్జ్‌గొవీనా ఎన్నికలు




**సరజేవో:** యూరప్‌లో బాల్కన్ ద్వీప దేశం బోస్నియా–హెర్జ్‌గొవీనాలో అధ్యక్షపదవికి ఆదివారం ఎన్నికలు జరిగాయి. నినిమిది నెలలు చొప్పున మొత్తం ముగ్గురు అధ్యక్షులు వంతులవారీగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తారు. మొదటి విడత ఎనిమిది నెలలు సెర్బియా సభ్యుడు,తర్వాత ఎనిమిది నెలలు బోస్నియా సభ్యుడు,ఆ తర్వాత ఎనిమిది నెలలు క్రొయేషియా సభ్యుడు అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ వంతులవారీ విధానం పదవీకాలం నాలుగు సంవత్సరాలు పూర్తయ్యేవరకూ కొనసాగుతుంది.34 లక్షలమంది అర్హులైన ఓటర్లు దేశంలో ఉన్నారు.ఈసారి కొత్త సాంకేతిక పద్ధతిలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఓటర్లు బయోమెట్రిక్ ద్వారా బ్యాలెట్ పత్రాలను స్కాన్ చేస్తారు.ఓట్ల లెక్కింపు వేగంగా పూర్తి చేయడం కోసం ఈ పద్ధతిని అనుసరిస్తున్నారు.సోషల్ డెమోక్రటిక్‌పార్టీ (ఎస్‌డిపి)అధ్యక్షుడు డెనిస్ బెసిరోవిక్,పార్టీ ఆఫ్ డెమోక్రటిక్ యాక్షన్(ఎస్‌డిఏ)సభ్యుడు బకీర్ ఇజెట్ బెగోవిక్,పార్టీ ఫర్ బోస్నియా అండ్ హెర్జ్‌గొవీనా(స్రాంకా జాబిహెచ్)కి చెందిన సభ్యుడు సెమిర్ ఎఫెండిక్,యూనియన్ ఫర్ బెటర్ ఫ్యూచర్ ఆఫ్ బిహెచ్(ఎస్‌బిబి)కి చెందిన ఫహ్రుదిన్ రాడోన్సిక్ ప్రధానంగా పోటీలో ఉన్నారు.దేశంలో అతిపెద్ద పార్టీ అయిన ఎస్‌డిఏ అధ్యక్షుడైన ఇజెట్ బెగోవిక్ 2022 ఎన్నికల్లో ఎస్‌డిపికి చెందిన బెసిరోవిక చేతిలో ఓడిపోయిన తర్వాత ఇప్పుడు మళ్ళీ ఎన్నికలబరిలోకి దిగారు.ఎనిమిదినెలల వంతున క్రొయేషియా తరపున అధ్యక్ష బాధ్యతలు నిర్వహించడంకోసం ముగ్గురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు.సెర్బ్‌ల తరపున సివియానోవిక్ రెండోసారి పోటీ పడుతున్నారు.అధ్యక్షపదవితోపాటు పార్లమెంటు,స్థానిక ప్రభుత్వం,రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ విధంగా ఓటర్లు మొత్తం 14 ప్రభుత్వాలను,వంతులవారీ పద్ధతులలో ముగ్గురు అధ్యక్షులను ఎన్నుకుంటారు.75 రాజకీయ పార్టీలు,మరో నలుగురు ఇండిపెండెంట్ సభ్యులు ఎన్నికల్లో పోటీకి అర్హులుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.

## పోలీసులు లైంగిక వేధింపులు

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో పోలీసు సిబ్బంది తమను లైంగికంగా వేధించారని ముగ్గురు మహిళా జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకుంటున్న సమయంలో అక్కడ మహిళా సిబ్బంది ఎవరూ లేకపోవడాన్ని ప్రశ్నించినందుకు ఎసిపి వివేక్ భగత్ తమను అసభ్యంగా తాకుతూ వెనక్కి నెట్టేశారని ఆరోపించారు. దీంతో వారి ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ కోసం ఈ ఫిర్యాదులను క్రైమ్ బ్రాంచ్ అధికారులకు బదిలీ చేసినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా మండిపడింది. ఈ విషయాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాలను ప్రశ్నించింది. ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకునేలా షా చూడాలని, అలాగే మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని వీలైనంత త్వరగా అమలు చేసేలా ప్రధానమంత్రి చూడాలని, లేకపోతే వారు రాజీనామా చేయాలని ప్రతిపక్ష పార్టీ డిమాండ్ చేసింది. జంతర్ మంతర్ వద్ద రిపోర్టింగ్ చేస్తున్నప్పుడు పోలీసు సిబ్బంది తమను లైంగికంగా వేధించారని ముగ్గురు మహిళా జర్నలిస్టులు ఆరోపించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా తెలిపారు. పదుల సంఖ్యలో జర్నలిస్టులు నిరసన తెలిపినప్పటికీ, ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని, ఎలాంటి నిర్దిష్ట చర్యలు తీసుకోలేదని ఆమె ఆదివారం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలతో ఢిల్లీ పోలీసు సిబ్బంది చాలా దురుసుగా ప్రవర్తించారని కూడా ప్రియాంక ఆరోపించారు. భద్రత కల్పించడం విధిగా ఉన్న పోలీసు బలగాల వల్లే మహిళలు బెదిరింపులకు గురవుతున్నారన్నారు. కళాశాల విద్యార్థినుల నుండి జర్నలిస్టుల వరకు, ప్రతిచోటా మహిళలు భద్రతా లోపాన్ని ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అన్నారు. 'నరేంద్ర మోదీ జీ, అమిత్ షా జీ, మహిళల పట్ల ఈ ప్రవర్తన సరైనదేనా? కాకపోతే, మీరు దీనిని ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదు?' అని ప్రియాంక ప్రశ్నించారు. ఒక మహిళ పరువుకు భంగం కలిగించారంటూ ఢిల్లీ పోలీసులపై మరోసారి ఆరోపణలు వచ్చాయని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా అన్నారు. 'అయినా అమిత్ షా మౌనంగా ఉన్నారు. విద్యార్థి ఉద్యమాల సమయంలో కూడా ఇలా జరిగింది. వీధిలో ఎవరో ఒక రౌడీ లేదా పోకిరి ఒక మహిళతో ఇలా ప్రవర్తిస్తే, కనీసం పోలీసులు తనకు అండగా నిలబడి న్యాయం చేస్తారని ఆమె ఆశిస్తుంది' అని ఖేరా ఎక్స్‌లో పేర్కొన్నారు. కానీ, పోలీసులే మహిళలతో ఇంత 'అసహ్యకరమైన ప్రవర్తన'తో వ్యవహరిస్తే, ఈ దేశంలోని మహిళలు న్యాయం కోసం ఎక్కడికి వెళ్తారని ఖేరా ప్రశ్నించారు. 'ఈ దేశ జనాభాలో మహిళలు సగం మంది ఉన్నారు. వీధుల నుండి పార్లమెంటు వరకు, వారికి ప్రతి హక్కు ఉంది. ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు అయ్యేలా, బాధ్యులైన పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకునేలా హోం మంత్రి అమిత్ షా తప్పక చూడాలి' అని ఖేరా అన్నారు. 'అంతేకాకుండా, పార్లమెంటులో మహిళలు తమ న్యాయమైన, సమాన స్థానాన్ని పొందగలిగేలా, మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వీలైనంత త్వరగా అమలు చేసేలా ప్రధానమంత్రి చూడాలి' అని ఆయన జోడించారు. మహిళలకు భద్రత, గౌరవం, అధికారంలో సమాన వాటా కావాలి, లేకపోతే, ప్రధానమంత్రి, హోం మంత్రి రాజీనామా చేస్తేనే మంచిదని, ఏదేమైనా, వారు పరిస్థితులను చక్కదిద్దలేకపోతున్నారని ఆరోపించారు. ఇదిలా ఉండగా, శనివారం జంతర్ మంతర్ వద్ద సిఇసి జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసన సందర్భంగా పోలీసు సిబ్బంది తమను లైంగికంగా వేధించారని ముగ్గురు మహిళా జర్నలిస్టులు ఆరోపించడంతో, నిష్పాక్షికమైన విచారణ కోసం ఢిల్లీ పోలీసులు ఈ ఫిర్యాదులను క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారని ఒక అధికారి ఆదివారం తెలిపారు. శనివారం, బాధితురాలైన మహిళా జర్నలిస్టులలో ఒకరు పిటిఐతో మాట్లాడుతూ, ఒక అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఎసిపి) తనపై లైంగిక దాడి చేశారని చెప్పారు. విచారణలో భాగంగా క్రైమ్ బ్రాంచ్ ఆరోపణలను పరిశీలించి, ఫిర్యాదుదారులు, సంబంధిత ఇతరుల వాంగ్మూలాలను నమోదు చేస్తుందని అధికారి తెలిపారు. నిరసనను కవర్ చేస్తున్న జర్నలిస్టుల పట్ల పోలీసుల ప్రవర్తనపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేసింది. ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఢిల్లీ పోలీసులను కోరింది.

## బారికేడ్లు ఛేదిస్తూ...

(మొదటి పేజీ తరువాయి)



ప్రదర్శకులకు, పోలీస్‌లకు మధ్య తోపులాట జరిగింది. స్వల్ప ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. జంతర్‌మంతర్‌కు వెళ్ళే అనేక మార్గాలను అడ్డుకున్నారు. బ్యారికేడ్లను దాటి వెళ్ళకుండా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఐసా జాతీయ అధ్యక్షురాలు నేహాబోరా బ్యారికేడ్‌పైకి ఎక్కి దాటి వెళ్ళేందుకు ప్రయత్నం చేశారు. కానీ పోలీసు అధికారులు ఆమెను అడ్డుకున్నారు. ఈ దృశ్యాల వీడియోలు అందరికీ చేరాయి. నేహాబోరా సహా ఆమ్ ఆద్మీపార్టీ నాయకులను పోలీసులు బలవంతంగా ఈడ్చుకువెళ్ళారు. పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఐతే నేహాబోరాను ఒక గుర్తుతెలియని వాహనంలో, నెంబరుప్లేటు లేని వాహనంలో తరలించారని, ఆమెను అరెస్టు చేసినప్పుడు నిబంధనలకు అనుగుణంగా ఒక్క మహిళా పోలీస్ కూడా లేరని ప్రదర్శకులు ఆరోపించారు. ఆమెను గుర్తు తెలియని ప్రదేశానికి తరలించారు. మహిళా ప్రదర్శకులపట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారని నిరసన ప్రదర్శకులు విమర్శించారు.నేహాబోరాను అరెస్టు చేసి తీసుకువెళ్ళిన విధానాన్ని ప్రదర్శకులు నిలదీశారు. దీనిపై పోలీసు వర్గాలు స్పందించలేదు. దీంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. ఈ విషయంపై కేంద్ర హోం మంత్రిత్వశాఖ సమాధానం చెప్పాలని, జవాబుదారీ వహించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్ తక్షణం రాజీనామా చేయాలని,వివాదాస్పద ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిలిపివేయాలని, అర్హులైన ఓటర్లందరికీ ఓటుహక్కు పునరుద్ధరించాలని, ఎన్నికల సంఘంలో కమిషనర్ల నియామకం ప్రక్రియ రహస్యాలకు తావు లేకుండా బాహాటపద్ధతిలో జరగాలని కోరుతూ ఢిల్లీలో మూడు రోజులుగా నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. శనివారంనాడు 150 మంది ప్రదర్శకులను అరెస్టు చేశారు. అంతకుముందు శుక్రవారం నాడు కూడా ప్రదర్శకులను నిర్బంధించారు.

ఈ ప్రదర్శన నిర్వహించేందుకు ఢిల్లీ పోలీసులు ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. భారీ భద్రత ఏర్పాటు చేశారు. 5000 మందికిపైగా ఢిల్లీ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలను మోహరించారు. డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేస్తూ, నిఘా చేశారు. రాకపోకలపై తీవ్ర ఆంక్షలు విధించారు. భారత ఎన్నికల సంఘంలో ఉన్న ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ఇద్దరూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాలకు గడచిన 10 నెలల కాలంలో 14 సార్లు అభ్యంతరాలు తెలియజేశారని ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో గతనెల నాలుగోవారంలో ఒక పరిశోధనాత్మకవ్యాసం వచ్చింది. దీంతో దేశంతో తీవ్ర సంచలనం, ఉద్రిక్తతలు నెలకుని ఉద్యమానికి దారితీసింది. ఐతే ఎన్నికల సంఘం ఆ తర్వాత ఒక ప్రకటన చేస్తూ, నిర్ణయాలు ఏకపక్షంగా జరగలేదని ఉద్ఘాటించింది.

## నిరసన జ్వాలలు

(మొదటి పేజీ తరువాయి)

రద్దు చేయాలని కూడా ఆయన కోరారు. ఓటర్ల జాబితా నుండి బంగ్లాదేశీయులను తొలగించడానికి సర్ నిర్వహించినట్లయితే, దేశంలో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులను ప్రభుత్వం ఎంతమందిని గుర్తించిందని ఉద్ధవ్ థాక్రే ప్రశ్నించారు. 'జ్ఞనేష్ కుమార్ బిజెపికి ఒక ఆయుధం' అని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఆరోపించారు. న్యూరెమ్‌బెర్గ్ విచారణల తరహాలోనే బిజెపి అధికారులపై కూడా విచారణ జరుపుతామని ఆయన హెచ్చరించారు. దేశంలో కూడా అలాంటి పరిణామమే జరుగుతుందని బిజెపి, ఆ అధికారులు గ్రహించాలి అని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షాల పోరాటం ఏదో ఒక పార్టీ, నాయకుడు, మతం లేదా కులం కోసం కాదని, దేశ స్వేచ్ఛ కోసమని ఉద్ధవ్ అన్నారు. ప్రజలు ప్రస్తుతం మౌనంగా ఉన్నంత వరకే బిజెపి ఆటలు సాగుతాయని, ఒకసారి వారి తిరగబడితే ఆ పార్టీ అధికార పీఠాన్ని దహనం చేస్తారని హెచ్చరించారు. ఓట్లు, ప్రజాప్రతినిధులను మాత్రమే కాకుండా, అయోధ్యలోని రామమందిరానికి సంబంధించిన విరాళాలను కూడా బిజెపి దోచుకుందని ఆయన ఆరోపించారు.

**మహారాష్ట్రలో 2 కోట్ల ఓటర్ల తొలగింపు**

ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకున్న సేన (యుబిటి) అధినేత, మహారాష్ట్రలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో 2 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయని, అలాగే పశ్చిమ బెంగాల్‌లో 30 లక్షలు, తమిళనాడులో 70 లక్షల మంది ఓటర్ల పేర్లు ఇలాగే తొలగించబడ్డాయని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో ఉప ఎన్నికలకు ముందు, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన అంశంపై అత్యవసర విచారణ చేపట్టనందుకు సుప్రీంకోర్టును కూడా ఆయన విమర్శించారు. అన్ని వ్యవస్థలను బిజెపి ఏ విధంగా తమ అదుపులో ఉంచుకుందో ఇది తెలియజేస్తోం అని ఉద్ధవ్ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ సంస్థలో అక్రమాలు జరుగుతున్నాయని 2017–18 నుండే రాజకీయ నాయకులకు చెబుతూ వస్తున్నానని రాజ్ థాక్రే అన్నారు. ఇవిఎంలు, ఓటర్ల జాబితా అంశాలపై అప్పటి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీలను కలిశానని, ఆ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఎన్నికలను బహిష్కరించాలని వారిని కోరానని మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధినేత తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో ప్రతిపక్షాలు మంచి ఫలితాలు సాధించిన తర్వాత, కేవలం ఆరు నెలల వ్యవధిలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో వారి ఓట్లు తగ్గడం, బిజెపి ఓట్లు పెరగడం అసాధ్యమని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చాలా కాలంగా ఓట్ల దొంగతనం గురించి మాట్లాడుతున్నారని, అందుకు సంబంధించిన ఆధారాలను కూడా సమర్పించారని థోరట్ గుర్తుచేశారు. ఇప్పుడు ఆ ఆధారాలు ఎన్నికల సంఘం ద్వారానే బయటకు వచ్చాయన్నారు. అధికారం కోసం బిజెపి ఏమైనా చేయగలదని ఆయన విమర్శించారు. అలాగే అత్యున్నత ఎన్నికల కమిషన్ సభ్యుల నియామక తీరును కూడా ఆయన విమర్శించారు.

**భారతీయులకు ఏకం కావాలి : దీప్కే**

ఈ ఆందోళనకు మద్దతు తెలుపుతూ సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. 'ఆందోళనకారులందరికీ నా సంఘీభావం. భారతీయులందరూ ఏకం కావాలి. ఇదే సరైన సమయం, లేదంటే ఇక ఎప్పటికీ సాధ్యం కాదు' అని అన్నారు. శుక్రవారం ముంబయిలో సిఇసికి వ్యతిరేకంగా 'జైల్ భరో ఆందోళన్' నిర్వహించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నిరసనకారులకు మద్దతు తెలుపుతూ, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల కోసం నగరం మరోసారి వీధుల్లోకి వచ్చిందని అన్నారు. 'ఇది ఇప్పుడో లేదా ఎప్పటికీ కాదు (ఇదే సరైన సమయం) అనే పరిస్థితి' అని పేర్కొంటూ భారతీయులందరూ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## క్లిష్ట దశ దాటాం

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం గడిచిన ఐదారు నెలల్లో సొరంగ తవ్వకాలు సుమారు 700 మీటర్లు ముందుకు సాగాయని అధికారులు తెలిపారు. అవుట్‌లెట్ వైపు 450 మీటర్లు, ఇన్‌లెట్ వైపు 250 మీటర్ల పురోగతి నమోదైందన్నారు. 43.968 కిలోమీటర్ల ప్రధాన సొరంగంలో సుమారు 79 శాతం పనులు పూర్తి కాగా, మరో 9.1 కిలోమీటర్ల తవ్వకాలు మిగిలి ఉన్నాయని వివరించారు.అత్యంత ప్రమాదకరమైన షియర్ జోన్‌ను దాటడం ప్రాజెక్టులో కీలక ముందడుగని ఉత్తమ్ పేర్కొన్నారు.టన్నెల్1లో రెండు వైపులా జరుగుతున్న తవ్వకాలు 2028 మే–జూన్ నాటికి కలిసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. తవ్వకాలతోపాటు స్ప్రే లైనింగ్ పనులు కొనసాగుతున్నందున బ్రేక్‌త్రూ సమయానికి లైనింగ్‌లో అధిక భాగం పూర్తయ్యే అవకాశం ఉందన్నారు.ప్రధాన సొరంగంతోపాటు 7.1 కిలోమీటర్ల టన్నెల్2, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఇతర అనుబంధ పనులను కూడా సకాలంలో పూర్తి చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. 2028 జూన్ నాటికి నీటిని అందించే లక్ష్యానికి అనుగుణంగా పక్కా కార్యాచరణ రూపొందించి, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**బలహీన శిలల నేపథ్యంలో నెమ్మదిగా సాగిన తవ్వకాలు : కల్నల్ పరీక్షిత్ మెహ్రా**

బలహీన నేల, రాక్ బరస్ట్ వంటి ప్రమాదాల నేపథ్యంలో ఇన్‌లెట్ వద్ద తొలి నెలల్లో తవ్వకాలను నెమ్మదిగా చేపట్టినట్లు ఆర్మీ టన్నెల్ నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా తెలిపారు. టిబిఎం చిక్కుకున్న ప్రాంతాన్ని చుట్టి వెళ్లే తవ్వకాల్లో బలహీన శిలల మండలం ఎదురైనట్లు వివరించారు.ఈ ప్రాంతంలో 140 మి.మీ. సీమ్‌లెస్ పైపులతో అంబ్రెల్లా కేనపీ ఏర్పాటు చేసి, రీ ఇన్‌ఫోర్స్డ్ రిబ్స్, దశలవారీ తవ్వకాలు, ప్రోబ్ డ్రిల్లింగ్, అదనపు రక్షణ చర్యలతో పనులు కొనసాగించినట్లు తెలిపారు. ప్రస్తుతం శిలల పరిస్థితి మెరుగుపడటంతో సాధారణ వేగంతో పనులు చేపట్టే అవకాశం ఏర్పడిందన్నారు.ప్రస్తుతం రెండు వైపులా కలిపి రోజుకు సుమారు ఎనిమిది మీటర్ల పురోగతి నమోదవుతోందని అధికారులు మంత్రికి వివరించారు. సాధారణంగా రోజుకు 7–7.5 మీటర్ల పురోగతి ఉంటోందని, కొన్ని రోజుల్లో 10 మీటర్లకు చేరిందన్నారు. అవుట్‌లెట్ వద్ద మూడు భుజాల డ్రిల్లింగ్ బూమర్ ఇప్పటికే పనిచేస్తుండగా, మరో బూమర్‌ను అక్టోబర్‌లో ఇన్‌లెట్‌కు తరలించనున్నారు.జర్మనీ నుంచి తెప్పిస్తున్న లోకోమోటివ్ అక్టోబర్ నెలాఖరుకు అందుబాటులోకి రానుందన్నారు. తద్వారా సొరంగంలో 21 కిలోమీటర్ల వరకు దూరం నుంచి తవ్విన రాళ్లు, మట్టిని వేగంగా బయటకు తరలించవచ్చని అధికారులు తెలిపారు. ప్రస్తుతం 20–24 గంటలకు తగ్గిన నిర్మాణ సైకిల్‌ను అదనపు యంత్రాలు, మెరుగైన రవాణా వ్యవస్థతో సుమారు 10 గంటలకు తగ్గించవచ్చని అంచనా ఉందని పేర్కొన్నారు.

## 25 వెల్‌నెస్ సెంటర్స్

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారు. చికిత్సతో పాటు మందులు, పరీక్షలు, వినియోగ వస్తువులు, ఇంప్లాంట్లు, తదుపరి వైద్య సేవలను కూడా ప్యాకేజీల్లో చేర్చారు. అత్యవసర పరిస్థితుల్లో ముందస్తు రిఫరల్ లేకుండానే సమీపంలోని ఎమ్ప్యానెల్ ఆస్పత్రిలో చేరే అవకాశం కల్పించారు. నిర్ణీత సమయంలో సంబంధిత వివరాలను ట్రస్టుకు తెలియజేయాల్సి ఉంటుంది.

**ప్రతినెలా రూ. 88 కోట్లతో ప్రత్యేక నిధి..**

'ఎన్ఈహెచ్ఎస్' నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసింది. ఇందులో ఉద్యోగులు, పింఛనుదారుల బేసిక్ పే లేదా బేసిక్ పెన్షన్ నుంచి 1.5 శాతం చొప్పున జమ చేయగా, రాష్ట్ర ప్రభుత్వం కూడా అంతే మొత్తాన్ని తన వాటాగా చెల్లిస్తోంది. ఉద్యోగులు, పింఛనుదారుల నుంచి నెలకు రూ.44 కోట్లు సమకూరగా, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.44 కోట్లు అందిస్తోంది. దీంతో ప్రతి నెలా రూ.88 కోట్ల నిధి అందుబాటులోకి వస్తోంది. ఇప్పటికే మూడు నెలలకు సంబంధించిన నిధులను ఈ ట్రస్ట్‌కు బదిలీ చేశారు. ఈ పథకానికి వార్షిక బడ్జెట్ రూ.1,056 కోట్లుగా అంచనా వేశారు.

**పాత బకాయిల్లో రూ.70 కోట్ల విడుదల**

'ఎన్ఈహెచ్ఎస్' అమల్లోకి వచ్చిన తర్వాత పాత ఈహెచ్ఎస్‌కు సంబంధించిన బకాయిల్లో రూ.70 కోట్లు విడుదల చేశారు. ఇంకా రూ.100.52 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇందులో ప్రైవేటు ఆస్పత్రులకు రూ.23.85 కోట్లు, ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.76.67 కోట్లు బకాయిలు ఉన్నాయి. ప్రైవేటు ఆస్పత్రులకు చెల్లించేందుకు రూ.19.23 కోట్ల విలువైన చెక్కులు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కాగా నూతన స్కీములో ఉద్యోగులకు సంబంధించిన 3,192 కేసులకు రూ.18.75 కోట్లను, వారి కుటుంబ సభ్యులకు చెందిన 5,669 కేసులకు గాను రూ.39.52 కోట్లకు అనుమతించారు. పింఛనుదారుల 4,042 కేసులకు రూ.29.27 కోట్లు, వారి కుటుంబ సభ్యుల 2,492 కేసులకు రూ.17.08 కోట్ల మేర ముందస్తు అనుమతులు ఇచ్చారు.

**30 ఆస్పత్రుల్లో హెల్ప్‌డెస్కు**

లబ్ధిదారులకు ఆస్పత్రుల్లో ఇబ్బందులు తలెత్తకుండా 30 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ప్రత్యేక హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేశారు. రిజిస్ట్రేషన్, అడ్మిషన్, చికిత్స సమన్వయం నుంచి ఫిర్యాదులు,వాటి పరిష్కారం వరకు హెల్ప్ డెస్కుల ద్వారా సహాయం అందిస్తున్నారు.

**కార్డు లేకపోయినా చికిత్స...**

హెల్త్‌కార్డు జారీ కాలేదనే కారణంతో అర్హులకు వైద్య సేవలను నిరాకరించరాదని అధికారులు స్పష్టం చేశారు. ఉద్యోగులు, పింఛనుదారులు తమ గుర్తింపు సంఖ్య ఆధారంగా వైద్య సేవలు పొందే అవకాశాన్ని కల్పించారు. సెప్టెంబర్ 28 నాటికి 12,56,962 మంది లబ్ధిదారుల హెల్త్‌కార్డులు అందుబాటులోకి రాగా, 7,56,210 మంది వాటిని డౌన్‌లోడ్ చేసుకున్నారు.

# ముగిసిన 2026 ఆసియా గేమ్స్



జపాన్లోని ఐచి నగోయాలో 20వ ఆసియా క్రీడలు ముగిశాయి. ఆదివారం జరిగిన ముగింపు వేడుకలో అధికారిక ఆసియా క్రీడల పతాకాన్ని ఖతార్ రాజధాని దోహాకు అప్పగించారు. 21వ ఆసియా క్రీడలకు ఆతిథ్యమిచ్చే హక్కులను దోహాకు లాంఛనంగా ప్రదానం చేశారు. ఇటీవల నగోయాలో దోహ 2030 ఆర్గనైజింగ్ కమిటీ సిఇఒ అహ్మద్ అబ్దుల్లా అల్‌బుయినైన్ మీడియాతో మాట్లాడు తూ.. అన్ని పోటీ వేదికలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కొత్త వేదికలను నిర్మించాల్సిన అవసరం లేదు. 2006 ఆసియా క్రీడలు, 2022 ఫిఫా ప్రపంచ కప్ కోసం నిర్మించిన ఆధునిక సౌకర్యాలను ఖతార్ ఉపయోగించుకుంటుంది. ఆయన మాట్లాడుతూ.. 'మా వద్ద అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే ఉన్న వేదికలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలి అంతే' అని అన్నారు. తదుపరి ఆసియా క్రీడల తాత్కాలిక షెడ్యూల్ 2030 నవంబర్ 4 నుంచి 19 వరకు ఉంటుంది.

**ఒలింపిక్ కమిటీతో చర్చించిన తర్వాత షెడ్యూల్ నిర్ణయం...** క్యాలెండర్‌కు సంబంధించి ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. తదుపరి ఆసియా క్రీడలను 2030 నుంచి 2031కి మార్చే అవకాశం ఉంది, తద్వారా అవి 2032 బ్రిస్బేన్ ఒలింపిక్స్‌కు కొద్దిగా ముందుగా జరిగి, ఒలింపిక్ అర్హతకు వీలు కల్పిస్తాయి. 2030 లేదా 2031లో దేనికైనా తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని ఖతార్ స్పష్టంగా ప్రకటించింది. ఈ ఆసియా క్రీడలు అరేబియా ద్వీపకల్పంలో జరిగే రెండేళ్ల కాలక్రమంలో భాగంగా ఉంటాయి. 2034 ఆసియా క్రీడలు సౌదీ అరేబియా రాజధాని అయిన రియాద్‌లో జరగాల్సి ఉంది.

**ప్రధాన టోర్నమెంట్లకు ఆతిథ్యం ఇచ్చేందుకు ముందుకొచ్చిన ఖతార్..** ప్రధాన క్రీడాకార్యక్రమాలను నిర్వహించడంలో ఖతార్ ఆసక్తిని కనబరుస్తూనే ఉంది. దాని ఆధునిక స్టేడియాలు, అద్భుతమైన మౌలిక సదుపాయాలు, మెగా ఈవెంట్లను నిర్వహించిన అనుభవం దోహా 2030ని ఓ చిరస్మరణీయ కార్యక్రమంగా మార్చడంలో సహాయపడతాయి. రాబోయే నాలుగు ఏళ్లలో ఖతార్ ఆసియా అథ్లెట్ల కోసం మరో వేదికను సృష్టించనుంది.

# దాయాదిని దంచేసి.. '85'తో సరి



ఆసియాడ్ టాప్5లో నిలవాలన్న భారత్ లక్ష్యం నెరవేరినా గత ఎడిషన్ (106) మాదిరిగా 'పతక శతకానికి' మాత్రం చాలాదూరంలో నిలిపోయిం ది. ఎప్పట్లానే చైనా అగ్రస్థానం అందుకుంది. ఏకంగా 169 స్వర్ణాలు సహా 341 పతకాలతో ఆసియాలో తిరుగులేని శక్తిగా కొనసాగుతోంది. ఆదివారం జరిగే ముగింపు వేడుకలతో ఆసియాడ్ మెరుపులకు తెరపడనుంది.

పోటీ ఎక్కడైనా క్రికెట్ గ్రౌండ్లో పాకిస్థాన్ జట్టు ఎదురుపడితే భారత జట్టు పూనకం వచ్చినట్టు రెచ్చిపోతోంది. వరల్ కప్స్, ఆసియా కప్లో దాయాదిని దంచేస్తున్న టీమిండియా ఆసియా గేమ్స్లోనూ పొరుగు జట్టు పని పట్టింది. ఆసియాడ్ టీ20 క్రికెట్ ఫైనల్లో పాక్‌ను పడగొట్టిన భారత్ వరుసగా రెండో స్వర్ణం అందుకుంది. స్టార్ ఓపెనర్ అభిషేక్ వర్మ (28 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సర్లతో 61), హైదరాబాదీ తిలక్‌వర్మ (22 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 51 నాటౌట్) మెరుపు అర్ధ శతకాలతో విజృంభించిన వేళ శనివారం జరిగిన తుదిపోరులో 19 పరుగుల తేడాతో గెలిచిన భారత్ టైటిల్ నిలబెట్టుకుంది. ఆశించినట్టే ఉత్కంఠ రేపిన ఈ పోరులో తొలుత భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 211 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం ఛేదనలో పాక్ ఓవర్లన్నీ ఆడి 192/6 స్కోరు చేసి ఓడింది. హసన్ నవాజ్ (51 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సర్లతో 96) పోరాడినా.. అక్షర్ పటేల్ (2/29), సుందర్ (2/29), శివం దూబే (2/33) ఆ జట్టును నిలువరించారు. టాస్ ఓడి బ్యాటింగ్కు దిగిన టీమిండియాకు ఓపెనర్ అభిషేక్ శర్మ మెరుపు ఆరంభం ఇచ్చాడు. రెండో ఓవర్లో యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (15) రెండు సిక్సర్లు, అభి 6,4తో ఏకంగా 24 పరుగులు వచ్చాయి. మూడో ఓవర్లో వైభవ్, ఐదో ఓవర్లో శాంసన్ (2) ఔటైనా.. మరో ఎండ్లో అభి సిక్సర్ల వర్షం తగ్గలేదు. డానియల్ బౌలింగ్లో సిక్సో 20 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. పవర్ప్లేను భారత్ 81/2తో ముగించింది. సెంచరీ చేసేలా కనిపించిన అతడిని 8వ ఓవర్లో మిన్హాస్ ఔట్ చేశాడు. ఆ తర్వాత ఇషాన్(20), కెప్టెన్ అయ్యర్ (21) నిలకడగా ఆడినా మిన్హాస్, అబ్రార్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో భారత్ 133/5తో కాస్త తడబడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన వైస్ కెప్టెన్ తిలక్, శివం దూబే (27) ఇన్నింగ్స్ను మళ్లీ గాడిలో పెట్టాడు. చివరి మూడు ఓవర్లలో భారీ షాట్లతో విరుచుకుపడ్డారు. మోఖిమ్ వేసిన 18వ ఓవర్లో తిలక్ 4, 6, 6 కొడితే.. ఆయుబ్ ఓవర్లో దూబే కూడా 6, 6,4తో దంచాడు.ఆరో వికెట్కు 62 పరుగులు జోడించిన తర్వాత ఆఖరి ఓవర్ తొలి బాల్కే దూబే ఔటైనా.. తిలక్ రెండు భారీ సిక్సర్లతో జట్టు స్కోరు 210 మార్కు దాటించాడు. అనామక ఆటగాళ్లతో బరిలోకి దిగిన పాకిస్థాన్ ఛేదనలో గట్టిగానే పోరాడింది. తొలి ఏడు ఓవర్లలోనే టాప్3 బ్యాటర్లయిన కెప్టెన్ సాహిబ్జాదా ఫర్హాన్ (10), సదాఖత్ (23), ఉస్మాన్ ఖాన్ (3)ను వెనక్కుపంపిన స్పిన్నర్లు పాక్ను 39/3తో నిలపడంతో భారత్ అలవోక విజయం సాధించేలా కనిపించింది. కానీ,యువ బ్యాటర్ హసన్ నవాజ్ భారీ షాట్లతో విరుచుకుపడి భయపెట్టాడు. ఆరంభంలోనే వైభవ్ సూర్య వంశీ క్యాచ్ వదిలేయడంతో లభించిన అవకాశాన్ని ఉపయోగించుకున్న నవాజ్, సైమ్ ఆయుబ్ (29)తోడుగా నవాజ్ ఫోర్లు, సిక్సర్లతో చెలరేగాడు. 28 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. 15వ ఓవర్లో ఆయుబ్ను ఔట్ చేసి నాలుగో వికెట్కు 87 రన్స్ (48 బంతుల్లో) పార్ట్నర్షిప్ను బ్రేక్ చేసిన శివం దూబే భారత్ను మళ్లీ రేసులోకి తెచ్చాడు. బుమ్రా, సుందర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసినా.. నవాజ్ వెనక్కుతగ్గకుండా జోరు కొనసాగించాడు. 18 బంతుల్లో ఆ జట్టుకు 52 రన్స్ అవసరం అవగా.. 18 ఓవర్లో సమద్ (9) వికెట్ తీసిన సుందర్ 8 పరుగులు మాత్రమే ఇచ్చి మ్యాచ్ను మలుపు తిప్పాడు. లాస్ట్ ఓవర్లో 29 పరుగులు అవసరం అవగా.. ఓ ఫోర్, సిక్స్ కొట్టి ఆఖరి బాల్కు నవాజ్ ఔటవడంతో పాక్ రజతంతో సరిపెట్టుకుంది. కాగా, ఈ మ్యాచ్లోనూ ఇరుజట్ల ఆటగాళ్లు కరచాలనం చేసుకోలేదు.

## ఆరోగ్యం

### హెచ్. పైలోరీ నిర్మూలనతో
# గ్యాస్ట్రిక్ కేన్సర్‌కు బ్రేక్!

హెలికోబాక్టర్ పైలోరీ (హెచ్. పైలోరీ) ఇన్ఫెక్షన్‌ను తొలిదశలోనే గుర్తించి పూర్తిగా నిర్మూలించడం ద్వారా గ్యాస్ట్రిక్ కేన్సర్‌ను నివారించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నా రు. ఇందుకోసం విస్తృత స్థాయిలో పరీక్షలు నిర్వహించడం, సరైన యాంటీబయాటిక్ చికిత్స అందించడం, చికిత్స అనంతరం ఇన్ఫెక్షన్ పూర్తిగా తొలగిపోయిందో లేదో నిర్ధారించడం కీలకమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గ్యాస్ట్రిక్ కేన్సర్‌కు కేవలం అల్సర్ మాత్రమే కారణమనే పాత అవగాహనకు భిన్నంగా, హెచ్.పైలోరీ ఇన్ఫెక్షన్ దీర్ఘకాలం కొనసాగితే కడుపులో దీర్ఘకాలిక వాపు ఏర్పడి కేన్సర్ ప్రమాదాన్ని పెంచే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇన్ఫెక్షన్‌ను ముందుగానే గుర్తించి చికిత్స చేయడం కేన్సర్ నివారణలో ఒక ముఖ్యమైన వ్యూహంగా మారవచ్చని నోబెల్ బహుమతి గ్రహీత, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ బారీ మార్షల్ పేర్కొన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి.



**ముందస్తు పరీక్షలు, పూర్తిస్థాయి చికిత్స అవసరం...** కాలేయానికి తీవ్రమైన నష్టం కలగకముందే హెచ్. పైలోరీ ఇన్ఫెక్షన్‌ను గుర్తించడం అత్యంత ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. ఇన్ఫెక్షన్‌ను తొలిదశలోనే నిర్మూలిస్తే, చివరికి కేన్సర్‌కు దారితీసే పరిణామాలను అడ్డుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా గ్యాస్ట్రిక్ కేన్సర్ నివారణ కోసం హెచ్. పైలోరీకు సంబంధించిన స్క్రీన్ అండ్ ట్రీట్ కార్యక్రమాలపై దృష్టి పెరుగుతోంది. ఇన్ఫెక్షన్ ఉన్నవారిని గుర్తించి, వారికి సమర్థవంతమైన నిర్మూలన చికిత్స అందించడం ఈ విధానంలో ప్రధాన లక్ష్యం. అయితే, చికిత్స తర్వాత రోగి లక్షణాలు తగ్గడం మాత్రమే ఇన్ఫెక్షన్ పూర్తిగా తొలగిపోయిందనడానికి ఆధా రం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. చికిత్స విజయవంతమైందో లేదో నిర్ధారించేందుకు ఫాలోఅప్ పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

**యాంటీబయాటిక్ నిరోధకత పెద్ద సవాలు...** హెచ్. పైలోరీ చికిత్సలో యాంటీబయాటిక్ నిరోధకత పెరగడం ప్రస్తుతం ప్రధాన సవాలుగా మారుతోంది. ఒకే రకమైన యాంటీబయాటిక్స్‌ను పదే పదే ఉపయోగించడం వల్ల చికిత్స ప్రభావం తగ్గే అవకాశం ఉంది. అంతేకాకుండా వివిధ దేశాలు, ప్రాంతాల మధ్య బ్యాక్టీరియాలో మందుల నిరోధకత స్థాయిలు మారుతుండటంతో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా చికిత్సను నిర్ణయించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో యాంటీబయాటిక్స్‌ను బాధ్యతాయుతంగా వినియోగించడం, స్థానిక నిరోధకత నమూనాలను పరిగణనలోకి తీసుకుని చికిత్సను ఎంపిక చేయడం, చికిత్స అనంతరం ఇన్ఫెక్షన్ నిర్మూలనను నిర్ధారించడం కీలకమని అంతర్జాతీయ మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. మన దేశంలో హెచ్. పైలోరీ ఇన్ఫెక్షన్ విస్తృతంగా ఉండటంతో స్థానిక బ్యాక్టీరియా రకాలు, యాంటీబయాటిక్ నిరోధకతపై మరింత పరిశోధన అవసరమని నిపుణులు చెబుతున్నారు. అదే విధంగా, ప్రజలకు అందుబాటులో ఉండేలా సులభమైన, కచ్చితమైన పరీక్షా విధానాలను విస్తరించడం ద్వారా ముందస్తు గుర్తింపును పెంచవచ్చని సూచిస్తున్నారు. ఇన్ఫెక్షన్‌ను గుర్తించేందుకు నాన్–ఇన్వేసివ్ పరీక్షలు కూడా ఉపయోగపడుతున్నాయి. వీటిలో బ్రీత్ టెస్టులు రోగికి సులభంగా ఉండటంతో పాటు ప్రస్తుత హెచ్. పైలోరీ ఇన్ఫెక్షన్‌ను గుర్తించడంలో సహాయపడతాయి. గ్యాస్ట్రిక్ కేన్సర్ ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా ఆసియాలోని పలు ప్రాంతాల్లో, తీవ్రమైన ఆరోగ్య సమస్యగా మారుతున్న తరుణంలో, హెచ్. పైలోరీను ముందుగానే గుర్తించి నిర్మూలించడం అవసరం. దీనికి కేన్సర్ నివారణలో ప్రాధాన్యత పెరుగుతున్నది. హెచ్.పైలోరీ కడుపులో జీవించగలదని, అల్సర్లు, ఇతర ఉదర సంబంధిత వ్యాధుల్లో దాని పాత్ర ఉందని నిరూపించిన పరిశోధనలు వైద్య రంగంలో కీలకమైన మార్పులకు దారితీశాయి. డాక్టర్ బారీ మార్షల్‌కు నోబెల్ బహుమతి సంపాదించిపెట్టిన ఆ పరిశోధనలు, అల్సర్ల చికిత్సలో కేవలం యాసిడ్‌ను తగ్గించడం నుంచి ఇన్ఫెక్షన్‌కు మూలకారణమైన బ్యాక్టీరియాను నిర్మూలించే దిశగా వైద్య విధానాన్ని మార్చాయి.

## శీతాకాలానికి ముందే ఫ్లూ టీకా




శీతాకాలం ప్రారంభానికి ముందే ఫ్లూ (ఇన్ఫ్లుయెంజా) టీకా తీసుకోవాలని అమెరికా వైద్యనిపుణులు సూచిస్తున్నారు. సాధారణంగా శీతాకాలంలో ఫ్లూ వైరస్ వ్యాప్తి పెరిగే అవకాశం ఉండటంతో, అక్టోబర్‌లోనే టీకా తీసుకోవడం ద్వారా శరీరంలో రోగనిరోధక శక్తి అభివృద్ధి చెందేందుకు తగిన సమయం లభిస్తుంది. ఫ్లూ వల్ల జ్వరం, దగ్గు, గొంతునొప్పి, శరీర నొప్పులు, అలసట వంటి లక్షణాలు కనిపించవచ్చు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవారిలో తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉండవచ్చు. అందువల్ల వీరు వైద్యుల సలహామేరకు టీకా తీసుకోవడం ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. అదేవిధంగా, అవసరమైన వారికి కొవిడ్ 19, ఆర్ఎస్‌వి వంటి శ్వాసకోశ వైరస్‌ల నుంచి రక్షణ కల్పించే టీకాలు లేదా ఇతర నివారణ చర్యలను కొనసాగించాలని సూచిస్తున్నారు. టీకాలు తీసుకునే సమయం, అవసరం వ్యక్తి వయస్సు, ఆరోగ్య పరిస్థితి, స్థానిక మార్గదర్శకాలపై ఆధారపడి ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

## అమెరికాలో మీజిల్స్ కేసుల పెరుగుదల




అమెరికాలో మీజిల్స్(తట్టు) కేసులు పెరుగుతున్నాయి. గత నెలాఖరు నాటికి దేశవ్యాప్తంగా 3,659 మీజిల్స్ కేసులను అమెరికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సిడిసి) నిర్ధారించింది. ఈ వ్యాధికి సంబంధించి రెండు మరణాలున మోదైనట్టు కూడా సిడిసి తెలిపింది. మీజిల్స్ అత్యంత వేగంగా వ్యాపించే వైరల్ ఇన్ఫెక్షన్. సాధారణంగా జ్వరం, దగ్గు, ముక్కు కారడం, కళ్లలో ఎర్రదనం, అనంతరం శరీరంపై దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తాయి. టీకాలు తీసుకోని పిల్లలు, పెద్దలకు ఈ వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో న్యుమోనియా, మెదడువాపు వంటి తీవ్రమైన సమస్యలకు కూడా దారితీయవచ్చు. అయితే మీజిల్స్‌తో సంబంధం ఉన్న మరణాలను అధికారికంగా ఎలా లెక్కించాలి, ఏ మరణాలను మీజిల్స్ కారణంగా పరిగణించాలి అనే అంశంపై చర్చ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో వ్యాధి నియంత్రణకు టీకాలు వేయించుకోవడం, వ్యాధి లక్షణాలను ముందుగానే గుర్తించడం, ఇన్ఫెక్షన్ వ్యాప్తిని అరికట్టడం కీలకమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# బిజెపి ఏజెంట్ జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించాలి

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్‌రావు




**ప్రజాపక్షం/వరంగల్ :** ప్రజాస్వామ్య పరిరక్షణకు నిరంతరం పోరాడుదామని, బిజెపి ఏజెంట్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్‌రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు అన్నారు. వరంగల్ పోచమ్మ మైదాన్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ అధ్యక్షతన ఏ వన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఇండియా కూటమి పార్టీల సమావేశానికి తక్కళ్ళపల్లి శ్రీనివాస్‌రావు, కెఆర్.నాగరాజులు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ 7న వరంగల్ పోచంమైదన్ నుంచి వరంగల్ కాశీబుగ్గ అంబేద్కర్ విగ్రహం వరకు అఖిలపక్ష ఆధ్వర్యంలో తలపెట్టిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది వంటివని, ప్రజలు తమ ఓటు ద్వారా ఎన్నుకునే ప్రభుత్వాలే ప్రజాస్వామ్యానికి అసలైన ప్రతినిధున్నారు. అలాంటి పవిత్రమైన ఓటు హక్కు విషయంలో ఎలాంటి అనుమానాలు, అపోహలు, పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తినా వాటిని ఎన్నికల సంఘం బాధ్యతగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల వ్యవస్థపైనే ప్రజలకు అనుమానాలు కలిగే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. ఓటర్ల జాబితాలు, ఓటుహక్కు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాల్లో పూర్తి పారదర్శకత ఉండాలని, రాజకీయపార్టీలకు సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మేరా కార్పొరేషన్ చైర్మన్ వెంకట రాజ్యం, జిల్లా ఎస్‌సి సెల్ చైర్మన్ సిలువేరు శ్రీనివాస్, బిఎస్‌పి వరంగల్ జిల్లా ప్రెసిడెంట్ వనం మహేందర్, సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్‌మియా, ఎంసిపిఐ జిల్లా సెక్రెటరీ మాలోత్ సాగర్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ లీడర్ హకీమ్ నవీద్‌తో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమమే ఏకైక లక్ష్యం

### టిఎమ్‌యు, ఇయు రాష్ట్ర నాయకులు థామస్‌రెడ్డి, బాబు



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** ఆర్‌టిసి కార్మికుల హక్కుల సాధన, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఇయు, టిఎంయు ఎంఎస్‌యు ఐక్య కూటమి అభ్యర్థులను రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం యాదగిరిగుట్ట ఆర్‌టిసి డిపో ప్రాంగణంలో నల్లమాస జగదీశ్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల ప్రచార సభకు ముఖ్య అతిథులుగా ఎంప్లాయిస్ యూనియన్ ఇయు రాష్ట్ర అధ్యక్షుడు బాబు, తెలంగాణ మజ్దూర్ యూనియన్ టిఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా గుర్తింపు యూనియన్ లేకపోవడంతో ఆర్‌టిసి కార్మికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో కార్మికుల యోగక్షేమాలను పట్టించుకోని అశ్వద్ధామ రెడ్డి, ఇప్పుడు టిఎంయు యూనియన్ను అద్దెకు తెచ్చుకుని, కాంగ్రెస్ అనుకూల సంఘాలతో జతకట్టి మళ్లీ మోసం చేసేందుకు కల్లబొల్లి మాటలతో వస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో 55 రోజుల సమ్మె సందర్భంగా ఆయన వ్యవహార శైలితో 36 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. అధికార పార్టీ అండదండలతో గెలిచేందుకు డబ్బులు, బిర్యానీ పొట్లాలతో వస్తే కార్మికులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికుల కలలు సాకారం కావాలంటే ఐక్య కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రనాయకులు గోదా శ్రీరాములు, కళ్లెం కృష్ణ, ఇయు రాష్ట్ర కార్యదర్శులు కె.ఎస్.రెడ్డి, మంగ, టిఎంయు కార్యదర్శులు నరేందర్, జల నరసింహ, ఇయు అధ్యక్ష,కార్యదర్శులు జమాల్ గౌడ్, ఎన్ఆర్ఎస్.రాజు, టిఎంయు రీజినల్ కార్యదర్శి ఎస్.ఎస్.గౌడ్, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోలగాని సత్యనారాయణగౌడ్, ఎండి.ఇమ్రాన్, ఇయు గౌరవ అధ్యక్షులు బబ్బూరి శ్రీధర్‌గౌడ్, ఇయు డిపో అధ్యక్ష, కార్యదర్శులు వేముల సోమేష్, సోకం వెంకటయ్య, టిఎంయు డిపో అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్ మిట్ట, రమేష్ గౌడ్, సంతోషి, రాజేశ్వరి, సురేందర్, మల్లేశం, శ్రీను, వెంకటేశ్వర్లు, నరసింహపాల్గొన్నారు.

# ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడమే లక్ష్యం

### గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ కూటమిని గెలిపించండి
### ప్రచార సభల్లో ఎఐటియుసి నాయకులు







**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఈనెల 9న జరిగే ఆర్‌టిసి కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ కూటమిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బస్టాండ్ సమీపంలో డిపో కార్మికులను ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ కమిటీ కార్యదర్శి రాజన్నతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆర్‌సిని ప్రభుత్వంలో విలీనం చేయడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. డ్రైవర్లు కండక్టర్ల సంక్షేమానికి భద్రత కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న బకాయిలని సాధిస్తామన్నారు. 2025 వేతన సవరణను పే స్కేలుగా మార్చడం, గ్యారేజ్ హక్కులు సాధించడం, వర్క్ షాప్ కార్మికులకు పని గంటల రేటును విడుదల చేయడం, మహిళ కండక్టర్లకు పిల్లల సంరక్షణ కొరకు సెలవులు ఇప్పించడం తమ లక్ష్యమన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికలు ఆర్‌టిసి కార్మికుల జీవన్మరణ సమస్య అన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మొట పలుకుల రమేష్, క్యాత రాజు సతీష్, బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ జి.సుధాకర్‌రెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్, సిపిఐ 24వ వార్డ్ కౌన్సిలర్ వేముల జ్యోతి శ్రీకాంత్, నూకల చంద్రమౌళి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జోసెఫ్, కెటిపిపి రీజనల్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కోలా శ్యామ్, గోపిరెడ్డి కిరణ్, ధర్మారావు పాల్గొన్నారు.

**కరీంనగర్ :** కరీంనగర్ 1,2 డిపోల్లో ఎంప్లాయిస్ యూనియన్(ఎఐటియుసి)ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య, ఆర్‌టిసి రీజినల్ కార్యదర్శి కాళిదాసు, కరీంనగర్ రీజియన్ కార్యదర్శి కొమురయ్య, మహేష్ వెంకట్‌గౌడ్, టిఎంయు నాయకులు ఎంపి.రెడ్డి, ఎవి.రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

**తొర్రూరు :** కార్మికుల హక్కుల కోసం ఎర్రజెండా బాటలో నడవాలని, ఆర్‌టిసి కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ కూటమిని గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ మాజీ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వర్‌రావు కోరారు. ఆర్‌టిసిలో జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో తొర్రూరు డిపో వద్ద ఎఐటియుసి అనుబంధ ఎంప్లాయిస్ యూనియన్(ఇయు)కు మద్దతుగా ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఓమ బిక్షపతి, సిపిఐ తొర్రూరు మండల కార్యదర్శి బందు మహేందర్, మండల అధ్యక్షులు ఘనపురం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

**ఖమ్మం :** ఆర్‌టిసి కార్మికుల సంక్షేమాన్ని కాపాడాల్సిన నాయకులే తమ స్వార్థ ప్రయోజనాల కోసం కార్మిక వర్గాన్ని మోసం చేసి అన్యాయం చేశారని ఎంప్లాయీస్ యూనియన్ (ఇయు) ఖమ్మం రీజినల్ గౌరవాధ్యక్షులు బిజి క్లెమెంట్ ధ్వజమెత్తారు. ఖమ్మంలో జరిగిన రీజినల్ డిపో కార్యదర్శుల కార్మిక సమావేశం ఆదివారం ఎఐటియుసి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు రావి శివరామకృష్ణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొమ్మిదిన జరిగే కార్మిక సంఘాల ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్, టిఎంయు, ఎన్ఎంయు కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, కార్యనిర్వాహక అధ్యక్షులు గాదె లక్ష్మినారాయణ, ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు, జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి రమేష్, బొడా వీరన్న, కార్యదర్శి నకిరికంటి కృష్ణ, డిపో కార్యదర్శి బుచ్చిబాబు, ప్రచార కార్యదర్శి జేకే, కోశాధికారి లాజర్, వల్లపు వెంకన్న పాల్గొన్నారు.

**గజ్వేల్ :** ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంప్లాయిస్ యూనియన్ కూటమికి అండగా నిలుద్దామని రీజియన్ గౌరవ అధ్యక్షులు, సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ పేర్కొన్నారు. తొమ్మిద జరిగే ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ కూటమి అభ్యర్థులకు మద్దతుగా జిపిపి డిపో వద్ద ఆయన ప్రచారం చేశారు. సంస్థ పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, సంక్షేమ కోసం ఎంప్లాయిస్ యూనియన్ గెలవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు బట్టు దయానంద రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ, ఆర్‌టసి ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యకుడు రవీందర్‌రెడ్డి, డిపో కార్యదర్శి జైపాల్, నేతలు వెంకటయ్య, అప్పారావు, రాజయ్య, యాదగిరి, సంజీవులు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఆర్‌టిసి కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ కూటమిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎఐటియుసి మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివిఎస్ బోస్ కోరారు. ఆదివారం ఎంప్లాయిస్ యూనియన్‌కు మద్దతుగా ఆయన కుషాయిగూడ, ఇసిఐఎల్ బస్టాప్‌ల వద్ద విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ధర్మేంద్ర, నాయకులు నగేష్ పటేల్, రీజనల్ కార్యదర్శి శ్రీనివాస్, డిపో చైర్మన్ రత్నయ్య, సహాయ కార్యదర్శి సురేఖ, రాఘువులు పాల్గొన్నారు.








# నేటి నుంచి బార్ అండ్ రెస్టారెంట్ల బంద్

- ఫీజుల భారం పెంపుపై బార్ యజమానుల ఆగ్రహం
- ఎక్సైజ్ కమిషనరేట్ ముట్టడికి పిలుపు
- ప్రివిలేజ్ ఫీజు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బార్ అండ్ రెస్టారెంట్లపై ఫీజుల భారం మరింత పెంచే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ యజమానులు ఆందోళనకు సిద్ధమయ్యారు. ప్రివిలేజ్ ఫీజు, లైసెన్స్ ఫీజు పెంపు తదితర నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 5, సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా బార్ అండ్ రెస్టారెంట్లను మూసివేయాలని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ పిలుపునిచ్చినట్లు అధ్యక్షులు దామోదర్‌గౌడ్ తెలిపారు. రాష్ట్రంలో సుమారు 1,200 బార్ అండ్ రెస్టారెంట్లు ఈ బంద్‌లో పాల్గొనే అవకాశం ఉందని అసోసియేషన్ నేతలు వెల్లడించారు. బార్ యజమానుల ప్రకారం.. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయాలతో ఇప్పటికే ఉన్న ఆర్థిక భారం మరింత పెరగనుంది. ముఖ్యంగా ప్రివిలేజ్ ఫీజు పేరుతో అదనంగా 8 శాతం నుంచి 20 శాతం వరకు భారం పడనుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో బార్‌పై సుమారు రూ.30 లక్షల వరకు అదనపు భారం పడే అవకాశం ఉందని అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్ పేర్కొన్నారు.

**రూ.40 లక్షల లైసెన్స్ ఫీజు రూ.44 లక్షలకు..**
ఇప్పటివరకు రూ.40 లక్షలుగా ఉన్న లైసెన్స్ ఫీజును రూ.44 లక్షలకు పెంచే నిర్ణయం కూడా బార్ యజమానుల్లో ఆందోళనకు కారణమైంది. ఇప్పటికే ఒక్కో బార్ నుంచి ఏడాదికి సుమారు రూ.33 లక్షల నుంచి రూ.56 లక్షల వరకు వివిధ రూపాల్లో చెల్లింపులు చేస్తున్నామని వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా ప్రివిలేజ్ ఫీజు విధించడం వల్ల వ్యాపార నిర్వహణ మరింత భారంగా మారుతుందని వాపోతున్నారు.

**బెల్ట్ షాపులతోనూ నష్టమే...**
ఫీజుల పెంపుతో పాటు బెల్ట్ షాపుల నిర్వహణ, వైన్ షాపుల్లో పర్మిట్ రూమ్‌లకు అనుమతులు వంటి అంశాలు కూడా తమ వ్యాపారాలను దెబ్బ తీస్తున్నాయని బార్ యజమానులు ఆరోపిస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్ వ్యాపారాలపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక కుటుంబాలు జీవిస్తున్నాయని, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఉపాధిపై ప్రభావం చూపే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.

**నేడు అబ్కారీ భవన్ ముట్టడి..**
బంద్‌తో పాటు తమ డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్ నాంపల్లిలోని ఎక్సైజ్ కమిషనరేట్, అబ్కారీ భవన్ వద్ద ధర్నా, ముట్టడి కార్యక్రమం చేపట్టాలని అసోసియేషన్ నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా బార్ యజమానులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్‌గౌడ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే నిరాహార దీక్షకు దిగుతామని నాయకులు హెచ్చరించారు.

**ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూపులు..**
ప్రభుత్వానికి ఎక్సైజ్ శాఖ ద్వారా భారీగా ఆదాయం సమకూర్చుతున్న బార్ యజమానులపై వరుసగా అదనపు ఆర్థిక భారం మోపడం సరికాదని అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్ గౌడ్ పేర్కొన్నారు. పెంచిన లైసెన్స్ ఫీజు, ప్రతిపాదిత ప్రివిలేజ్ ఫీజు నిర్ణయాలను పునఃపరిశీలించి ఉపసంహరించుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకు బంద్ కొనసాగించే అంశాన్ని కూడా పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు. మొత్తంగా.. ఫీజుల పెంపుపై బార్ యజమానులు చేపట్టిన ఈ నిరసనతో సోమవారం నుంచి రాష్ట్రంలోని బార్ అండ్ రెస్టారెంట్ వ్యాపారాలు నిలిచిపోనున్నాయి. ప్రభుత్వం–బార్ యజమానుల మధ్య చర్చలు జరిగి సమస్యకు పరిష్కారం లభిస్తుందా, లేక బంద్ మరింతకాలం కొనసాగుతుందా అన్నది కీలకంగా మారింది.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు చివరి అవకాశం

- రూ.లక్ష చెల్లింపునకు అక్టోబర్ 9 వరకు గడువు పొడిగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇందిరమ్మ అందుబాటు గృహ నిర్మాణ పథకం కింద హైదరాబాద్ క్యూర్ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంపికైన లబ్ధిదారులకు తెలంగాణ హౌసింగ్ బోర్డు కీలక ప్రకటన చేసింది. ప్రొవిజనల్ కేటాయింపు పొందిన లబ్ధిదారులు చెల్లించాల్సిన రూ.1 లక్ష మొత్తాన్ని చెల్లించేందుకు గడువును ఈ నెల 9వ తేదీ వరకు పొడిగించింది. ఇదే చివరి గడువని, అనంతరం ఎలాంటి పొడిగింపు ఉండదని స్పష్టం చేసింది. డ్రా ఆఫ్ లాట్స్ ద్వారా ఎంపికైన దరఖాస్తుదారులకు నిర్వహించిన పోస్ట్ వెరిఫికేషన్‌లో నివాస అర్హత, ఆదాయ పరిమితి, కుటుంబానికి ఇప్పటికే ఇల్లు లేదా ప్లాట్ ఉందా, ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు నిబంధన, సమర్పించిన పత్రాలను పరిశీలించారు. అర్హత పొందిన వారికి ప్రొవిజనల్ అలాట్‌మెంట్ లెటర్లు జారీ చేశారు. అక్టోబర్ 4 నాటికి మొత్తం 5,501 ప్రొవిజనల్ అలాట్‌మెంట్ లెటర్లు జారీ చేయగా, అందులో 3,271 మంది లబ్ధిదారులు రూ.1 లక్ష చెల్లింపులు పూర్తి చేశారు. ఇది మొత్తం కేటాయింపుల్లో 59.46 శాతంగా నమోదైంది. కొన్ని ప్రాంతాల్లో చెల్లింపుల శాతం 70 శాతానికి పైగా ఉండగా, కూకట్‌పల్లి కెపిహెచ్‌బి కాలనీలో అత్యధికంగా 81.05 శాతం చెల్లింపులు నమోదయ్యాయి. చెల్లింపుల్లో ముందున్న ప్రాంతాల్లో కూకట్‌పల్లి కెపిహెచ్‌బి 81.05 శాతం, శేరిలింగంపల్లి (రాయదుర్గం) 74.94 శాతం, కుత్బుల్లాపూర్ (గాజులరామారం) 73.87 శాతం, నాంపల్లి (నీలోఫర్ ఆస్పత్రి సమీపం) 73.83 శాతం చెల్లింపులతో నిలిచాయి. మరోవైపు ఖైరతాబాద్ ఎమ్మెల్యే కాలనీ సమీప ప్రాంతంలో 17.16 శాతం మాత్రమే చెల్లింపులు నమోదయ్యాయి. ఇప్పటివరకు రూ.లక్ష చెల్లించని ఎంపికైన లబ్ధిదారులు తెలంగాణ హౌసింగ్ బోర్డు సూచించిన అధికారిక ఖాతా లేదా నిర్దేశిత చెల్లింపు విధానం ద్వారా అక్టోబర్ 9లోగా తప్పనిసరిగా చెల్లించాలని అధికారులు సూచించారు. గడువులోగా చెల్లింపు జరగకపోతే ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే ప్రొవిజనల్ కేటాయింపు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. రద్దు అయ్యే ఫ్లాట్లను అమలులో ఉన్న నిబంధనల ప్రకారం అర్హులైన ఇతర దరఖాస్తుదారులకు లేదా వెయిటింగ్ లిస్టులో ఉన్న వారికి కేటాయించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ప్రస్తుతం కేటాయింపులు పొందని సుమారు 35 వేల మంది అర్హులైన దరఖాస్తుదారులను భవిష్యత్ డ్రా ఆఫ్ లాట్స్‌లో అందుబాటులో ఉన్న ఫ్లాట్ల ఆధారంగా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. పథకం, కేటాయింపులు, చెల్లింపుల వివరాల కోసం లబ్ధిదారులు తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని లేదా 04024603572 నెంబర్‌లో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.



ముంబయిలోని తెలంగాణ ఉద్యమకారులతో సమావేశమయ్యేందుకు తెలంగాణ ప్రభుత్వ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఆదివారం ముంబయికి వెళ్లింది. కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, మోతె శోభన్‌రెడ్డిలను ముంబయిలోని తెలంగాణ ఉద్యమకారులు ఘన స్వాగతం పలికారు.

# రెండు డిఎలు ఇవ్వడంపై సిఎంకు ధన్యవాదాలు

- మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు రెండు డిఎలను విడుదల చేస్తూ నిర్ణయం తీసుకున్నందుకు మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ (ఐఎన్‌టియుసి) తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం జిహెచ్‌ఎంసిలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, తాగునీటి కొరత, విద్యుత్ వినియోగం పెరుగుదల వంటి అనేక ఆర్థిక, పరిపాలనా సవాళ్లు ఉన్నప్పటికీ, ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సిఎం ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్ర ఖజానాపై ఏటా రూ.2,500 కోట్లదనంగా భారం పడుతున్నప్పటికీ, డిఎలు విడుదల చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అదే సమయంలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిఎంకు ఆదిల్ షరీఫ్ విజ్ఞప్తి చేశారు. నూతన వేతన సవరణ కమిషన్ (పిఆర్‌సి) నివేదికను త్వరగా విడుదల చేసి, కొత్త పిఆర్‌సి స్కేళ్లను అమలు చేయాలని కోరారు. ఉద్యోగులు, పింఛనుదారులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్)ను సమర్థవంతంగా పునరుద్ధరించాలని, ఇతర కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల తరహాలోనే తెలంగాణలోనూ సిపిఎస్, ఎన్‌పిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జిహెచ్‌ఎంసి, ఎంఎంసి, సిఎంసిల పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ ఉద్యోగులకు రూ.15 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాన్ని నెలకు రూ.26,000కు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ.వి.ఎస్. గాంధీ, కార్యదర్శులు జి. శివకుమార్, ఖాజా పాషా, నాయకులు పి.ఎస్. ఉమేష్ బాబు, సయ్యద్ ఇస్లాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఒబిసి కాలమ్ చేర్చే వరకు కేంద్రంపై పోరాటం

- బిసి కులగణనకు ఈనెల 8న ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం: జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతి జనగణనలో ఓబిసి కాలమ్ చేర్చాలనే ప్రధాన డిమాండ్‌తో దేశవ్యాప్తంగా బిసిలు రోడ్డెక్కి ఉద్యమిస్తుంటే కేంద్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఓబిసి కాలమ్ చేర్చే వరకు కేంద్రంపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని బిసి భవన్‌లో ఆదివారం బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేషాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాజుల ముఖ్య అతిథిగా హాజరై, ఈనెల 8న ఢిల్లీలో జరిగే జాతీయ అఖిలపక్ష సమావేశానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిసిల లెక్కలు తేలితే తమకు భవిష్యత్తులో రాజకీయంగా నష్టం జరుగుతుందని కుట్రతోనే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రస్తుతం జరిగే జనగణనలో ఓబిసి కాలం చేర్చడం లేదని ఆరోపించారు. కులగణన చేయకుండా బిజెపి బిసి వ్యతిరేక పార్టీగా మిగిలిపోతే, బిసి కులగణన చేయాలని డిమాండ్ చేయని పార్టీలు కూడా బిసి ద్రోహుల పార్టీలుగా చరిత్రలో మిగిలిపోతాయని ఆయన హెచ్చరించారు. జాతీయస్థాయిలో బిసి ఉద్యమాన్ని ఇంకా ఉధృతం చేయడానికి ఓబిసి కాలమ్ డిమాండ్‌పై దేశంలోని అన్ని రాజకీయ పార్టీల వైఖరిని తెలుసుకోవడానికి ఈనెల 8న ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జాతీయ అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఇప్పటి వరకు జరిగిన ఉద్యమంపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకుని, అన్ని రాజకీయ పార్టీల సలహాలు సూచనలతో ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బిసి విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ సంఘని మల్లేశ్వర్, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మా, జాజుల లింగం గౌడ్, వల్లబోజు నరసింహ చారి, ఇంద్రం రజక, బండిగారి రాజు గౌడ్, సంపత్ పాల్గొన్నారు.

# నకిలీ పత్రాలతో 8 జిఎస్‌టి రిజిస్ట్రేషన్లు

- ఒకే ఇంటి అడ్రస్‌తో మోసం..
- రూ.2.08 కోట్ల సరుకులపై ఇ-వే బిల్లులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఒకే ఇంటి చిరునామాను ప్రధాన వ్యాపార స్థలంగా చూపిస్తూ నకిలీ అద్దె ఒప్పందాలు, సమ్మతి పత్రాలతో ఏకంగా 8 జిఎస్‌టి రిజిస్ట్రేషన్లు పొందిన వ్యవహారం హైదరాబాద్‌లో వెలుగుచూసింది. అంతేకాకుండా, వాటిలో ఒక జిఎస్‌టి రిజిస్ట్రేషన్‌ను ఉపయోగించి వస్త్ర వ్యాపారం పేరుతో రూ.2.08 కోట్ల విలువైన ఎంఎస్ సెక్షన్లు, అల్యూమినియం స్క్రాప్, టిఎంటి బార్లకు ఈవే బిల్లులు రూపొందించినట్లు వాణిజ్య పన్నుల శాఖ గుర్తించింది. ఈ వ్యవహారంపై వాణిజ్య పన్నుల శాఖ ఫిర్యాదు మేరకు సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ (ఎస్‌టి) చిత్తేశ్వర్ సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బోరబండ సర్కిల్ పరిధిలోని అల్లాపూర్, వివేకానందనగర్‌లోని గ్రౌండ్ ఫ్లోర్, 1420 677/391/ఎ చిరునామాను పలువురు వ్యక్తులు తమ ప్రధాన వ్యాపార స్థలంగా చూపిస్తూ జిఎవటి రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గత నెల 17న అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయగా, ఆ ఆస్తి నక్క యశోదకు చెందినదిగా గుర్తించారు. అయితే తన ఇంటి పేరుతో ఎలాంటి అద్దె ఒప్పందం, సమ్మతి పత్రం లేదా ఎన్‌ఒసి తాను ఎవరికీ ఇవ్వలేదని ఆమె అధికారులకు వాంగ్మూలం ఇచ్చారు. తన పేరుతో సమర్పించిన అద్దె ఒప్పందాలు, చిరునామా ధ్రువీకరణ పత్రాలు నకిలీవని స్పష్టం చేశారు. ఒకే చిరునామా నుంచి వేర్వేరు వ్యాపార, చట్టపరమైన పేర్లతో 8 జిఎస్‌టి రిజిస్ట్రేషన్ దరఖాస్తులు దాఖలైనట్లు అధికారులు గుర్తించారు. వీటన్నింటిలోనూ ఒకే నకిలీ అద్దె ఒప్పందం, చిరునామా ధ్రువీకరణ పత్రాలను ఉపయోగించడంతో పాటు, వాటిని మహమ్మద్ రియాజ్ ధ్రువీకరించినట్లు తేలింది. ఆ దరఖాస్తుల్లో ఉపయోగించిన మొబైల్ నంబర్లు, ఈమెయిల్ ఐడిలు కూడా పరస్పరం అనుసంధానమై ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇక్కడితో వ్యవహారం ఆగలేదు. అదే మొబైల్ నంబర్లు, ఈమెయిల్ ఐడిలు హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో మరో ఆరు జీఎస్టీ నంబర్లతో అనుసంధానమై ఉన్నట్లు వాణిజ్య పన్నుల శాఖ గుర్తించింది. దీంతో ఇది ఒకే చిరునామాకు పరిమితమైన వ్యవహారం కాకుండా అంతర్రాష్ట్ర స్థాయిలో నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్లు పొందుతున్న ముఠా వ్యవహారమై ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**వస్త్ర వ్యాపారం పేరుతో ఇనుము, స్క్రాప్ వ్యాపారం..**
ఈ కేసులో కీలకంగా మారినజిఎస్ టిన్ 36సియుజిపిడి0673జె1జెడ్ఎం – 'సింగ్ ట్రేడర్స్' పేరుతో రిజిస్ట్రేషన్ పొందారు. గార్మెంట్స్ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు జిఎస్‌టి రిజిస్ట్రేషన్‌లో పేర్కొన్నప్పటికీ, అదే సంస్థ పేరుతో ఎంఎస్ సెక్షన్లు, అల్యూమినియం స్క్రాప్, టీఎంటీ బార్ల సరఫరాకు ఈవే బిల్లులు రూపొందించినట్లు అధికారులు గుర్తించారు. ఈ లావాదేవీల మొత్తం అంచనా విలువ రూ.2,08,24,880 కాగా, పన్ను విలువ రూ.37,48,478గా ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సరుకులు హైదరాబాద్‌కు చెందిన 'వైబర్ ట్రేడర్స్' సరఫరా చేసినట్లు ఈవే బిల్లుల ద్వారా గుర్తించారు.




# 17న సామూహిక నిరాహారదీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యారంగంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యాపారీకరణ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 17న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయిలో సామూహిక నిరాహారదీక్ష నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) వెల్లడించింది. టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర 7వ ద్వైవార్షిక మహాసభలను డిసెంబర్ 26,27,28 తేదీల్లో భద్రాద్రి జిల్లా కొత్తగూడెం నగరంలో నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావరవి అధ్యతన హైదరాబాద్‌లోని సంఘ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ దుర్గా భవాని, ఎం రాజశేఖర్ రెడ్డి, కోశాధికారి టి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు శాంతకుమారి, సమ్మారావు, సత్యానంద్‌తో పాటు 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చావ రవి మాట్లాడుతూ నాణ్యమైన విద్య పేరుతో ప్రభుత్వ పాఠశాలలను అందుబాటులో లేకుండా చేయడం సమంజసం కాదన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం పాఠశాలలు అందుబాటులో ఉండాలని, అందరికీ నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని హాస్పిటల్స్‌లో హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

# మెదక్ జిల్లా తూప్రాన్‌లో శ్వేత విప్లవానికి నాంది

- 400 కోట్లతో అమూల్ అత్యాధునిక డెయిరీ ప్లాంట్
- రైతులకు అదనపు ఆదాయం.. మహిళలు, యువతకు ఉపాధి
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి



**ప్రజాపక్షం/మెదక్:** సహకార వ్యవస్థతోనే రైతుల ఆర్థిక అభ్యున్నతి సాధ్యమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో సుమారు రూ.400 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న అమూల్ అత్యాధునిక డెయిరీ ప్లాంట్‌కు మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ,మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు, సాబర్ డైరీ చైర్మన్ శ్యామ్ లాల్ జి పటేల్, కో ఆపరేటివ్ కమిషనర్ రాహుల్ రాజ్, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ 18 నెలల్లో ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేసి, పాడి రైతులకు అదనపు ఆదాయం కల్పించడంతో పాటు స్థానిక మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. రైతులు ఉత్పత్తి చేసే పాలకు విలువ జోడించి పాలు, పెరుగు, మజ్జిగ, లస్సీ, పన్నీర్, ఐస్‌క్రీమ్, నెయ్యి తదితర ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా రైతులకు మెరుగైన ధర లభిస్తుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రైతులు సహకార సంఘాలుగా ఏర్పడి సమష్టిగా పనిచేస్తే దళారుల దోపిడీకి అడ్డుకట్ట వేయడంతోపాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని అన్నారు. దేశవ్యాప్తంగా శ్వేత విప్లవం 2.0లో భాగంగా 2029 నాటికి 75 వేల కొత్త పాడి సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ అమూల్ ప్లాంట్ ద్వారా పాఠశాల విద్యార్థులకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద నాణ్యమైన పాలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ డెయిరీ రంగం గ్రామీణ ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తుందని, ప్లాంట్‌తో స్థానిక యువతకు ఉద్యోగాలు, రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. రఘునందన్‌రావు మాట్లాడుతూ మెదక్‌ను 'మెతుకు సీమ'గా పేర్కొంటూ ఇక్కడి రైతుల ఆర్థికాభివృద్ధి కోసం పాడి పరిశ్రమను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అమూల్ ప్రతినిధులను సంప్రదించి తూప్రాన్‌లో ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేసినట్లు తెలిపారు. వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను రైతులకు అదనపు ఆదాయ వనరుగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు, బీజేపీ నేతలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌పై ఆరోపణలు నిరాధారం




- అవినీతి, కుమ్మక్కుకు తావులేదు..
- ఆధారాలుంటే సమర్పించండి
- జైళ్ల శాఖ స్పష్టీకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చంచల్‌గూడ కేంద్ర కారాగార సూపరింటెండెంట్‌పై వస్తున్న ఆరోపణలను తెలంగాణ జైళ్ల శాఖ తీవ్రంగా ఖండించింది. రౌడీషీటర్‌కు బెయిల్ ఇప్పించేందుకు లంచం ఇచ్చారని, అనంతరం దాడులకు ప్రణాళిక రచించారంటూ వస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. సూపరింటెండెంట్‌పై చేసిన ఆరోపణలు నిరాధారమైనవి, అసత్యమైనవని పేర్కొంది. హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసీ చంచల్‌గూడ సూపరింటెండెంట్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో చేసిన ప్రకటనకు స్పందిస్తూ జైళ్ల శాఖ ఈ వివరణ ఇచ్చింది. అవినీతి, కుమ్మక్కు లేదా ఇతర అక్రమాలకు పాల్పడినట్లు నిర్దిష్ట ఆధారాలు ఉంటే సంబంధిత అధికారి వాటిని సమర్పించవచ్చని తెలిపింది.ఖైదీల ప్రవేశం, అదుపు, తరలింపు, విడుదల తదితర అంశాల్లో జైళ్ల శాఖ చట్టాలు, జైలు నిబంధనలు, నిర్దేశిత విధానాలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకుంటుందని అధికారులు తెలిపారు. జైలు నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, నిబంధనల అమలుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. జైలు ప్రాంగణంలో ఖైదీల అనధికారిక సమావేశాలు లేదా కలయికలకు ఎలాంటి అవకాశం లేదని తెలిపారు. ఖైదీల భద్రతా వర్గీకరణ, సంస్థాగత అవసరాలు, జైలు నిబంధనలకు అనుగుణంగా వారిని వేర్వేరుగా ఉంచి నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.జైలు ప్రాంగణంలో నేర కార్యకలాపాలు, బెదిరింపులు, అక్రమ కార్యకలాపాలు లేదా జైలు సౌకర్యాలను దుర్వినియోగం చేసే ప్రయత్నాలపై అధికారులు అప్రమత్తంగా ఉంటారని జైళ్ల శాఖ వెల్లడించింది. జైలు నిబంధనలను ఉల్లంఘించి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు సహకరించినట్లు తేలితే ఖైదీలు లేదా సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. జైలు సౌకర్యాలను అక్రమ కార్యకలాపాలకు ఉపయోగించుకునే అవకాశం ఎవరికీ లేదని శాఖ పునరుద్ఘాటించింది. ఖైదీలు, జైలు సిబ్బంది భద్రతతో పాటు జైలు పరిపాలనలో పారదర్శకత, భద్రత, జవాబుదారీతనాన్ని కాపాడేందుకు నిరంతరం చర్యలు కొనసాగిస్తామని తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ రేంజ్ జైళ్ల ఉపశాఖాధికారి డాక్టర్ డి. శ్రీనివాసులు ప్రకటన విడుదల చేశారు.

# హైదరాబాద్‌లో 'ఫామ్-7' కలకలం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)2026 ప్రక్రియలో భారీగా ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. వివిధ నియోజకవర్గాల్లో ఓటర్ల పేర్లను తొలగించాలని కోరుతూ ముందస్తుగా ప్రింట్ చేసిన 'ఫామ్7' దరఖాస్తులు ప్రత్యక్షం కావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముషీరాబాద్‌తో ప్రారంభమైన ఈ వ్యవహారం, తాజాగా బహదూర్‌పురా, గోషామహల్ నియోజకవర్గాలకు పాకింది. హైదరాబాద్ పరిధిలోని రెండు వేర్వేరు ఘటనల్లో ముందుగానే ఓటర్ల వివరాలు ముద్రించిన ఫామ్ 7 పత్రాలు బయటపడటంతో రాజకీయవర్గాల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ముషీరాబాద్‌లో తొలి ఘటన**
ఈ వ్యవహారంలో తొలి ఘటన అక్టోబర్ 1న ముషీరాబాద్ నియోజకవర్గంలో వెలుగులోకి వచ్చింది. అక్కడ కొంతమంది ఓటర్ల పేర్లను తొలగించాలని కోరుతూ ముందుగానే ప్రింట్ చేసిన ఫామ్7 దరఖాస్తులు గుర్తించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ దరఖాస్తుల్లో తొలగించాలని కోరుతున్న ఓటర్ల పేర్లు, చిరునామా వివరాలు ముందుగానే ముద్రించి ఉండగా, దరఖాస్తుదారుడి వివరాల కోసం కేటాయించిన స్థానం ఖాళీగా ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ) విచారణలో భాగంగా సంబంధిత ఓటర్ల కుటుంబ సభ్యులను సంప్రదించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. ముషీరాబాద్ ఘటనలో మొత్తం 31 మంది ఓటర్ల పేర్ల తొలగింపునకు సంబంధించి ప్రింటెడ్ ఫామ్7 దరఖాస్తులు సిద్ధం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ దరఖాస్తులు అధికారికంగా ఎన్నికల కమిషన్ యాప్‌లో నమోదు కాలేదని, వాటిపై బిఎల్ఓ సంతకాలు కూడా లేవని పేర్కొంటున్నారు.

**బాహదూర్‌పురాలో మరో ఘటన..** ముషీరాబాద్ ఘటన తర్వాత తాజాగా బాహదూర్పురా నియోజకవర్గంలోనూ ఇలాంటి ప్రింటెడ్ ఫామ్7 దరఖాస్తు బయటపడింది. టిపిసిసి ఎన్నికల విభాగం సేకరించిన ఈ ఫామ్‌లో తొలగించాలని కోరుతున్న ఓటరు పేరు, చిరునామా వివరాలు ముందుగానే ప్రింట్ చేసి ఉన్నాయి. అయితే ఈ దరఖాస్తులో అభ్యంతరం వ్యక్తం చేస్తున్న దరఖాస్తుదారుడి పేరు, వివరాలు నమోదు చేయాల్సిన స్థానం ఖాళీగా ఉంది. బాహదూర్‌పురాలో బయటపడిన ఈ ఘటన ముషీరాబాద్ ఘటనకు భిన్నమైనదని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

**గోషామహల్‌లోనూ గుర్తింపు..** బాహదూర్‌పురా ఘటన తర్వాత గోషామహల్ నియోజకవర్గంలో కూడా ఇలాంటి ప్రింటెడ్ ఫామ్7 పత్రాలు కనిపించినట్లు సమాచారం. దీంతో ఈ దరఖాస్తులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, ఎవరు ముద్రిస్తున్నారు, వీటిని ఎవరు పంపిణీ చేస్తున్నారు అనే ప్రశ్నలు రాజకీయ పార్టీల్లో చర్చకు దారితీశాయి.

**ఫామ్–7 దరఖాస్తులపై వివాదం..**ఓటరు పేరును తొలగించేందుకు మాత్రమే ఫామ్7 ఉపయోగిస్తారు. నకిలీ ఓటు, డూప్లికేట్ ఓటు, ఓటరు మరణం లేదా సంబంధిత చిరునామాలో నివసించకపోవడం వంటి కారణాలతో అభ్యంతరాలు నమోదు చేయవచ్చు. అయితే అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి నిర్ధారించిన తర్వాత మాత్రమే ఓటరు పేరును జాబితా నుంచి తొలగిస్తారు. సాధారణంగా బిఎల్‌ఓలకు అందే ఫామ్7 దరఖాస్తులు దరఖాస్తుదారుల వివరాలతో నింపి ఉంటాయి. కానీ తాజాగా వెలుగులోకి వచ్చిన పత్రాల్లో తొలగించాల్సిన ఓటర్ల వివరాలు ముందుగానే ముద్రించి ఉండటమే అనుమానాలకు కారణమవుతోంది.

**విచారణకు ఆదేశాలు..** ఈ పరిణామాలపై జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ స్పందిస్తూ, ఫామ్7 దరఖాస్తులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలిస్తామని తెలిపారు. ప్రతి దరఖాస్తుపై సమగ్ర విచారణ జరిపిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. మరోవైపు, ప్రింటెడ్ ఫామ్7 దరఖాస్తుల వ్యవహారంపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల విభాగం ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసింది.

## పాముకాటుతో రైతు మృతి



**ప్రజాపక్షం/మునుగోడు:** పాముకాటుతో రైతు మృతి చెందిన విషాద ఘటన ఆదివారం మునుగోడు మండలంలో చోటుచేసుకుంది.స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఎల్లగలగూడెం గ్రామానికి చెందిన తీర్పారి సత్యనారాయణ రోజువారీగా వ్యవసాయ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విషపూరిత పాము కాటేసింది. పాము కాటేసిన విషయాన్ని గమనించిన సత్యనారాయణ చికిత్స కోసం స్వయంగా ద్విచక్ర వాహనంపై మునుగోడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు.అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో నల్లగొండ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పరిస్థితి విషమించి మృతి చెందారు.మృతదేహాన్ని వైద్య పరీక్షల నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య,ఇద్దరు కుమారులు ఉన్నారు.ఈ ఘటనతో ఎల్లగలగూడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఉచిత పోలీస్ శిక్షణ అర్హత పరీక్షకు 1220 మంది హాజరు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** పోలీస్ ఉద్యోగ ఆశావాహులకు 45 రోజులపాటు ఉచిత శిక్షణ అందించేందుకు ఆదివారం నిర్వహించిన ఎంపిక పరీక్షకు జిల్లావ్యాప్తంగా 1220 మంది హాజరయ్యారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాల, కోదాడ పట్టణంలోని కెఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల, హుజూర్‌నగర్ పట్టణంలోని గ్రీన్‌హుడ్ పాఠశాల, తిరుమలగిరి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధికారులు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ అర్హత పరీక్షకు 1600 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 1220 మంది హాజరయ్యారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్‌పి కె. నరసింహ సందర్శించారు. ఆయన వెంట ట్రైనీ అదనపు కలెక్టర్ అనూష, సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావుతోపాటు పలువురు ఉన్నారు.

## నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు ఆదివారం విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో మనమందరం అత్యంత కీలకమైన అంశంపై దృష్టి సారించాల్సిన అవశ్యకత ఏర్పడిందని, ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న తీవ్రమైన ఎల్‌నినో వాతావరణ ప్రభావం కారణంగా ఈ ఏడాది వర్షపాతం గణనీయంగా తగ్గిందన్నారు. ఎండల తీవ్రత విఫరీతంగా పెరగడంతో భూమి వేడెక్కి భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని తెలిపారు. ప్రతి నీటి బొట్టు భవిష్యత్‌కు రక్షణే అని, మిషన్ భగీరథ ద్వారా వస్తున్న తాగునీటిని అవసరమైన మేరకు మాత్రమే వాడుకోవాలని, ప్రతి ఇంటి నల్లాకు తప్పనిసరిగా ట్యాప్‌లు బిగించుకోవాలని, నీటిని వృధాగా రోడ్లపైకి, కాలువల్లోకి వదలకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ఇష్టానుసారంగా నీటిని వృధా చేస్తే, రాబోయే కాలంలో మున్సిపాలిటి తరుపున కఠినమైన ఆంక్షలు, చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటి పరిధిలోని ప్రజలందరూ ఈ తీవ్రతను గుర్తించి నీటి సంరక్షణలో మున్సిపల్ యంత్రాంగానికి పూర్తిగా సహకరించాలని కోరారు. ఇంటింటికి వర్షపు నీటి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని నీటిని సంరక్షించుకోవాలని కోరారు.

## కార్పెంటర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నంబాబు



**ప్రజాపక్షం/కోదాడ:** కార్పెంటర్ల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని కోదాడ మున్సిపల్ చైర్మన్ ఎర్నేనికుసుమ వెంకటరత్నంబాబు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని కార్పెంటర్ల సంఘ భవనంలో జరిగిన నూతన అధ్యక్షులు మునుగంటి శివ ఉపేంద్రచారి ప్రమాణ స్వీకారానికి ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం శివ, ఉపేంద్రచారిలతో ప్రమాణస్వీకారం చేయించి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పెంటర్ల సంఘ సభ్యులందరూ ఐక్యంగా ఉంటూ సంఘాన్ని బలోపేతం చేసుకోవాలన్నారు. ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకవస్తే మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిల సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపక సభ్యులు మోత్కూరి వీరభద్రచారి, మాజీ అధ్యక్షులు రేవూరి సత్యనారాయణచారి, అనంతచారి, తల్లోజు నర్సింహాచారి, సోమోజు వెంకటచారి, గోల్లపల్లి వీరచారి, పోలోజు తిరుపతాచారి, సంఘ పెద్దలు అనిల్, డాక్టర్ బ్రహ్మం, వెంకటనారాయణ, కృష్ణయ్య పాల్గొన్నారు.

## భూములు కోల్పోతున్న పేదలకు నష్టపరిహారం చెల్లించాలి

**ప్రజాపక్షం/మునగాల:** మండల పరిధిలోని ఎస్‌ఎంపేట రెవిన్యూ పరిధిలో గల 95 సర్వే నెంబర్‌లో గల ప్రభుత్వం నిర్మిస్తున్న కేంద్రీకృత వంటశాల నిర్మాణానికి రెవిన్యూ అధికారులు స్వాదీనం చేసుకోవడం సరైంది కాదని పేదలకు, తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎస్సీ, ఎస్టీ బిసి లబ్ధిదారులకు నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపిపి ముల్కలపల్లి రాములు డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం ఎస్‌ఎంపేట రెవిన్యూలో గల సర్వే నెంబర్‌లో కేంద్రీకృత వంటశాల నిర్మాణం చేస్తున్న భూమిలోకి నిర్వాసితులతో ఆయన సందర్శించి అక్కడే ఉన్న స్థానిక ఆర్డీవోతో మాట్లాడారు. ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకుని సేద్యం చేసుకున్న అసైన్‌మెంట్ చట్టం ప్రకారం అట్టి భూమి పట్టా హక్కులు కల్పించాల్సిన రెవిన్యూ అధికారులే బలవంతంగా భూమిని స్వాదీనం చేసుకోవడం సరైంది కాదని ఆయన అన్నారు. ఆ భూమిలో ఎస్సీ, ఎస్టీ, బిసి లు 1998లో ఒక ఎస్టీ రైతు దగ్గర కొనుగోలు చేశారని, దానికి సాదా కాగితాలు కూడా ఉన్నాయని అక్కడ 28 కుటుంబాలు ఇండ్లు నిర్మించుకుని మంచినీటి కోసం ఒక బోరు కూడా ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సోంపంగు జానయ్య, ఆరె రామకృష్ణారెడ్డి, కిన్నెర వెంకన్న, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నకిరేకల్ నియోజకవర్గ సాగునీటికి

# శాశ్వత పరిష్కారం చూపండి

రాష్ట్రనీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కోరిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ నియోజకవర్గంలో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టుల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రభుత్వాన్ని కోరారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు అవసరమైన నిధులు వెంటనే విడుదల చేసి,నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.ఆదివారం హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన ఉమ్మడి నల్లగొండ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ సాగునీటి పథకాల స్థితిగతులు,పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా నకిరేకల్ నియోజకవర్గానికి సంబంధించిన ప్రధాన ప్రాజెక్టులైన ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాలువలు,అయిటిపాముల ఎత్తిపోతల పథకం,ఉదయ సముద్రం పనుల పురోగతిని వేముల వీరేశం మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయా ప్రాజెక్టుల్లో ఎదురవుతున్న అడ్డంకులను తొలగించి పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి,మిగిలిన నిర్మాణ పనులకు సకాలంలో నిధులు మంజూరు చేయాలని కోరారు.ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే నియోజకవర్గ పరిధిలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని, వ్యవసాయం పండుగలా మారి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సమావేశంలో నల్లగొండ ఎంపి కుందూరు రఘువీర్ రెడ్డి, నల్లగొండ సూర్యాపేట జిల్లా కలెక్టర్లు బి చంద్రశేఖర్,తేజస్ నందలాల్, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య,మందల సామెల్,కుందూరు జై వీర్ రెడ్డి,కుంభం అనిల్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 60వేల మంది విద్యార్థులకు అల్పాహారం

రూ.9.60 కోట్లతో కమ్యూనిటీ కిచెన్‌కు శ్రీకారం

రేపు మునగాలలో శంకుస్థాపన

హాజరుకానున్న డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలోని 1029 పాఠశాలలతో పాటు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న దాదాపు 60వేల మంది విద్యార్థులకు ప్రభుత్వం ప్రతి రోజు అల్పాహారం అందించేందుకు హరేకృష్ణ మూమెంట్ ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఒప్పందం కుదుర్చుకుంది. కాగా ఆ ట్రస్ట్ సభ్యులు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని మునగాల మండల కేంద్రం సమీపంలో రూ.9.60 కోట్ల వ్యయంతో కమ్యూనిటి కిచెన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈనెల 6న (మంగళవారం) రాష్ట్ర డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర పౌరసరఫరాల, భారీ నీటిపారుదల శాఖల మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. మునగాల మండలం కేంద్రం 65వ జాతీయ రహదారి పక్కన ఉండడంతో మునగాల మాధవరం మధ్యన ఎంపిక చేసిన స్థలంలో ఈ కేంద్రీకృత వంటశాలను నిర్మించనున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే కేంద్రం నుంచి అల్పాహారం తయారు చేసి ప్యాకింగ్ ద్వారా పంపిణీ చేసేలా ప్రాజెక్టును రూపొందిస్తున్నారు. దేశంలోనే అత్యంత ఆధునిక సదుపాయాలతో ఈ వంటశాలను నిర్మిస్తున్నారు.

**60వేల మంది విద్యార్థులకు అల్పాహారం...** హరేకృష్ణ మూమెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో జిల్లాలోని 1,029 ప్రభుత్వ పాఠశాలల, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న దాదాపు 60వేల మంది విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం అల్పాహారం సరఫరా చేయనున్నారు.

**నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యం...** కమ్యూనిటి కిచెన్‌లో తయారయ్యే అల్పాహారం నాణ్యతగా తయారు చేసి అందించడంతోపాటు పరిశుభ్రంగా ఉండేలా ప్యాకింగ్, రవాణా, పంపిణీ కోసం సమగ్ర వ్యవస్థను అధికారులు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేశారు.

**పనులపై పర్యవేక్షణ...** కమ్యూనిటి కిచెన్ నిర్మాణం, నిర్వహణ, ఆహార తయారీ, విద్యా సంస్థలకు సరఫరా వంటి అంశాలపై రాష్ట్ర పౌరసరఫరాల, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

**సింగరేణి విరాళంతో ప్రాజెక్టు...** కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి సింగరేణి కంపెనీ రూ.9.60 కోట్ల విరాళం అందజేయగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతి సింగరేణి కంపెనీ నుండి నిధులు సమకూర్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, కంపెనీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.



## నిజాంనగర్‌లో సంపూర్ణ మద్యపాన నిషేధానికి నిర్ణయం

ఏకగ్రీవంగా గ్రామసభ తీర్మానం...

అతిక్రమిస్తే రూ. 10వేల జరిమానా

**ప్రజాపక్షం/డిండి:** నల్లగొండ జిల్లా డిండి మండలంలోని నిజాంనగర్ గ్రామంలో సంపూర్ణ మద్యపానం నిషేదానికి ఆదివారం గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ ప్రజలు, యువత, మహిళల అభిప్రాయం మేరకు గ్రామ సర్పంచ్ వింజమూరి శశికళ శేఖర్ గ్రామంలో పూర్తిస్థాయిలో సంపూర్ణ మద్యపాన నిషేదం, బెల్ట్ షాపులతో పాటు నాటుసారా, గుడుంబా తయారికి స్వస్తి పలకాలని నిర్ణయించారు. మద్యపానం వల్ల కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు, కుటుంబ కలహాలు ఏర్పడడమే కాకుండా యువత భవిష్యత్తుపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామంలో ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పడంతో పాటు మహిళల భద్రత, కుటుంబ సంక్షేమం, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని, గ్రామ ప్రజలు, యువత, మహిళలు ప్రజాప్రతినిధుల అభిప్రాయం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయాన్ని అతిక్రమించి మద్యం అమ్మితే రూ. 10వేల జరిమానా, చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎవరైనా అమ్మినట్లు ఆధారాలతో నిరూపిస్తే వారికి రూ. 2వేల నజరానా ఇస్తామని ప్రకటించారు. ఈకార్యక్రమంలో ప్రజలందరు పాల్గొని మద్యపానానికి దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన, ఆదర్శవంతమైన గ్రామ నిర్మాణంలో మేమందరం కలిసి పనిచేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ నల్లవెల్లి వెంకటయ్య, గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## సుప్రసిద్ధ శాస్త్రవేత్త పల్లె రామారావు కన్నుమూత

పలు సంస్థలు, ప్రముఖుల ఘన నివాళులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పద్మవిభూషణ్, ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ పల్లె రామారావు (89) కన్నుమూశారు. మెటలర్జీ, మెటీరియల్ సైన్స్, అణు భౌతిక శాస్త్ర రంగాల్లో విశేష కృషి చేసి అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఆయన మృతి శాస్త్ర, సాంకేతిక, విద్యా రంగాలకు తీరని లోటని పలు సంస్థలు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. 1937 జూన్ 30న కర్నూలులో జన్మించిన రామారావు తెలుగు మాధ్యమంలో ప్రాథమిక విద్యను అభ్యసించి, అనంతరం బెంగళూరు, మద్రాసు, ఆంధ్ర, బెనారస్ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను పూర్తి చేశారు. అమెరికాలోని పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయంలో మెటీరియల్ సైన్స్‌లో పోస్ట్ డాక్టరల్ పరిశోధన చేశారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుడిగా పనిచేసిన ఆయన.. డిఎంఆర్‌ఎల్ డైరెక్టర్, కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ కార్యదర్శి, ఎఐఆర్‌బి చైర్మన్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఉపకులపతి, ఎఆర్‌సిఐ చైర్మన్ తదితర కీలక పదవులు చేపట్టారు. డిఆర్‌డిఓ, ఇస్రోలో డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్‌గా సేవలందించారు. సంస్థల నిర్మాణంలో కీలక పాత్ర: స్వదేశీ సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధికి రామారావు విశేషంగా కృషి చేశారు. హైదరాబాద్‌లోని ఎఆర్‌సిఐ, ఎన్‌ఎఫ్‌టిసి, చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ తదితర ప్రతిష్ఠాత్మక సంస్థల ఏర్పాటులో, అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. రామారావు మృతికి సిసిజిజిఓఓ జాతీయ చైర్మన్ వి. కృష్ణమోహన్ తీవ్ర సంతాపం తెలిపారు. జన విజ్ఞాన వేదిక, ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ సహా పలు సంస్థలు నివాళులర్పించాయి. శాస్త్రవేత్తగా, విద్యావేత్తగా, పరిపాలనాదక్షుడిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నాయి.

## యోగాసన సాధనతో మానసిక ప్రశాంతత

మిర్యాలగూడలో ఘనంగా జిల్లా స్థాయి యోగాసన ఛాంపియన్‌షిప్




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** యోగాసన సాధన శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రతను పెంపొందించడంలో ఎంతో ఉపయోగకరమని మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని బీసీ భవన్‌లో నల్గొండ డిస్ట్రిక్ట్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన ఛాంపియన్‌షిప్ పోటీలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తనయుడు, యువ నాయకుడు బత్తుల ఈశ్వర్ గణేష్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించి వీక్షించారు. మున్సిపల్ కౌన్సిలర్లు సోమగాని చంద్రకళ, గొట్టిముక్కల ఝాన్సీ లక్ష్మణ్ ప్రత్యేక అతిథులుగా పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ప్రజాప్రతినిధులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్నారులు, యువత యోగాను తమ దైనందిన జీవితంలో నిత్య కృత్యంగా మార్చుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని నల్గొండ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయి ఛాంపియన్‌షిప్‌ను దిగ్విజయంగా నిర్వహించిన నల్గొండ డిస్ట్రిక్ట్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో యోగాసన అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో పట్టుబడిన 380మంది డ్రైవర్లు

రెండు రోజుల్లో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే వారిపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఏకంగా 380 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న డ్రైవర్లను పోలీసులు పట్టుకున్నారు.పట్టుబడిన వారిలో అత్యధికంగా 343 మంది ద్విచక్ర వాహనదారులు ఉండగా, 12 మంది త్రిచక్ర వాహనదారులు, 25 మంది నాలుగు చక్రాల వాహనదారులు, ఇతర వాహనాల డ్రైవర్లు ఉన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రమాదాల తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పట్టుబడిన వారి రక్తంలో మద్యం పరిమాణం (బిఎసి) పరిశీలించగా 30–50 ఎంజి,100 ఎంఎల్ పరిధిలో 80 కేసులు, 51–100 పరిధిలో 167 కేసులు నమోదయ్యాయి. అలాగే 101–150 పరిధిలో 77 కేసులు, 151–200 పరిధిలో 39 కేసులు, 201–250 పరిధిలో 12 కేసులు నమోదయ్యాయి. మరో 251–300 పరిధిలో రెండు కేసులు, 300కు పైగా బిఎసి నమోదైన మూడు కేసులు కూడా వెలుగుచూశాయి. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని హైదరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) కోరారు.

# ఆరంభం 'అదుర్స్'

ప్రచారంలో దూకుడు పెంచిన సర్వోత్తముడు

గెలుపే లక్ష్యంగా ముందుకు

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఉమ్మడి నల్లగొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎంఎల్‌సి అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఆరంభంలోనే అదుర్స్ అనిపిస్తున్నాడు. పార్టీ అధిష్టానం తనను అభ్యర్థిగా ప్రకటించగానే మొదట సిఎం రేవంత్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, పౌరసరఫరాల, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి వారికి కృతజ్ఞతలు తెలిపారు. మరుసటి రోజు తన తండ్రి దివంగత నేత, మాజీ మంత్రి దామోదర్ రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో బిజీగా గడిపిన ఆయన మరికొంత మంది పార్టీ పెద్దలను కలిసి శనివారం తమ ఇలవేలుపు అయిన అర్వపల్లి మండల కేంద్రంలోని శ్రీయోగానంద లక్ష్మి నృసింహ స్వామిని దర్శించుకొని అక్కడి నుండే తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. సూర్యాపేట, తుంగతుర్తి నియోజక వర్గాల నలుమూలల నుండి పెద్దఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు ఆయన అభిమానులు తరలివచ్చారు. ఉమ్మడి నల్లగొండ ఖమ్మంవరంగల్ పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానానికి పార్టీ అధిష్టానం తనను అభ్యర్థిగా ప్రకటించగానే ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో సర్వోత్తమ్ రెడ్డి దూకుడు పెంచారు. ఇంకా ఈ ఎన్నికలకు ఆరు మాసాల సమయం ఉంది. ఇప్పటి వరకూ ఏ రాజకీయ పార్టీ కూడా ఎన్నికల బరిలో తమ అభ్యర్థులను ఎవరిని దింపబోతున్నట్లు కూడా ప్రకటించిన దాఖలాలు లేవు. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈ ఎంఎల్‌సి ఎన్నికలను మరో రెండేండ్లలో రానున్న శాసన సభ ఎన్నికలకు సెమీ ఫైనల్‌గా భావిస్తూ ముందుగానే రాష్ట్రంలో ఖాళీ కాబోతున్న రెండు పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. దీనితో సర్వోత్తమ్ రెడ్డి అందరి కంటే ముందుగానే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కుందూరు జానా రెడ్డి, నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, శాసన సభ డిప్యూటి స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్, మాజీ కేంద్ర మంత్రి రేణుకాచౌదరితో పాటు పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజక వర్గ పరిధిలోని ఉమ్మడి నల్లగొండఖమ్మంవరంగల్ జిల్లాల పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలను, ఎంపిలను మర్యాదపూర్వకంగా కలుస్తూ వారి ఆశీస్సులు తీసుకుంటూ తన గెలుపుకు సహకరించాలని వేడుకుంటున్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో తన గెలుపే లక్ష్యంగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ముందుకు సాగుతున్నారు. ఒక్క క్షణం కూడా సమయాన్ని వృధా చేయకుండా విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఏ ఒక్క చిన్న అవకాశాన్ని కూడా వదులకుండా తనకు కుడి ఎడమ భుజాలుగా ఉన్న పార్టీ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త మొరిశెట్టి లక్షాదితో కలిసి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తోపాటు ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పర్యటిస్తున్నారు. తన గెలుపు సునాయసం అని తెలిసినా అతను పగలు రాత్రి అని తేడా లేకుండా తిరుగుతున్నారు. ఆనాటి నుండి కాంగ్రెస్ పార్టీ కోసం ఏఐసిసి సభ్యుని హోదాలో పనిచేస్తున్నానని తనను ఆశీర్వదించి ఎంఎల్‌సిగా గెలిపించాలని పట్టభద్రులను వేడుకుంటున్నారు.





## గోల్డ్ మెడల్ సాధించిన దీక్షిత్‌కు అభినందన

**ప్రజాపక్షం/దేవరకొండ:** సెప్టెంబర్28, 29,30 తేదీలలో జరిగన ఆల్ ఇండియా మల్టీ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా వాలీబాల్ 2016 అండర్ 17 గోవాలో జరిగిన వాలీబాల్ రంగారెడ్డి జిల్లా ద్వారా పోటీలో పాల్గొని గెలుపొంది మొదటి బహుమతి సాధించిన నల్గొండ జిల్లా దేవరకొండ మండలం మంగలోనిబావి గ్రామ పంచాయతీ పరిధిలోని రేగళ్ల తండాకు చెందిన రమావత్ దీక్షిత్ ఆల్ ఇండియా మల్టీ స్పోర్ట్స్ క్రీడల్లో గోల్డ్ మెడల్ సాధించడం పట్ల ఆదివారం దేవరకొండ ఎంఎల్‌ఏ బాలునాయక్ ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ మున్ముందు మరిన్ని పథకాలు సాధించాలని ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్‌రావు, జిల్లా నాయకులు రాజేష్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
సోమవారం
05-10-2026
www.prajapaksham.in

"శ్రీ విష్ణు తాజాగా 'కామ్రేడ్ కళ్యాణ్'తో అలరించబోతున్నారు. జనకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు."

రీల్



# 'కల్ట్' షూటింగ్ పూర్తి

విశ్వక్ సేన్ స్వీయ దర్శకత్వంలో, హీరోగా నటిస్తున్న చిత్రం 'కల్ట్' షూటింగ్ పూర్తి అయింది. కెజిఎఫ్ లాంటి పాన్ ఇండియా భారీ చిత్రాలకు మ్యూజిక్ అందించిన సేన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ రవి బసూర్ గారు అందించిన పాటలతో పాటు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మరో సంచలనం కాబోతుంది. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. రామోజీ ఫిలిం సిటీలో ఎంతో ప్రతిష్టాత్మకంగా వేసిన భారీ సెట్లో వందలాది మోడల్స్‌తో 40 – 50 రోజుల పాటు తెరకెక్కిన కీలక సన్నివేశాలు భారతీయ చలన చిత్రాలకు ధీటుగా ఉండబోతున్నాయట. యూత్‌లో ప్రత్యేకమైన కల్ట్ ఫాలోయింగ్ ఉన్న సెన్సేషన్ తరుణ్ భాస్కర్ అందించిన మాటలు మరో హైలైట్. తారక్ సినిమా బ్యానర్ పై సందీప్ కాకరాల ఖర్చుకు వెనకాడకుండా అత్యంత భారీగా టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ కల్ట్ సినిమాలో సినీ దిగ్గజలందరూ పాలు పంచుకుంటు న్నారు. యానిమల్ లాంటి సినిమా లకు సౌండ్ డిజైన్ చేసిన సచిన్ అందిస్తున్న సౌండ్ డిజైన్ ఒక ప్రత్యేక స్థాయిలో నిలబెట్టింది, విశ్వక్ సేన్, గాయత్రి భరద్వాజ్, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, పుష్ప ఫేమ్ తారక్ పొన్నప్ప, ప్రజ్ఞ, లాంటి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అక్టోబర్ 30 కి విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు.

# 'భోగి' టీజర్ రిలీజ్



చార్మింగ్ స్టార్ శర్వా డిఫరెంట్ ఇంటెన్స్ పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్ పై కెకె రాధామోహన్ భారీ స్కేల్‌లో నిర్మిస్తున్నారు. లక్ష్మీ రాధా మోహన్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. మిగిలిన షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో మేకర్స్ ప్రమోషనల్ కార్యక్రమాలను ప్రారంభిస్తూ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. గ్రామీణ జానపద శైలిలో సాగే వాయిస్ ఓవర్‌తో టీజర్ ప్రారంభమవుతుంది. బొగ్గుల గుట్ట అనే గ్రామాన్ని పరిచయం చేస్తూ.. పోలేరమ్మ కమ్మరి గంగను తీసుకెళ్లారని అనుపమ పరమేశ్వరన్ పాత్ర చెబుతుంది. అతనికి ఏమైనా జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరిస్తుంది. గ్రామాన్ని కాపాడేందుకు ఓ ప్రత్యేకమైన భక్తి కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుందని టీజర్ ద్వారా ప్రజెంట్ చేశారు. ఆ తర్వాత గంగగా శర్వా రఫ్ అండ్ రగ్డ్ లుక్‌లో పవర్ఫుల్‌గా ఎంట్రీ ఇవ్వడం ఆకట్టుకుంది. మట్టితో మమేకమైన ఓ సాధారణ కూలీగా కనిపించే ఆయన.. ఇక తాను మౌనంగా ఉండబోనని హెచ్చరిస్తారు. తన కత్తితో తొమ్మిది మెట్లను కడిగి, శత్రువుల రక్తంతో వాటిని అలంకరిస్తానని గంగ చెప్పే మాటలు పాత్రలోని ఇంటెన్సిటీని చూపిస్తాయి. 1960ల ప్రారంభంలో తెలంగాణమహారాష్ట్ర సరిహద్దులోని ఓ కల్పిత గ్రామం నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. సంపత్ నంది ఈ కథను ఎంతో సహజంగా, నేటివిటీతో తెరకెక్కించినట్లు టీజర్ చూస్తే అర్థమవుతుంది. పీరియడ్ నేపథ్యాన్ని సహజంగా చూపిస్తూ.. హై వోల్టేజ్ యాక్షన్, పల్లెటూరి డ్రామాను బ్యాలెన్స్ చేసిన విధానం ఆకట్టుకుంటోంది.మిగిలిన షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయిన తర్వాత సినిమా థియేట్రికల్ రిలీజ్ డేట్ను మేకర్స్ ప్రకటించనున్నారు.

టీజర్ 'భోగి'పై బలమైన క్యూరియాసిటీని క్రియేట్ చేయడంతో పాటు ఈ ఇంటెన్స్ పీరియడ్ యాక్షన్ డ్రామాపై అంచనాలను మరింత పెంచింది. శర్వానంద్ , అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి నటిస్తున్నారు.

# 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' ట్రైలర్ రిలీజ్



హర్ష చెముడు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్'. బాబు డెగాల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చవాన్, శ్రీధర్ చెని, దీపక్ ముస్త్యాల నిర్మించారు. రాజ్ సుహాస్, ప్రమదేశ్వి వి క్రియేటివ్ ప్రొడ్యూసర్లుగా వ్యవహరించారు.అక్టోబర్ 9 నుంచి ప్రముఖ తెలుగు ఒటిటి వేదిక ఇటివి విన్‌లో 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' స్ట్రీమింగ్ కానుంది. తాజాగా మేకర్స్ ట్రైలర్ రిలీజ్ చేశారు. తన కొడుకుని ప్రేమించని హర్ష తండ్రి అమ్మాయిలని రిక్వెస్ట్ చేసే సన్నివేశంతో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. హర్ష ఫన్ టైమింగ్ అలరించింది. హైపర్ క్యారెక్టర్ మరో హైలైట్‌గా నిలిచింది.జీవన్ కుమార్, ఐశ్వర్య హోలక్కల్, శ్రావ్య చౌదరి ఇతర కీలక పాత్రల్లో ఆకట్టుకున్నారు. అజయ్ అరసాడ సంగీతం ఎంటర్టైమెంట్ ని మరింత ఎలివేట్ చేసింది. చిత్రానికి శక్తి అరవింద్ సినిమాటోగ్రఫీ అందించారు. జానీ షేక్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, లిఖిత్ లీ ఎడిటర్‌గా, సాయి ప్రావలిక కాస్ట్యూమ్ డిజైనర్‌గా, పీవీజీ విశ్వనాథ్ లైన్ ప్రొడ్యూసర్‌గా పనిచేశారు. హర్ష చెముడు, హైపర్ ఆది, జీవన్ కుమార్, ఐశ్వర్య హోలక్కల్, రూప శ్రావ్య, శ్రీ విద్యా, ప్రేమ్ సాగర్, వాసు ఇంటూరి, మహేందర్, నటిస్తున్నారు.

# ఎన్టీఆర్‌కు మద్దతుగా విజయ్ దేవరకొండ



మానవీయ విలువల్లో మనం పూర్తిగా దిగజారిపోతున్నామంటూ విజయ్ దేవరకొండ తన సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎన్టీఆర్ హీరోగా నటించిన దేవర సినిమాలోని చుట్టమల్లే పాటను ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్‌తో మహిళల్ని కించపరిచేలా రూపొందించిన ఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఈ ఘటనపై హీరో ఎన్టీఆర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తన ఆగ్రహాన్ని వెల్లడిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ ఘటన నేపథ్యంలో ఎన్టీఆర్‌కు మద్ధతుగా నిలబడేందుకు ముందుకొచ్చారు విజయ్ దేవరకొండ. మానవీయ విలువల్లో మనం పూర్తిగా దిగజారిపోయామంటూ ఆయన ట్వీట్ చేశారు. హీరో విజయ్ దేవరకొండ స్పందిస్తూ విలువల పరంగా మనం నీచమైన స్థాయికి దిగజారిపోతున్నాం. ఈ ఘటనకు బాధ్యుతలైన వారిని వదిలిపెట్టకూడదు. చట్టపరంగా వారిని కఠినంగా శిక్షించాలి. మరొకరు ఇలాంటి తప్పు చేయకుండా గుణపాఠం నేర్పాలి. పిల్లల్ని ఎలా పెంచుతున్నాం, మనం ఎలాంటి సమాజంలో జీవిస్తున్నామనే సందేహాన్ని ఈ ఉదంతం రేకెత్తిస్తోంది. మరొకరిని బాధపెట్టడంలో సంతోషాన్ని వెతుక్కునేలా మారిపోవడం బాధాకరం. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయని ప్రపంచమంతా భయపడుతుంటే మరోవైపు ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని కొందరు ఇలాంటి తప్పుడు పనులకు ఉపయోగించుకుంటున్నారు. డిజిటల్ వేదికలపై జరిగినా దీన్ని లైంగిక దాడితో సమానంగా పరిగణించాలి. చట్టప్రకారం తీవ్రంగా శిక్షించాలి. ఈ ఘటనను వ్యతిరేకిస్తున్న ప్రతి ఒక్కరికీ నా పూర్తి మద్దతు ఉంటుంది. అన్నారు.



# 'కామ్రేడ్ కళ్యాణ్'కు యు/ఎ సర్టిఫికెట్

శ్రీ విష్ణు తాజాగా 'కామ్రేడ్ కళ్యాణ్'తో అలరించబోతున్నారు. జనకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. తాజాగా మాస్ మహారాజా రవి తేజ 'కామ్రేడ్ కళ్యాణ్' టైటిల్ సాంగ్ లాంచ్ చేశారు. విజయ్ బుల్గానిన్ ఫన్ ఫుల్‌గా ఈ పాటను కంపోజ్ చేశారు. రాహుల్ సిప్లిగంజ్ వాయిస్‌తో పవర్ఫుల్ ఎనర్జీని అందించగా, భాస్కరభట్ల రాసిన లిరిక్స్ కామ్రేడ్‌గా హీరో క్యారెక్టర్‌ను ఎంటర్‌టైనింగ్‌గా ప్రజెంట్ చేశాయి. విడుదలైన వెంటనే ఈ సాంగ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో రాధికా శరత్కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. చోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. 'కామ్రేడ్ కళ్యాణ్' అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. శ్రీవిష్ణు, మహిమా నంబియార్, రాధికా శరత్కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే నటిస్తున్నారు.

# గుజరాత్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బృందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలోని కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్ర సహకారం సాధించే లక్ష్యంతో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నేతృత్వంలోని అధికారుల బృందం ఆదివారం గుజరాత్‌కు బయలుదేరింది. ఏక్తానగర్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద సోమ, మంగళ వారాల్లో కేంద్ర ఉపరితల రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన జరిగే చింతన్ శివిర్2026లో మంత్రి పాల్గొనను న్నారు. ఈ సమావేశంలో పిఎం గతిశక్తి, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మౌలిక వసతుల ప్రాజెక్టుల అమలు తదితర అంశాలపై చర్చించను న్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల రోడ్లు, భవనాల శాఖ మంత్రులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. రెండు రోజుల పాటు ఐదు సెషన్లలో చర్చలు జరుగుతాయి.

**తెలంగాణ ప్రాజెక్టులపై ప్రత్యేక చర్చ..**

చింతన్ శివిర్ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలంగాణకు సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై ప్రత్యేకంగా చర్చించనున్నారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్), ఎన్‌హెచ్65 విస్తరణ, ఎల్‌బినగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్, భారత్ ఫ్యూచర్ సిటీఅమరావతి గ్రీన్‌ఫీల్ హైవే, ఇతర జాతీయ రహదారి ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి. రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అవసరమైన సహకారం పొందేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి దిశానిర్దేశం చేశారు.





# వాటా తీసుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

వి. హనుమంత్ రావు, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహా రెడ్డి, డిసిసి అధ్యక్షురాలు చిగురింత పారిజాత నరసింహా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఒక కులానికి, మతానికి చెందినది కాదని, పార్టీలో ఎవరికి దక్కాల్సిన వాటా వారికి దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో ఈ రాష్ట్రానికి బిసి ముఖ్యమంత్రి అయ్యి తీరుతామన్నారు. అందుకు రాహుల్ గాంధీ, ఖర్గే, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క సహా అందరూ సహకరిస్తారని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పోరాడితే పోయేదేమీ లేదు, భవిష్యత్ తరాల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బిసిల హక్కుల కోసం మాట్లాడే ధైర్యం రాహుల్ గాంధీ ఇచ్చారని, తెలంగాణకు బిసి ముఖ్యమంత్రి అవుతాడని ఘంటాపథంగా చెబుతున్నానని, రాహుల్ భారత్ జోడో యాత్రతో ఎవరు ఎంతో వారికి అంత రాహుల్ గాంధీ నినాదంమని, ఎవరికి రావాల్సిన వాటా వారికి తీసుకుంటాం, అవసరమైతే లాక్కుంటాం అని మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

**బిజెపి ఎంపిలు ఎమ్మెల్యేలు దద్దమ్మలు**

బిజెపి ఎంపిలు, ఎమ్మెల్యేలు దద్దమ్మలని, మోదీ, అమిత్ షా దగ్గరికి వెళ్ళి చెప్పే దమ్ము, ధైర్యం లేదన్నారు. కుల సర్వే సాకారం అయి ఉంటే యావద్దేశానికి తెలంగాణ రోల్ మోడల్ గా ఉండేదని, కేంద్ర సర్వేలో పదవ కాలంలో ఎస్‌సి, ఎస్‌టి ఇచ్చి ఒబిసి కాలం ఎత్తేశారన్నారు. తెలంగాణ పిలుపు కేంద్రానికి కనువిప్పు కావాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 55 శాతానికి పైగా సర్పంచ్ లను, మున్సిపల్ ఎన్నికల్లో 58 శాతం బిసిలకు సీట్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. అదేవిధంగా మంత్రివర్గంలో, ఎమ్మెల్సీ, కార్పొరేషన్లలో బిసిల సంఖ్యను పెంచుతామని చెప్పారు. సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క, మంత్రుల సహకారంతో కుల సర్వే నిర్వహించి డాక్యుమెంట్ ఇచ్చాం, మోదీ గద్దె దిగే టైం వచ్చిందని, రాహుల్ ప్రధాని కావడం తథ్యం అని, అదేవిధంగా 2039 వరకు కూడా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో కొనసాగుతుందని, ఆ విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని మహేష్ కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. రాహుల్ ప్రధాని అయ్యేవరకు మన పోరాటం కొనసాగించాలని, రాహుల్ గాంధీ ఓబిసి పెద్ద సిపాయి అని, అతనిని ప్రధాని చేయడమే లక్ష్యంగా, ఆ తర్వాత ఇలాంటి పోరాటాల అవసరం ఉండదని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. అంతకుముందు బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ నిజాం రజాకార్లను తరిమి కొట్టిన మనం బిసిల హక్కులకోసం పోరాడామన్నారు. రాష్ట్రంలో కులగణన చేసిన ప్రభుత్వం మనది అని.. కులగణనలో ఒబిసి లేదని అన్నారు. మేం ఎవరికి వ్యతిరేకం కాదని.. అందరికి సమాన అవకాశాలు వచ్చినప్పుడే అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. గ్రామస్థాయి నుండి ఒబిసి గురించి మీటింగులు పెట్టాలని పిలుపునిచ్చారు. మనం ఎంతో.. మనకంత అధికారం కావాలని అన్నారు. న్యాయం చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామని, బిసి హక్కు సాధనకోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో ముందుకెళ్లాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచేలా కులగణన నిర్వహించిందన్నారు. లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులను భాగస్వామ్యం చేసి సమగ్రంగా కులగణన నిర్వహించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని చెప్పారు. బీహార్‌తో పాటు తెలంగాణ కూడా కులగణన నిర్వహించిన రాష్ట్రంగా దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని, కులగణన కేవలం ఒక రాష్ట్రానికి సంబంధించిన అంశం కాదు, దేశంలోని బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల హక్కులకు సంబంధించిన అంశం అని ఆయన తెలిపారు.

# తీవ్ర ప్రతిఘటన

(మొదటి పేజీ తరువాయి)

సెప్టెంబరు చివరివారంలో 81వ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా తాను 42 దేశాల విదేశాంగమంత్రులతో సమావేశాలు నిర్వహించానని, తమ దేశాధ్యక్షుడు పెజెష్కియన్ పది దేశాల అధినేతలతో సమావేశాలు నిర్వహించారని చెప్పారు. ఈ పర్యటనలో తమ షెడ్యూల్‌ను తీర్చిదిద్దిన అధికారులను ఆయన ప్రశంసించారు.న్యూయార్క్ సమావేశాలలో ఇరాన్‌ల తన ఉనికికి చాలా బలంగా చాటి చెప్పిందన్నారు.ఇరాన్ చేసిన ప్రతిపాదనలతో న్యూయార్క్ రాజకీయ వాతావరణం తీవ్రంగా ప్రభావితమైందని,దౌత్యంపట్ల,శాంతియుత పరిష్కారం సాధించే విషయంలో ఇరాన్ చాలా నిబద్ధతతో ఉందన్న విషయాన్ని తాము నిరూపించామని చెప్పారు.ఇరాన్‌ను ఏకాకిని చేయవచ్చుననే అమెరికా భావన విఫలమైందని,యుద్ధానికి,శాంతికి పరిష్కారాలు సాధించగలదని ఇరాన్ నిరూపించిందన్నారు.ఇరాన్ ప్రతినిధి బృందాన్ని దేశం నుండి బహిష్కరించారన్న అమెరికా వాదనను అరాఘ్చి ఖండించారు.ముందుగా నిర్దేశించిన షెడ్యూలు ప్రకారమే ఇరాన్ ప్రతినిధిబృందం అమెరికా వెళ్ళి వచ్చిందని,విజయవంతంగా యుఎన్‌జిఎ సమావేశాల్లో పాల్గొని వచ్చిందని,అమెరికా చేస్తున్న వాదన చాలా వింతగా ఉందని అన్నారు.

# 'సారస్' మేళా

(మొదటి పేజీ తరువాయి)

అర్థం చేసుకునే అవకాశం లభిస్తుంది. ఈ ప్రదర్శనలో పోచంపల్లి, గద్వాల, నారాయణపేట చేనేతలు, కలంకారి, ఎంబ్రాయిడరీ చీరలతో పాటు చెక్క బొమ్మలు, జూట్ బ్యాగులు, మట్టి పాత్రలు, బంజారా కళాకృతులు, వివిధ రకాల హెర్బల్ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయి. వీటితో పాటు సంప్రదాయ పిండి వంటలు, పచ్చళ్లు, పొడులు, మిల్లెట్ ఆహార పదార్థాలను కూడా ప్రదర్శించి, నేరుగా విక్రయించనున్నారు. భవిష్యత్తులో బల్క్ ఆర్డర్లు, వ్యాపార భాగస్వామ్యాలకు ఈ వేదిక ఎంతగానో దోహదపడనుంది. గ్రామీణ మహిళలకు మార్కెట్ అవకాశాలు కల్పించినప్పుడే వారి ఆర్థిక స్వావలంబనకు బలమైన పునాది పడుతుందని మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్ ప్రజలు కుటుంబ సమేతంగా సారస్ మేళాను సందర్శించి, మన ఆడబిడ్డలు ఎంతో శ్రమించి తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని ఆమె కోరారు. మనం చేసే ప్రతి కొనుగోలు వారి శ్రమకు ఇచ్చే ప్రోత్సాహమని, వారి ఆర్థిక పురోగతికి అందించే అండ అని సీతక్క అన్నారు.

# కాలికి తీవ్ర గాయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రదర్శకులుపై దాడిచేశారు. ఈ దాడి సమయంలో బాలిక ఖుష్‌బూ కాలు విరిగింది. ఆమె కాలుకు కట్టుకుని ప్రదర్శనలో పాల్గొన్నారు. కట్టు కట్టిన కాలుతో ప్రదర్శనలో పాల్గొన్నప్పటికీ ఆమె పెదవులపై చిరునవ్వు చెక్కు చెదరలేదు. ఈ కాలపు జనరేషన్ జెడ్ లో ఉన్న ఆశను,అత్యుత్తమమైన భవిష్యత్ భారతదేశాన్ని సాధించాలనే పట్టుదలను ఆమె తన వైఖరిలో ప్రతిబింబించారు. వారి గళాన్ని,వారి ఆలోచనలను ఈ ప్రభుత్వం అర్థం చేసుకుంటుందని మనం ఆశాభావం వ్యక్తం చేద్దాం.వారి ఓటుకు కూడా విలువ కడతారని,వారి ఓటును కూడా లెక్కిస్తారని ఆశిద్దాం.అదే ఇప్పుడు ముఖ్యమైన విషయం.ఎంతో కఠినమైన మార్గం అయినాసరే,జ్ఞానేశ్ కుమార్ అయినాసరే, ఢిల్లీ పోలీసులు అయినాసరే,అత్యంత చిత్తశుద్ధితో పోరాటం చేస్తున్న అలాంటి యువతరాన్ని ఎవరు మాత్రం ఏ విధంగా అడ్డుకోగలుగుతారు?ఇంత ధృఢంగా పోరాడుతున్న యువత సంకల్పాన్ని ఎవరు భగ్నం చేయగలరు?

వాళ్ళంతా వ్యక్తిగతంగా వాళ్ళకోసం పోరాటం చేయడంలేదు, మనందరి సామూహిక భవిష్యత్ కోసం పోరాడుతున్నారు.

భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) జాతీయ కార్యదర్శి, పార్లమెంటు సభ్యుడు పి. సందోశ్ కుమార్, సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యులు ప్రొఫెసర్ దినేశ్ వర్ష్ణీ, పార్టీ జాతీయ సమితి సభ్యులు వివేక్ శర్మ శనివారం ఖుష్‌బూ నివాసానికి వెళ్ళారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.ఆమె ధైర్యసాహసాలను ప్రశంసించారు. ఆమె ధైర్యం, సాహసం మనలో ఆశ రేకెత్తిస్తుంది. మనం నిబద్ధతతో పోరాడతాం, విజయం సాధిస్తాం, ఖుష్‌బూ త్వరలో తిరిగి ఆరోగ్యం పుంజుకుంటారు,కతమ ప్రజాస్వామ్యాన్ని, హక్కులను, భవిష్యత్తును వదులుకోవడానికి నిరాకరించే తన సహచర స్నేహితులతో కలిసి అమె మళ్ళీ త్వరలోనే పోరాటం చేయడానికి వీధుల్లోకి వస్తారు. వారు కేవలం వారికోసం మాత్రమే వ్యక్తిగత పోరాటం చేయడం లేదు. మనందరికోసం వాళ్ళు పోరాటం చేస్తున్నారు.

# ఎయిర్‌పోర్టు పేరేంటి?

(మొదటి పేజీ తరువాయి)

సినీ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా స్పందించారు. వరంగల్ చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించే లా రుద్రమ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ (ఆర్బిఎ) లేదా కాకతీయ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ (కే ఐఏ) పేర్లను సూచించారు. ఓరుగల్లు వారసత్వం, సంస్కృతి, చరిత్రకు తగిన పేరు ఉండాలని పేర్కొన్నారు. ఆయన సూచనపై సీఎం స్పందిస్తూ దట్స్ ది స్పిరిట్ అంటూ రియాక్ట్ అయ్యారు కూడా. ది ప్యారడైజ్ చిత్ర దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మరో ప్రతిపాదన చేశారు. మామునూరు ఎయిర్ పోర్టు కు సమ్మక్క సారలమ్మ ఇంటర్నేష నల్ ఎయిర్పోర్ట్ అని పేరు పెట్టాలని సూచించారు. నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ కూడా రాణి రుద్రమ దేవి పేరును సూచించారు. రాణి రుద్రమదేవి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్, వరంగల్ అని పేరు పెట్టడం సముచితమని పేర్కొన్నారు. ఇదే సమ యంలో నటుడు విజయ్ దేవరకొండ కూడా రుద్ర మదేవి, కాకతీయ వారసత్వాన్ని ప్రతిబింబించే పేర్లకు మద్దతుగా స్పందించారు. సినీ నటుడు నితిన్ కూడా రాణి రుద్రమ దేవి ఇం టర్నేషనల్ ఎయిర్ పోర్టు పేరును సూచించారు.

**పీవీ నరసింహారావు పేరు.. తాజాగా అల్లావుద్దీన్ పేరు..**

మాజీ ప్రధాని పీవీ నరసింహరావు పేరు కూడా ప్రతిపాదనల్లోకి వచ్చింది. సీపీఐ జాతీయ కార్యద ర్శి కె.నారాయణ సీఎం పిలుపునకు స్పందిస్తూ మా మునూరు ఎయిర్ పోర్టు కు పీవీ పేరు పెట్టాలని సూ చించారు. ప్రస్తుత వరంగల్ ప్రాంతానికి చెందిన పీవీ 199196 మధ్య ప్రధానమంత్రిగా పనిచేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఇక పీవీ పేరు పెట్టాలన్న ప్రతిపాదనకు మరికొందరు నాయకులు, ఆయన కుటుంబం/ట్రస్ట్ కు సంబంధించిన వ ర్గాలు సూచించాయి. ఈ నేపథ్యంలో పీవీ పేరు కూడా ప్రధాన ప్రతిపాదనల్లో ఒకటిగా మారింది. కాగా పేర్ల చర్చలో తాజాగా మరో ప్రతిపాదన చేరింది. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ గత నెల 22న సీ ఎం రేవంత్రెడ్డికి లేఖ రాస్తూ వరంగల్ ఎయిర్ పోర్టు కు స్వాతంత్ర్య సమరయోధుడు మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్ పేరు పెట్టాలని కోరారు. అలావుద్దీన్ 1857 తిరుగుబాటు కాలంలో బ్రిటిష్ వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారని,జైలు శిక్ష కూడా అనుభవించారని గుర్తు చేశారు.

**సోషల్ మీడియాలోనూ పేరు ప్రతిపాదనలు**

సీఎం పిలుపుతో సోషల్ మీడియాలోనూ పేర్లపై చర్చ సాగుతోంది. కొందరు రాణి రుద్రమదేవి, మరికొందరు కాకతీయ, సమ్మ క్కసారలమ్మ పేర్లతో ఎయిర్పోర్టు గేట్లు, టెర్మినల్ డిజైన్లను ఏఐ ద్వారా రూపొందించి షేర్ చేస్తున్నారు. పీవీ నరసింహారావు, ఓరు గల్లు, ప్రతాపరుద్ర, ప్రొఫెసర్ జయశంకర్, సర్వాయి పాపన్నల పేర్లు కూడా చర్చలోకి వచ్చాయి. మరోవైపు కొందరు ఆన్లైన్ వేదిక గా పోల్ నిర్వహిస్తున్నారు. ఇవన్నీ ప్రజలు, వివిధ వర్గాలు చేసిన సూచనలు మాత్రమే. తుది పేరు ఇంకా ఖరారు కాలేదు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com